
ఆంధ్రక్రైస్తవ కవి సార్వభౌముడు పురుషోత్తము చౌధరిగారి

# క్లుప్త జీవితచరిత్ర మరియు కీర్తనలు

**(ఆయన రచించిన అలభ్య కీర్తనలతో సహా మొత్తం - 150)**



**పురుషోత్తము చౌధరిగారు**

**1803 - 1890**


**సేకరణ**

**తలమాల భానుప్రసాద్**

**పెదకాకాని, గుంటూరు**

**సెల్ :91607 58076**

ఆంధ్రక్రైస్తవ కవి సార్వభౌముడు పురుషోత్తము చౌధరిగారి
క్లుప్త జీవితచరిత్ర మరియు కీర్తనలు
అలభ్య కీర్తనలనతో సహా - 150

మొదటి ముద్రణ - 2021, అక్టోబర్.
ప్రతులు - 1000

ప్రతులకు సంప్రదించవలసినది:
తలమాల భానుప్రసాద్
వెంగళరావునగర్
నంబూరు రైల్వేస్టేషన్
పెదకాకాని మండలము
గుంటూరు జిల్లా.
సెల్ : 91607 58076.

సహకరించి మరియు ముద్రణకు సహాయము చేసినవారు:
జేమ్సు జయశీల్ చౌధరిగారు
జొన్నాడ
విజయనగరం.

వెల : 100 /- రూ

ముద్రణ :
దిలీప్ ఆఫ్‌సెట్ ప్రింటర్స్.
విజయవాడ

డి.టి.పి:
తలమాల భానుప్రసాద్

కవరు పేజి డిజైన్:
ఎ. సూర్య ప్రకాశరావు
ప్రకాష్ గ్రాఫిక్స్



**తలమాల సుశీల** (లేటు)

(తలమాల భానుప్రసాద్ మాతృమూర్తి)

# ముందు మాట



పరిశుద్ధగ్రంథములోని సంకీర్తనలలో 119వ సంకీర్తన ఒక ప్రత్యేకమైన సంకీర్తన. భక్తుడైన దావీదు, దేవుడు తన కిచ్చిన ఆత్మనడిపింపుతో హెబ్రీభాషలో 22 అక్షరములను 22 భాగములు, ఒక్కొక్క అక్షరమునకు 8 వచనములు చొప్పున యెహోవా ధర్మశాస్త్రము, దేవుని ఆజ్ఞలు, ఆయన విధులు, కట్టడల యొుక్క విలువ, అవశ్యకత, ప్రాధాన్యతను వివరిస్తూ రచించినాడు.

అదేవిధముగా తెలుగు, సంస్కృత భాషలలో దేవుడు తనకిచ్చిన జ్ఞానం, ఆధ్యాత్మిక చింతన, పరిశుద్ధాత్మ నడిపింపుతో క్రైస్తవలోకానికి ప్రభువైన యేసుక్రీస్తు చరితమును, దైవజ్ఞాన లోతులసారమును, భారత క్రైస్తవలోకానికి, ప్రత్యేకముగా తెలుగు క్రైస్తవ జనాంగమునకు అందించుటకు దేవుడిచ్చిన గొప్పవరం కవి సార్వభౌమ రెవ॥ పురుషోత్తము చౌధరిగారు. హైందవ సాంప్రదాయము నుండి బయటకు వచ్చుటవలన, కుటుంబముతో ఏర్పడిన అనేక అవరోధములను క్రీస్తు కృపచేత, విశ్వాసముద్వారా తట్టుకొని, సహించి, తన అనుభవమును, దేవుడిచ్చిన భాషా ప్రావీణ్యంద్వారా యేసుస్వామి ఘనతను తన కీర్తనల ద్వారా ఉన్నత శిఖరాలకు తీసుకువెళ్ళారు.

మహా భక్తులైన కైలాస మహర్షి, దైవజనులు సాధుసుందర్‌సింగ్‌గారు, దైవజనులు భక్తసింగ్‌గారు వంటివారు వారి సాక్ష్యము, సందేశములద్వారా క్రీస్తు సువార్తను ప్రకటిస్తే...కవి సార్వభౌమ రెవ॥పురుషోత్తము చౌధరిగారు తన సాక్ష్యము, సందేశములు విశ్వాసుల మదిలో ఎల్లప్పుడు నిలిచిపోయి, ఆలపిస్తు దేవుని స్తుతిస్తూ, ఆనందిస్తూ ఆద్యాత్మికముగా బలపడుటకు సాధనాలైన ఈ 150 భక్తి కీర్తనలు రచించిరి.

అట్టి దైవజనుని బట్టి దేవునికి కోటానుకోట్ల స్తుతులర్పిస్తూ... ఈ కీర్తన సంపుటి అనేకులకు ఆశీర్వాదకరముగా ఉండాలని ఆశిస్తూ.... ఈ కీర్తనల సంపుటిని ఎంతో ప్రయాసతో సేకరించి, సిద్ధపరచిన సహోదరులు తలమాల భానుప్రసాద్‌గారికి, వారికి సహకరించిన వారికి మరి ముఖ్యముగా జేమ్సు జయశీల్ చౌధరిగారికి కృతజ్ఞతలు తెలియజేయుచున్నాను.

మీ ప్రయాసము ప్రభువునందు వ్యర్థముకాదని యెరిగి, స్థిరులును కదలనివారును, ప్రభువు కార్యాభివృద్ధియందు ఎప్పటకి ఆసక్తులునై యుండుడి. 1కొరింథీ15: 58.

ప్రభువుసేవలో,
**మెరుగోలు విజయరావు**
లూథరన్ సంఘకాపరి,
పెదకాకాని గుంటూరుజిల్లా.

# ఉపోద్ఘాతము

"రండి యెహోవాను గూర్చి ఉత్సాహ ధ్వని చేయుదము.
మన రక్షణ దుర్గమును బట్టి సంతోషగానము చేయుదము" కీర్తన 95:1.



ఒకని నొకడు కీర్తనలతోను, సంగీతములతోను, ఆత్మసంబంధమైన పాటలుతోను హెచ్చరించుచు, మీ హృదయములలో ప్రభువునుగూర్చి పాడుచూ,కీర్తించూ.......... ఎఫెసీ 5:19.

ఆరాధనలో దేవుని స్తుతించుటకు కీర్తన ఒక గొప్ప సాధనము. సువార్తను ప్రకటించుటకు కూడా. స్తుతించు అనగా కీర్తించు. కీర్తించుట నుండి కీర్తన అనే పదము పుట్టింది. మన పితరులు యేసుక్రీస్తు ప్రభువును రక్షకునిగా అంగీకరించినప్పుడు కుల బహిష్కరణకు గురై సమాజము నుండి వెలివేయబడినారు. వారు దేవుని స్తుతించుటకు, సువార్తను ప్రకటించుటకు కీర్తనలు వ్రాశారు. ఈ కీర్తనలలో వారి విశ్వాసము, శ్రమానుభవము, వాక్యము, సాహిత్యము, సంగీతము ప్రతిఫలించాయి. కీర్తనలు రాగ తాళాలు యతి ప్రాసలతో కూడిన ఛందోబద్ధమైనవి. అందుకే నేటికీ ఈ కీర్తనలు వాటికవే సాటి. ప్రధాన క్రైస్తవ సంఘాలలో విశ్వాసుల చేతులలో బైబిలు తరువాత ఉండేది **"ఆంధ్రక్రైస్తవ కీర్తనలు"** పుస్తకము.

కీర్తనలు శాస్త్రీయ సంగీతానికి లోబడి ఉంటాయి. మనదేశములో ప్రధానమైనవి దక్షిణ భారత "కర్ణాటక" సంగీతము ఉత్తర భారత "హిందుస్థానీ" సంగీతము. కర్ణాటక అంటే అర్థము వీనులకు ఇంపైన. కీర్తనలు వ్రాసి, స్వరపరచి, పాడి వినిపించిన వారిని వాగ్గేయకారులు అంటారు. కర్ణాటక సంగీతాన్ని అభివృద్ధి చేసిన వాగ్గేయకార త్రయము – త్యాగరాజు, శ్యామశాస్త్రి, ముత్తుస్వామి దీక్షితులు.

నేటి మన ఆంధ్రక్రైస్తవ కీర్తనలకు పునాది **"డాసన్–పురుషోత్తము కీర్తనలు"** పుస్తకము తొలినాళ్లలో సంఘారాధనలో ఇంగ్లీష్ హిమ్స్‌ను అనువదించి పాడేవారు. వీటిని మనము సంగీతములుగా వ్యవహరిస్తాము. డాసన్‌గారు లండన్ మిషన్ సొసైటీకి చెందిన మిషనరీ. తెలుగు, సంస్కృతం తెలిసిన భాషాజ్ఞాని. శ్రీకాకుళములో పనిచేయుచుండగా, తెలుగు క్రైస్తవ ఆరాధనలో, సందర్భానుసారమైన కీర్తనలు పాడాలని సంకల్పించారు. ఆయన ఆలోచన ఫలితమే **1846** సం॥లో ఆయన మరియు పురుషోత్తము చౌధరి వ్రాసిన **80** కీర్తనలతో కూడిన డాసన్ – పురుషోత్తము కీర్తనల పుస్తకం ముద్రణ. తర్వాత పులిపాక జగన్నాథం గారి కీర్తనలు చేర్చారు. మన ఈ

ముప్వురూ, క్రైస్తవ వాగ్గేయకారులు. వీరు పైన పేర్కొన్న కర్ణాటక సంగీత వాగ్గేయకార త్రయానికి సమకాలీనులు.

పైన పేర్కొన్న క్రైస్తవ కీర్తనల పుస్తకము వేరే భక్తుల కీర్తనలతో కలిపి అనేక మార్లు ముద్రణ గావింపబడినది. 1936 సం॥లో పది ప్రధాన సంఘములవారు కలసి "ఆంధ్రక్రైస్తవ కీర్తనలు" పుస్తకం రూపొందించారు. దీనిని క్రిస్టియన్ లిటరేచర్ సొసైటీ, మద్రాసు వారు 1937 సం॥లో ముద్రించారు. వీరు1948 సం॥లో ముద్రించిన పుస్తకంలో 350 కీర్తనలు, 97 సంగీతములు ఉన్నాయి. పురుషోత్తము చౌధరి 1833 సం॥ అక్టోబర్ 6వ తేదీన కటక్ పట్నంలో బాప్తీస్మం తీసుకున్నాక ప్రభురాత్రి భోజన సంస్కారంలో పాల్గొన్నప్పుడు తాను రచించిన కీర్తన **"మా యేసుక్రీస్తుని మఱుగు గల్గెనురా"** పాడారు. ఇది తెలుగులో వ్రాయబడిన మొట్టమొదట కీర్తన. తన జీవిత చరమాంకంలో వ్రాసిన చివరి కీర్తన " సకలేంద్రియములారా చాలా మీ పని తీరెన్"ఆయన వ్రాసిన కీర్తనలు ఆంధ్రక్రైస్తవ కీర్తనలు పుస్తకములో 72 మాత్రమే కలవు. తన జీవితంలో జరిగిన సంఘటనల సందర్భంగా వ్రాసిన కీర్తనలు కొన్ని మాత్రమే పుస్తకములో కలవు. మిగతా కీర్తనలన్నీ విలియం డాసన్ గారి కోరిక మేర వ్రాసినవి, తన రచనలు **"రక్షణ చరిత్ర" "నిస్తార రత్నాకరము" "సత్యభజన"** కొరకు వ్రాసినవి. ఆయన కీర్తనలలో చాలా మటుకు "ఆత్మనివేదన" "సువార్త ప్రకటన" "స్తుతి" "పశ్చాత్తాప" "కృతజ్ఞతా" కీర్తనలు. కర్ణాటక సంగీత కీర్తనల రచనాపరంపర 1965సం॥ వరకు కొనసాగినది. తర్వాత లలిత సంగీతము, సుగమ సంగీతము, సినీ సంగీతము బాణీలో పాటలు, గీతములు వ్రాయడము మొదలైనది. 150 కీర్తనలు వ్రాసిన పురుషోత్తము చౌధరిగారిని **"తెలుగు దావీదు"** అన వచ్చునా! ఈ కీర్తనలు సేకరించిన, మనకందిన తలమాల భానుప్రసాద్‌గారి కృషి అభినందనీయము.

1966 సం॥ లో ఆంధ్రప్రదేశ్ కౌన్సిల్ వారు కీర్తనలు, సంగీతములు వేరే బాణీలో రచించినవి మొత్తం కలిపి 621 పాటలుతో ఆంధ్రక్రైస్తవ కీర్తనలు పుస్తకమును స్థిరీకరించారు. అప్పటినుండి కొన్ని సంస్థలు, సంఘములు ఒకటి, రెండు అనుబంధములతో పాటు మన ఆంధ్రక్రైస్తవ కీర్తనలు పుస్తకము ముద్రించుచున్నారు. దేవునికే మహిమ, ఘనత, ప్రభావములు కలుగునుగాక!

**జేమ్సు జయశీల్ చౌధురి**
బాప్టిస్ట్ చర్చ్,
జొన్నాడ,
విజయనగరం.

## ముందు మాట



దేవుని స్తుతించుట మంచిది.
దేవుని నామమును కీర్తించుట బహు మంచిది.
పదితంతుల సితారాతో దేవునినామము ప్రచురించుట
మంచిది.

దేవునికి ఘనత,మహిమ,ప్రభావములు కలుగునుగాక! ఆమేన్

తెలుగు క్రైస్తవ లోకమునకు దేవుడు అనుగ్రహించిన ప్రత్యేకమైన బహుమానము పురషోత్తము చౌధరిగారు. అలనాడు హెబ్రీయులకు బహుమానముగా యివ్వబడిన గొప్ప కీర్తనాకారుడు మహారాజైన దావీదు. ఈనాడు దేవుడు మనకు అనుగ్రహించిన మరొక గొప్ప కీర్తనకారుడు పురుషోత్తముడు. ఈయనను రెండవ దావీదుగా పిలువవచ్చును అని కొందరంటారు.

హైందవ కుటుంబములోనుంచి క్రీస్తు నిజదేవుడని ఎరిగి ఎన్ని అవరోదములు, ఆటంకములు ఎదురైన క్రీస్తునందు అచంచల విశ్వాసమును వదలక యేసే రక్షకుడని లోకమునకు చాటిన మహావ్యక్తి పురుషోత్తముడు. యెషయా 6:3లో ఉన్నట్టు సెరాపులు రెండు రెక్కలతో కళ్లనుమూసికొని,రెండు రెక్కలతో తమ కాళ్ళను కప్పుకొని, రెండు రెక్కలతో ఎగురుచూ దేవుని స్తుతించారు.అలాగుననే పురుషోత్తము చౌధరిగారు లోకాన్ని చూడకుండా తన కన్నులను మూసికొని, తన కులాన్ని కప్పుకొని ఎన్ని కష్టములు వచ్చిన,ఎన్ని అవమానాలు కలిగిన లెక్కచేయక ఆనందముతో ఆ దేవదేవుని స్తుతించి, ఆరాధించి ఈ కీర్తనలను మనకందించారు. ఈ కీర్తనలలో తనను చూపక తన రక్షకుడైన యేసుక్రీస్తునే ప్రతిబించేలాగా రచించి, గానముచేసిన గానకోవిదుడు పురుషోత్తము చౌధరిగారు.

ఇటువంటి మహానుభావుని కీర్తనలు నేడు అలభ్యాము. అయితే వాటిని వ్యయప్రయాసలకోర్చి వాటిని ఒక సంపుటిగా తయారుచేసిన తలమాల భానుప్రసాద్‌గారు ఎంతో అభినందనీయులు. దేవుని దీవెనలు ఆయనకు వెండుగ కలగాలని నేను ప్రార్థిస్తున్నాను. ఈ కీర్తనలు పాడుకునేవారికి మరియు చదువుకునేవారికి కూడా దేవ దేవుని దీవెనలు కలుగునుగాక!

**బల్లి డానియేల్ చంద్రబాబు** (M.A., M.L.Sc.,B.Ed)
సౌత్ ఆంధ్ర లూథరన్ చర్చి,
వాకాడు.

## కీర్తనలు సేకరించినవారి మాట. మరియు కృతజ్ఞతాంజలి.

దేవుని స్తోత్రము కలుగునుగాక!
ప్రియమైన పాఠకులకు.........



పూజార్హుడును నిరంతరము స్తోత్రార్హుడునైన మన ప్రభువు రక్షకుడు అయిన **"యేసుక్రీస్తు"** నామములో మీ అందరికి నా హృదయపూర్వక వందనములు.

**యెహోవా మీద క్రొత్త కీర్తన పాడుడి**
**కీర్తనలతో నేను ఆయనను స్తుతించెదును** కీర్తన 91:1, 28:7

కీర్తన అనగా స్తుతి. అనగా దేవుని మహిమను కీర్తించుచూ దేవునిని గొప్పచేయుట, కొనియాడుట. ప్రభువైన దేవుడు, మనకు చేసే కార్యములకు, మేలులకు కృతాజ్ఞతగా మనము ఆయనను కీర్తించుట. ఈ కీర్తనలలో దేవుని స్తుతించుట "పశ్చాత్తాప" కీర్తనలు, "ఆర్తనాధ" కీర్తనలు, ప్రార్ధన కీర్తనలు కొన్ని ప్రత్యేక సందర్భములలో వాడదగిన కీర్తనలు ఉన్నాయి.

పరలోకములో దేవుడైన యెహోవా తన మహిమ సింహాసనముమీద ఆసీనుడై నిత్యము దేవదూతలచేత "పరిశుద్ధ పరిశుద్ధ పరిశుద్ధ, సేనల దేవా ధరపరలోకంబులు నీ వరమహిమముతో నొప్పునటంచు" గానప్రతిగానము చేయుచున్నారు. భూమికి పునాదులు వేసినప్పుడు దేవదూతలందరు ఏకముగా కూడి పాడి ఆయనను మహిమ పరచినట్లు యోబు గ్రంథములో చూడగలము. ఇశ్రాయేలీయులు ఐగుప్తు బానిసత్వము నుండి విడుదల పొందిన తరువాత మోషే మరియు మిర్యాము కీర్తన వ్రాసి దేవుని ప్రేమను, గొప్పతనము కొనియాడారు అని నిర్గమకాండములో చదువుతాము గొప్ప మహారాజైన దావీదుగారు కీర్తనలు గానముచేసి, దేవుని కీర్తించినట్లు చూడగలము.

యూదులు సమాజమందిరములలో "యెహోవా దేవుని" కొనియాడుటకు ఆరాధించి కీర్తించుటకు కీర్తనలు పాడుదురు. అవే మన పరిశుద్ధ గ్రంథములో ఉన్న **"కీర్తనల గ్రంథము"** ఈ కీర్తనలు అనేకమందిచే అనేక సందర్భములలో వ్రాయబడినవి. వాటిని ఎజ్రాగారు సేకరించి ఒక గ్రంథముగా కూర్చి వారు సమాజమందిరములలో (సబ్బాతు రోజు) మరియు వివిధ సందర్భములలో అనగా పస్కా పండుగరోజు(మత్తయి 26: 26 – 30),పర్ణశాలల పండుగ ,ప్రాయశ్చిత్త దినములో కీర్తనలు పాడుకునేవారు.

ఆలాగుననే క్రైస్తవ సంఘము స్థాపించినావు తరువాత "దేవుని సంఘము కీర్తనలు పాడి లోకమును జయించిరి" అను చందమున పౌలు,సీలలు చెరసాలలో బంధింపబడినప్పుడు కీర్తనలు పాడి శ్రమలలోను వారు ఆనందించిరని చదువుతాము.

ప్రస్తుతము సంఘములో ఆరాధించుటకు "ఆంధ్రక్రైస్తవ కీర్తనలు" పుస్తకములు వాడుచున్నాము. దీనికి మూలము "డాసన్ – పురుషోత్తము క్రైస్తవ కీర్తనలు పుస్తకము" ఈ పుస్తకమే మొట్టమొదటి ముద్రించిన తెలుగు క్రైస్తవ కీర్తనల పుస్తకము. అప్పటినుంచి క్రొత్త కీర్తనలు జోడించి అనేకమైన ముద్రణలు పొందినది.

అయితే తెలుగు క్రైస్తవ కీర్తనలకు ఆధ్యుడుగా చెప్పబడుచున్న పురుషోత్తము చౌధరిగారు ఆయన వ్రాసిన **"మా యేసుక్రీస్తు మఱుగు గల్గెనురా"** అనే కీర్తన మొట్టమొదటి తెలుగు కీర్తనగా చెప్పవచ్చును. ఆయన తరువాత "విలియమ్ డాసన్" పులిపాక జగన్నాధం, బేతాళజాన్, దేవదాసయ్యగారు, మల్లెల దావీదు యింకా అనేక మంది భక్తులు (ఆర్.ఆర్. సుందరరావుగారు వ్రాసిన తెలుగు క్రైస్తవ సాహిత్యము అనే పుస్తకమును 103 భక్తులు మంచి భక్తులను గురించి వ్రాశారు.) అయితే వీరి వ్రాసిన కీర్తనలు చాలా వరకు మరుగున పడిపోయినవి. ప్రస్తుతము మన ఆంధ్రక్రైస్తవ కీర్తనలో చాలా వరకు వీరి కీర్తనలు ముద్రించబడలేదు. ఉదాహరణకు పురుషోత్తము చౌధరిగారు **కీర్తనలు, భజనలు, ద్విపదులు** మొత్తం కలిపి 180 కీర్తనలు వరకు రచించారు. అయితే ప్రస్తుతము ఆంధ్రక్రైస్తవ కీర్తన పుస్తకములో 73 వరకు మాత్రమే కలవు మరియు కొన్ని చరణాలు కూడా ముద్రించలేదు. **"మంగళకు యేసుక్రీస్తు"** అనే కీర్తన వాస్తవముగ '9' చరణాలు అయితే 6 మాత్రమే ముద్రించారు. **"నీ చరణములే నమ్మితి"** అనే కీర్తనలో ప్రస్తుతము '8' చరణాలు మాత్రమే కలవు కానీ ఆ కీర్తనలో '14" చరణాలు కలవు. తరువాత విలియం డాసన్ గారు దాదాపు 60 కీర్తనలు వ్రాసినారు. కాని ప్రస్తుతం కీర్తన పుస్తకములో 14 కీర్తనలే ముద్రితమైనవి. అలాగే పులిపాక జగన్నాధం గారివి 29 మాత్రమే ఉన్నవి. అయితే ఆయన "41" కీర్తనలు వ్రాసినారు. ఇంకా ఆంధ్రక్రైస్తవ కీర్తనలు పుస్తకములో మొదటి కీర్తన **"అన్నికాలంబునున్న యెహెూవా"** రచయిత అయిన బేతాళజాన్‌గారు దాదాపు 50 వరకు కీర్తనలు రచించి గానము చేశారు. అయితే 17 మాత్రమే ముద్రించారు మరియు మన పెళ్ళిళ్ళలో గానము చేసే **"విందుపరమందు"** అనే కీర్తన '6' చరణాలు మాత్రము ముద్రించారు. అయితే ఆ కీర్తనలు దాదాపు 20 చరణాలు వరకు ఆయన రచించారు.

అదే విధముగా ఇంగ్లీషు హిమ్స్‌ను అనువదించి గానము చేసిన వాటిలో మొదటివారు హర్మన్స్‌బర్గ్ మిషనరీ అయిన హెచ్ హర్మ్స్‌గారు, ఆంధ్రక్రైస్తవ కీర్తనలు పుస్తకములో **"ఇమ్మాయేలు రక్తము"** అనే కీర్తనను అనువదించారు. ఆంధ్రక్రైస్తవ కీర్తనలు పుస్తకములో ఆయన అనువదించిన హిమ్స్ '4' ఉన్నాయి. అయితే ఆయన ప్రచురించిన కీర్తన పుస్తకములో (1879) లో జర్మన్, ఇంగ్లీషు భాషలలోనుండి ఆయన అనునదించిన కీర్తనలు దాదాపు 50 వరకు కలవు. కడియం గ్రాబియేల్ గారు '5' కీర్తనలు మాత్రమే ఆంధ్రక్రైస్తవులు పుస్తకములో కలవు. అయితే ఆయన దాదాపు '30' వరకు ఇంగ్లీషులో కీర్తనలు అనువదించారు. ఈ కీర్తనలు 1916 సం॥ రాజమండ్రివారు ముద్రించిన తెలుగు క్రైస్తవ కీర్తనలు పుస్తకములో కలవు. బేతాళజాన్‌గారు ఒకటి, ఆగ్నేష్ పాడేగారు

దేవసయ్యగారు, ఆల్ ఫ్రెడ్ త్యాగరాజు పామరుగారు కొన్ని హిమ్స్ అనువదించారు. అయితే ఇవి చాలా వరకు అముద్రితములు, ప్రస్తుతము ఇవి అలభ్యము అయితే వాటిని నేను సేకరించి,కొన్ని కీర్తనలకు అర్ధములుకూడా తయారుచేశాను. ఈ అర్ధములు తయారుచేయుటకు నేను ఉపయోగించిన గ్రంథములు శ్రీ శబ్ధరత్నాకరము (1922సం॥), ఆంధ్రసాహిత్య సర్వస్వము(1972) మరియు తెలుగు నిఘంటువులు. మొదటి ప్రయత్నముగా పురుషోత్తము చౌధరి గారు కీర్తనలు మాత్రము మొదటి పుస్తకముగా అచ్చు వేయుటను వీలు కలిగించిన దేవ దేవునికి మహిమ, ఘనత, ప్రభావము ఆయనకే చెల్లునుగాక!

**– తలమాల భానుప్రసాద్**
(కీర్తనలు సేకరించినవారు)

## కృతజ్ఞతాంజలి

ప్రియమైన పాఠకులకు........

ప్రియులారా! ఈ కీర్తనలు సంకలనము చేయుటకు మరుగుబడిన సాహిత్యమును తెలుగులోనికి తీసుకొని రావడానికి జ్ఞానము దయచేసిన దేవాది దేవునికి ముందుగా నా హృదయపూర్వక అంజలిగొనుచున్నాను. ఆయన సంకల్పము లేనిదే ఏది జరుగుదు. ప్రభువుకే ఈ కీర్తనల వలన మహిమ, ఘనత, ప్రభావములు కలుగునుగాక!

తరువాత ఎంతో నెమ్మదస్తులు, మంచి మనస్సు కలిగిన నా తలిదండ్రులైన తలమాల సుశీలమ్మ(లేటు), సామ్యూల్ గార్లు. మా తల్లి గారు ఎంతో ఓర్పు, సహనము కలిగి జీవించి ఎంతో ప్రోత్సాహకరముగా ఉండేది. నా పెద్ద సోదరుడైన తలమాల అనీల్ కుమార్(B.A., B.Ed.)' ,నా తమ్ముడు డా॥ తలమాల సురేష్(M.B.A., M.COM., P. HD)' ఆయనభార్య సుహన్య మరియు వారి కుమారులు తలమాల అఖిల్, తలమాల అనిష్. నా సహోదరి అన్నపూర్ణ, దానియేలును, నా మేనకోడలు నివేదిత. మా చిన్నమ్మ వారి పిల్లలు అయిన కొండా జయప్రద షారోను మరియు కిరణ్ కుమారు, మరియు మా మేనమామ గారైన గుండాల ప్రసాద్‌గారు వారి సతీమణి ప్రేమమ్మగారు వారి పిల్లలు గుండాల.వినయ్‌కుమార్, గుండాల.దేవకరుణా. ఆలాగునే నా సమీప బంధుగణము.

మరియు ముఖ్యముగా ఈ కీర్తనలు సంకలనము చేయుటకు పుస్తక రూపములో తీసుకొని రావడానికి నన్ను ప్రోత్సహించి అనేక విధములుగా సహాయము చేయుచూ ఉన్న పురుషోత్తము చౌధరిగారి అయిదవ తరమునకు చెందిన మనమడు జేమ్స్ జయశీల్ చౌధురిగారు ఈయన గారు చౌదరి గారి మరుగుపడిన దాదాపు “25” పుస్తకములను సంకలనము చేసి 2003, 2004 సంవత్సరములలో రెండు భాగాలుగా ముద్రించారు.

మరియు పురుషోత్తము చౌదరిగారి సమగ్ర జీవిత చరిత్రను మేము ముద్రించాము. ప్రస్తుతము చౌధరి గారి సాహిత్యము మరియు ఆయన జీవిత చరిత్రను కలిపి ఒక సంపుటిగా చేయుటకు ప్రయత్నము చేయుచున్నాము. జేమ్సు జయశీల్ చౌధురి చేసిన మరొక ముఖ్యమైన ఎంతో వ్యయప్రయాసలకోర్చి **"ఆంధ్రక్రైస్తవ కీర్తనలు"** పుస్తకములోని దాదాపుగా 250 కీర్తనలను కర్నాటక సంగీతములోను మరియు 100 ఇంగ్లీష్ అనువాద సంగీతములను పాడించినారు. మరియు అలభ్య కీర్తనలు కూడా 14 రీకార్డుచేసి వాటిని యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేశారు. ఇది ఎంతో గర్వించదగిన విషయము.

మరియు బైబిలు అధ్యాపకుడిగా సేవలంది,బహు పుస్తకములు రచించిన, ప్రొఫెసర్.ఆచార్య రెవ.డా॥రావెల జోసఫ్‌గారు. పాస్టర్ విద్యాసాగర్ (విశాఖపట్నం - 29,వైజాగ్) గారికి, మరియు ముఖ్యముగా టైపుచేసిన దానిని సెటింగ్ చేయుటకు సలహాయిచ్చి,సహాయముచేసి,కవరు పేజి డిజైన్ చేసిన అదపురెడ్డి సూర్యప్రకాశరావు,(ప్రకాశ్‌గ్రాఫిక్స్,గుంటూరు) గారికి ఇంకా నన్ను ప్రోత్సహించిన పాస్టర్॥ యేసురత్నంగారు తక్కెళ్ళపాడు,గుంటూరు. అలాగే పాస్టర్॥ నంబూరి యేసుదాసుగారు ఉప్పలపాడు,పెదకాకాని,గుంటూరు, బ్రదర్॥ గాదె.బెంజిమన్‌గారికి, మరియు దేవరపల్లి డేవిడ్ (పెదకాకాని)గారు, దారా విజయకుమార్(యం.బి.టిచ్) పాతగుంటూరు,గారికి ముందుమాటలు వ్రాసిన పాస్టర్॥యం.విజయరావు, వారి సతిమణి గారికి, అదేవిధము బల్లి.డానియేల్ చంద్రబాబు గారికి ...

ఈ పుస్తకమును అందముగా ముద్రించిన దిలీప్ ఆఫ్‌సెట్ ప్రింటర్స్. విజయవాడ వారికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు.

**తలమాల భానుప్రసాద్**
**వెంగళరావునగర్**
**నంబూరు, పెదకాకాని**
**గుంటూరుజిల్లా.**
Cell : 91607 58076.

# పురుషోత్తము చౌధరిగారి క్లుప్తజీవిత చరిత్ర

ఆంధ్ర క్రైస్తవ శాస్త్రీయ సంగీత వాగ్గేయకారులలో ఆరాధ్యుడు, శిఖరప్రాయుడు, మొట్టమొదటి క్రైస్తవ కీర్తనకారుడు కవి సామ్రాట్ పురుషోత్తము చౌధరిగారు. ఏకాంత ధ్యానములోగాని, కుటుంబ ప్రార్థనలలోగాని,సంఘారాధనలోగాని వారి కీర్తనలను ఆలాపించని వారుండరు, చౌధరిగారి కృతులు లేని క్రైస్తవ కీర్తన పుస్తకమును మనమూహింపగలమా! మందిరాలలో బృందగానములు చేయుటతో తృప్తి పడక, నగర సంకీర్తనము చేయుట వలన వారి కీర్తనలను విశేషముగా ప్రచరము చేయగలము.

పర్లాఖిమిడి (ఒరిస్సా) ప్రాంతములో స్థిరపడిన యొక బెంగాల్ బ్రాహ్మణ కుటుంబములో కూర్మనాథ చౌధరి మరియు సుబద్రాదేవి చౌధురాణి యను పుణ్య దంపతులకు **1803 సం॥ సెప్టెబరు 5వ తేదిని** ద్వితీయ సంతానముగా మదనపుర మందు పురుషోత్తముడు జన్మించెను. "చౌధరీ" యనునది యింటి పేరు కాదు. వంగీయులకు, ఉత్కళులకు ఇంటి పేర్లుండవు. పురుషోత్తముగారి పూర్వీకులు ఒక కాలమున చాల గ్రామములు కలిగి వుండి వారా గ్రామముల శిస్తుదస్తుల ఇప్పటి కలెక్టర్ల వలె వసూళ్లు చేసి అప్పటి ప్రభుత్వము వారి యధీనము చేయుచుండిరి.కనుక "చౌధరీ" లేక "చౌధరి", అనునది నాలుగు పరగణాల మీద లేక గ్రామముల పైన అధికారి కియ్యబడిన బిరుదమనియు వంగీయులందరు. "చటోపాధ్యాయ" యను సంజ్ఞారీతిని చతుర్ధరీ (చౌధరి) యనునది చతుర్వేద పరాయణులకుండు బిరుదమనే భావమును గూడ పురుషోత్తము చౌధరి గారి చారిత్రమును ఉత్కళ భాషలో వ్రాసిన బరంపుర వాస్తవ్యులగు రెవరెండు అనామచంద్ర పాత్రో గారు ప్రకాశింపజేసి యున్నారు. ఇరువది యొకటవ దిన మా గృహమున విశేషపర్వదినమై యొప్పెను. ఆ బారసాల నాడు బంధువులకు విందొనర్చబడి ఆ శిశువునకు పురుషోత్తమను నామకరణము చేసి, ఉయ్యాలలో వేసిరి.అయిదవ యేట పురుషోత్తము చౌధరీగారునకు అక్షరాభ్యాసము మహోత్సవముతో గావించిరి.

వీరు వంగ, ఉత్కళము, హిందుస్తానీ, ఓఢ్ర, తెలుగు, సంస్కృతము, నేర్చిన బహుభాషాకోవిదులు, వయసు హెచ్చిన కొలది పురాణేతిహాసములనే గాక, వేదపారాయణము కూడా చేయుచు, సంధ్యావందనాది నిత్యకృత్య నిరతులైన ఏక సంథాగ్రాహులలోనొకరై అమరాంధ్రములలో పాండిత్యం గడించిరి. మహాభారత, భాగవత, రామాయణములను ముమ్మారు పూర్తిచేసిరట బాల్యముననే పురుషోత్తముడు.

విష్ణు సంబంధమైన విగ్రహోపాసములు చేయుచు జపస్నాన ఉపాసములందును తీర్థయాత్రలు చేయుటలోను మిగుల శ్రద్ధగలిగి భుజముల మీద శంఖుచక్రములు కాల్పించుకొని గురువులు నేర్పిన మంత్రములను పఠించుచు తిరునామ కీర్తనలు పాడుట వీరి నిత్యకృత్యములట. ఈయన చాలా కౌతుకము కలవాడై తెనాలి రామకృష్ణ కవి వలె వికటముగ పరులకు ఉత్సాహము కలిగించెడివారు. యౌవనావస్థలో

పలుశృంగార కావ్యములు చదివిరి. తన చతురతతో పర్లాఖిమిడి దర్బారులోనూ, సంగీత కచేరీలలోనూ, సభికులను మెప్పించి సెహభాష్ అనిపించుకొనెడి వారట.

ఇరువదియవ యేట మేనమామ రఘునాథ పాల్ మహంతిగారి కుమార్తెయగు **రాధామణి దేవికి** తొమ్మిదవ యేట, సప్తదిన వివాహము మహావైభవముగా జరిగినది. పురుషోత్తముడు ఉపాధ్యాయవృత్తి చేపట్టి, బ్రాహ్మణోత్తమునిగా అనేక పద్య, గద్య భాగములను రచించిరి. భక్తి, జ్ఞాన, కర్మ, యోగాది సాధములన్నింట శిక్షణ బడసినను ఆత్మలో శాంతి పొందుటకు వేదాంతియై కౌపీనధారియై, అవధూతయై అఘోరియై, దిగంబర సాధువులతో కూడా దిరుగుచు శాంతిలేక మోక్ష మార్గమేది యని చింతించు సమయమున, రాతి యక్షరములతో మోటురకపు కాగితములపై యచ్చుపడి **"క్రీస్తు మతగురువులు ఈ సీమ సమస్త జనులకు వ్రాసిన పత్రిక"** యను శీర్షికతో ఉన్న 9వ నెంబరు పత్రికను 1825సం॥ పురుషోత్తము చౌధరిగారికి విద్యావంతులైన వారి అన్నయగు జగన్నాథ చౌధరిగారిచ్చి యుండిరి. ఆ దినములలో పురుషోత్తము చౌధరీ గారు దాని చదివినను దాని సారాంశము గ్రహింప లేక దానిని తన పెట్టెలో పడవేసిరి. భగవత్ప్రేరితుండుగా వెళ్ళినోయన నా కాలమున పర్లాకిమిడిలో సర్వే కార్యమున నుండిన లెఫ్టినెంటు హిల్ అను ఇంజనీయరు మదనాపుర ప్రాంతమున కొండలు కొలుచుటకు వెళ్లగా ఆ శ్వేతముఖిని దర్శన మొక విద్యుత్సారమువలె పురుషోత్తము చౌధరికి దట్టి వెంటనే యేడేండ్ల క్రిందట తాను పెట్టెలో వేదాంత గ్రంథ సముదాయమున దాచియుంచిన పై క్రైస్తవ పత్రిక జ్ఞాపకమునకు వచ్చెను. అదియే దేవుడాయనను దర్శించుట! వెంటనే ఆయన పెట్టెలో వెతకి దానిని బైటకి తీసి తిరిగి చదివెను. ముందాయన దానిని చదివినను గ్రహించి యుండలేదు . అందు పరమాత్ముడగు దేవు డొక్కడేననియు ఇతర దైవము లక్కరకు రావనియు, ఇత్యాది సుభోదలు తేట తెల్లముగ నున్నవి.

ఈ మంగళవార్త కరపత్రికను చదివినను "దేవుడొక్కడే, దేవతలు కేవలం మానవకల్పితములను సారాంశము ఆయనకు ఇబ్బందిగా తోచెను. అయినను నాటినుండి ఆయనలో సత్యాన్వేషణ ప్రారంభమాయెను. అంశములు మూడు. విగ్రహారాధన, కులాచారము, సాంఘిక దురాచారమనునవి. ఈయన హిందూమత ద్వేషికాదుగాని, నాటి సామాన్యప్రజల అమాయకత్వమును ఆసరాగా తీసికొని పెచ్చు పెరిగిన పూజారి తంత్రమును కఠినముగా నిరసించుట గురిగా పెట్టుకొనెను. ఈ మాన్యుడు తలపెట్టుకొనిన సంస్కరణలను ఆ వెనుక వచ్చిన విదేశి మిషనెరీ ఉద్యమములలో నెరవేరినవి. మొదట కథోలిక్, ఆంగ్లికన్ మతాచార్యులను వెదకి, నిరాశ చెందిన వీరికి ఒక బ్రిటిష్ అధికారి భార్య హెలెన్‌నాట్ ఆధ్యాత్మిక జనని అని చెప్పవచ్చును. తరువాత పురుషోత్తము చౌధరిగారు, దొరసానమ్మ దగ్గరకు వెళ్లగా ఆమె 1829సం॥ చెన్నపురి బైబిలు సొసైటీవారిచే నా పురమున ముద్రింపబడిన ఆంధ్ర నూతన నిబంధన నొక ప్రతిని అనగా **"లూకా శుభవార్తమానము"ను** యిచ్చిరి. ఆ శుభ వర్తమానము గ్రంథము నాయన ఆమూలాగ్రముగ శ్రద్ధాభక్తులతో, చదివి ముఖ్య భాగములను

పెన్సిలుతో గుర్తించి యుండుట నేటికిని నందు జూడగలము. మేజరు దంపతులు క్రైస్తవ వేదములోని సంగతులను, వాక్యముల నక్కడక్కడ జూపించుచు పనస పండు విప్పినటుల బోధించుచు ఆయనను ధైర్యపరుప శ్రమ పుచ్చుకొను నంతటి యోపిక కనపరచిరి.

1833సం॥ జూన్ 10వ తేది యజ్ఞోపవీతము (జంధ్యము)ను స్వచ్ఛందముగా త్యజించి భక్తుడైన మేజరు బ్రెట్ గారికి సమర్పించి బహిరంగమగా తన జాతిని, ఆస్థిని పరిత్యజించెను. తరువాత ఆయన రెవ.చార్లెస్ లేసీగారు వలన **1833 సం॥ అక్టోబర్ 6వ తేది** ఆదివారము సర్వాంగ జ్ఞానోదయ దీక్షాస్నానము పొందుటకు 300మైళ్ళు ప్రయాణము చేసి ఒరిస్సా రాష్ట్రములోని కటక్‌పురిలో గంగా మందిరము అనే కోనేటిలో బాప్తీస్మమును ప్రవేశాచారము వలన బహిరంగముగా అందరు చూస్తు ఉండగా క్రైస్తవ ధర్మమును స్వీకరించెను. ఆ సాయంకాలముననే ప్రభు కృపావర ప్రసాదమును సమీపించి పరిశుద్ధ సమభాక్త్యమును గ్రహించెను. అప్పుడే పురోషోత్తము చౌధరిగారు తొలి తెలుగు క్రైస్తవ కీర్తన వ్రాసి, పాడిరి అదే మొట్టమొదటి తెలుగు క్రైస్తవ కీర్తన. అది **"మా యేసుక్రీస్తుని మరుగు కల్గెనురా"** అనే కీర్తన. తరువాత ఆయనను కుటుంబీకులు బహుగా హీనపరచి అవమానించిరి. అయినను ఆయన వెనుదిరగలేదు. చివరకు తన భార్యకూడా ఆయను అవమానించినది. కాని దైవచిత్త ప్రకారము రాధామణి దేవిగారు, ప్రభువుని అంగీకరించి 1835సం॥ డిసెంబర్ 22 తేదిన సాహసించి తన భర్తను వెంబండించెను. ఆమె 1836 సం॥ ఏప్రిల్ 3వ తేదిని రెవ.ఆమోస్ సట్టన్ గారి వలన కటక్ వద్ద మహానదిలో పరిశుద్ధ బాప్తీస్మమును పొందెను. అంతట పురుషోత్తముడు కేటకీస్టు హోదాలో సువార్త ముసాపురి నీటను, మెట్టను ప్రయాణము చేసి అనేక ప్రాంతములు తిరిగిరి.

ఈ భక్తవర్యుని గుణశీలములను మతాశక్తిని పరీక్షించి ప్రేషితుడిగనుండ యోగ్యులని నిశ్చయించిన మీదట 1836 సం॥ ఏప్రిల్ 24వ లేదిన కటక్‌పురిలో ఆదివారమున ముగ్గురు మిషనరీలు ఆయన తలపై హస్త నిక్షేపణమును చేసి పరిశుద్ధ పరిచర్య ధర్మము నెరపుటకు అభిషేకించిరి. పదేండ్లు ఘనమైన నిర్విరామ సువార్తసేవ చేసి బరంపురము వచ్చు సరికి సాతాను గర్జించు కొదమ సింహము వలె ఈ భక్తుని చీల్చి తినివేయుటకు కాచుకొనియుండెను. తాను చేసిన తప్పిదము గూర్చి దివారాత్రములు తన మనసాక్షి చేయు నేరారోపణకు తట్టుకొన జాలక పశ్చాత్తాపముతో కృశించి కటకపురి పోయి సేనానివేశన స్థలమున పల్లపు ప్రాంత నదీ తీరమున ఏకాంతముగ దినములు గడుపుచుండెను. ఒకానోక దినమున ఉత్తమ మనస్తాపముతో మహానది తీరమున నున్నయొక సొరంగమున దినమెల్ల దు:ఖక్రాంతుడై "త్రాహిమాం క్రీస్తునాథా" యను పాప విలాప గీతమును గొప్ప ఆర్తితో వ్రాసుకొనెను. కటకము తిరిగి వచ్చి ఎవ్వరిని చూడక ఒంటరిగా దినదినము కుమిలి పోవుచుండగ ఆయనకు బాప్తిస్మము సాన్నదీక్ష నిచ్చిన రెవ . చార్లెస్ లేసీ దొరగారు అనుదినము పరామర్శించు చుండ తన పాపము క్షమింప బడనేరదను నిరాశను వ్యక్త పరచగ జేసువు పాప

క్షమార్పణ దాతకాదేమో అను "అవిశ్వాసమే మహా పాపమని" చెప్పినంతనే భక్తవర్యుడు తన విశ్వాసమును కూడగట్టుకొని 1845 సం॥ "ఎందుకే చింతిచెదవు" యను ఓదార్పు కీర్తన వ్రాసుకొనెను. వారే మరియొకసారి "పురుషోత్తము సోదరా మీ పాపములు ఎక్కువైనవా? క్రీస్తుని స్లీవ రక్తపు చుక్క విలువ యెక్కువైనదియా? యని ప్రశ్నింప చౌధరి గారి సందేహమంతయూ పటాపంచలై శుభప్రద నిరీక్షణతో **"సందియము వీడవే"** యను కీర్తన వ్రాసుకొనెను. శరీరేశ్చ, నేత్రాశ, జీవపుడంబమను శోధనల పరంపరలచే ఐహిక విషయముల వైపు ఈడ్వబడు తరుణములో ఆత్మ సంబోధనముగ "వద్దుమనసా – బుద్ధికురుచ" యను హెచ్చరిక గీతమును వ్రాసెను. ఆ వెనుక పరితాపము, పాపపు టొప్పుకోలు, పశ్చాత్తాపము నొంది క్షమానుభవము గలవాడై "యెహోవా నా మొరలాలించెను" యను ప్రార్థనా ప్రతిఫలానంద గీతమును వ్రాసెను. పిమ్మట మిషనరీ మహాసభలో విల్యం డాసన్ దొర ఆహ్వానం మేరకు శ్రీకాకుళం చేరి ఆంధ్ర ప్రాంతములో సేవాకార్యము చేయుట ప్రారంభించిరి.

ఆ కాలమున పురుషోత్తముగారు, డాసన్ దొరగారికి వ్రాత కోతలలో తోడ్పడుచుండ నుభయులును గలసి క్రైస్తవ సంఘములకు వలయు గ్రంథ రచనము నందు కొంతకాలము గడిపిరి. డాసన్ గారును ఆంధ్ర కవిత్వమున కొంత ప్రవేశము గలవారట. కొంతకాలమునకు డాసన్ గారు వ్రాసిన కీర్తనలు మరియు చౌధరి పురుషోత్తము గారి కీర్తనలతో "మొట్ట మొదటి తెలుగు కీర్తన పుస్తకము **"డాసన్ – పురుషోత్తము కీర్తనల పుస్తకము**" అనే పేరుమీదు అచ్చు వేయించారు. రెండవ ముద్రణ గురించిన సమాచారము అలభ్యము. తరువాత 1869 సం॥ మూడవ ముద్రణమున జరిగించిరి. దానిలో పురుషోత్తము గారి కీర్తనలే 80 వరకు కలవు. గాని పురుషోత్తము చౌధరిగారు కీర్తనలు, భజనలు, పాటలు, దరువులు, ద్విపదలుగా వింగడింపబడినవి. వెరసి 180 పైనే కనబడుచున్నవి. పురుషోత్తముగారు మిషనెరీలకు మున్షిగాను,ద్విభాషి గాను పనిచేశారు.

చౌధరి గారికి రహస్య ప్రార్థన చేసుకొను వాడుక కలదు. నాగావాళి నది ఇసుక తెన్నెల మీద అర్థరాత్రి వరకు ధ్యానించి, ప్రార్థించి, కీర్తించెడివారు. వారి సతమణి బిడ్డలను దైవభక్తితో నడిపించారు. ధన్య జీవులకు ఇద్దరు కుమారులు, నలుగురు కుమార్తెలు కలరు. 1851 సం॥ సెప్టెంబర్ మాసమున రాధామణిదేవిగారు ప్రభువు నందు నిద్రించెను. అప్పటికి ఆయన వయస్సు నలుబది యెనిమిదేళ్ళు. అయినను ద్వితీయ వివాహము గూర్చి ఆయన ఎన్నడు తలంచలేదు. ఆయన సోదరి కుటుంబ సంరక్షణకు సహకరించెను. భక్తవర్యుని సాక్ష్యజీవిత పలితముగా తుదకు వారి అన్నగారి యిరివురు కొడుకులు స్నానదీక్షను స్వీకరించిరి. మన భక్తవర్యుడు అడుగినడిన ప్రదేశములు ఆ వెనుక ప్రేషితద్యమ కార్య సీమా కేంద్రములుగా వర్థిల్లినవి.

మరియు వీరి స్నేహశీలమే వివిధ శాఖలలో సంఘైక్యతకు నాందియై వారి తదనంతరం బాప్టిస్ట్,లూధరన్, బ్రదరన్(జి.డి.యం), వారుకలిసి రూపొందించిన 1893

సం॥న తెలుగు క్రైస్తవకీర్తనపుస్తకమే నేటి ఆంధ్రక్రైస్తవకీర్తనపుస్తకం 1966 సం॥ కూర్పుగా భాసిల్లుచున్నది.

పదవి విరమణ అనంతరము భక్తుడు చౌధరి గారు పాస్టర్ దాన్. అంతర్వేదిగారును కలిసి కడు వృద్ధాప్యము వరకు నమ్మకమైన గొప్ప సేవ ఒరిస్సా ప్రాంతంలో చేసిరి. కవి గారు బ్రతికియుండగానే వారి పెద్ద అల్లుడు, ఇద్దరు కొడుకులు, రెండవ కుమార్తె అమె కుమారుడు (మనమడు) మరణించిరి. 1882 సం॥ తాను బహుగా ఎదురుచూచిన మోక్ష ప్రవేశ మాసన్నమైనదని **"పైనమైయున్నయ్యా" ఆ వెనుక "సకలేంద్రీయములారా"** యను కీర్తన వ్రాసిరి. చివరకు 1890 సం॥ ఆగస్టు 23వ తేది పరమపదించిరి. ఈ రెండు కీర్తనలకు ఉపసంహరింపబడిన చరణములలో ప్రసిద్దుల సాంప్రదాయముననుసరించి కృతికర్త ముద్రలు "దాసుడు పురుషోత్తమకవి" యని యున్నట్లు ఋజువులు కలవు. కడవరి దినములలో తనకు ప్రియమైన కీర్తన **"ఒక్కసారి జూపవో యేసునాధా"** యను కీర్తనను మిక్కిలి మక్కువతో చేతులు జోడించి తల ఊపుచూ పలుమారులు పాడెడివారట.

పురుషోత్తము చౌధరి గారు మతాస్వీకారానంతరము వ్రాసిన పద్య గద్య రచనలు

1833 – కులచార పరీక్ష, ముక్తిమార్గ ప్రదర్శనము, జగన్నాధపరీక్ష

1845 – యేసు నాయక శతకము, యేసుక్రీస్తు ప్రభు శతకము,

1846 – రక్షణ చరిత్ర, నిస్తార రత్నాకరము,

1847 – విగ్రహ నిర్మాణము, పంచచామర పన్నములు, పంచరత్నములు

1851 – క్రైస్తవ నీతి ప్రకాశము, 1853 – బ్రహ్మ జ్ఞానము

1863 – మశుచి విశూచి సంకట భ్రాంతి నివృత్తి, మనసేమూలము

1871 – సత్యవేద సార సంగ్రహము, 1874 – సత్య భజన

1884 – దేవుని విరాడ్రూప వర్ణణము

ప్రస్తుతానికి అలభ్యాలు బైబిలు సంబంధాశ సూచిక, దైవిక శాంతి మార్గము, ఆంధ్ర ప్రగంగములు, 1877 తీర్పు దినముపై ప్రసంగము, 1877 రెవ. జాన్ హే దొర వారి బైబిల్ అనువాదంలో సహకరించిరి. పురుషోత్తమ చౌధరిగారు "నగర సంకీర్తనములను" ప్రవేశపెట్టిన శ్రీ త్యాగరాజ స్వామికి వీరు సమకాలీనులు అగుట వలన తనదైన శైలిలో చక్కటి "మంగళ వార్త గీతికలను" రచించి ఆర్తితో వీధులలో ఆలాపించిరి. కీర్తనల గూర్చి కవి గారి జీవిత కాలములోనే తెలుగు నేర్చిన మిషనెరీలు వ్యాపించియున్న ఆఫ్రికా, బర్మా, మోల్మేన్, రంగూన్, తెలంగాణా, ఖరగ్‌పూర్, తాతానగర్, ఇంగ్లాండ్, కెనడా, అమెరికా మున్నగు ప్రాంతములకు వీరి కీర్తనలను ప్రపంచీకరము చేసిరి.

**– బి.డి.పి రావుగారు**

**రాజమండ్రి.**

1.

## క్రీస్తునందు ఆనందించుట.

రా - ముఖారి తా - త్రిపుట.

మా యేసు క్రీస్తుని - మఱుగు గల్గెనురా = నా యాత్మ ఘన రక్షా -నగము[1] నెక్కెను రా ॥మా యేసు॥

1. ముందు నాలో పాప - ములుజూడ బడెరా దెందము[2] తానన్ని - టిని నొప్పుకొనెరా = యందుకై బలు దు:ఖ మాత్మ జెందెనురా - సందేహములు వీడు[3] - జాడ గన్గొనెరా ॥మా యేసు॥

2. సువిశేష బోధనా - చెవు లాలించెనురా - అవివేక శాస్త్రోక్తు[4] - లంటు వీడెనురా = నవసత్క్రైవవ[5] గోష్ఠి - భువి నా కబ్బెనురా - వివిధములగు వేల్పు[6] ల్విష మైరిగదరా ॥మా యేసు॥

3. బాధగురువుల మోము - ల్బహు[7]లజ్జబడెరా - గాధ[8] మంత్రములన్ని -కడ గండ్లయి[9] చెడెరా = శోధించి నా యాత్మ - శుద్ధిగోరెనురా - సాధించి ప్రభుక్రీస్తు - శరణుజొచ్చెనురా ॥మా యేసు॥

4. మతిలోని లోతు మ - ర్మము గానబడెరా - మితిలేని ఘనపాప - మే నిందు కొనెరా = హితముగా[10] తన జీవ - మిచ్చె క్రీస్తుడురా - మృతిచేత మన పాప - వితతి[11] గొట్టెనురా ॥మా యేసు॥

5. కులగోత్రముల బుద్ధి - కుటిలంబు[12] దెగెరా - బలవత్పిశాచ శృం - ఖలము[13] విరిగెనురా = సిలువ మోసినవాని - చిర సౌఖ్యోన్నతిరా[14] - నెలవుగ[15] నాలోన - నిలచి యున్నదిరా ॥మా యేసు॥

6. రాగ ద్వేషముల సం - భ్రమ[16] మెల్ల జెడెరా - మూగ బొమ్మలు పాదముల ద్రొక్కబడెరా = యోగ మార్గములన్ని - యోటి కుండలురా - సాగు[17] పాపపు బుద్ధి చతికిల్ల బడెరా ॥మా యేసు॥

7. తనపోల్కె[18]నొరుల గ - న్గొన ప్రేమయ్యెనురా - మనసు దేవునికి న - ర్పణసేయ బడెరా = ఘన కృపశాంతులు[19]- గొనెను నెమ్మదిరా - మనసు మార్పడి మోక్ష - మహిమ గన్గొనెరా ॥మా యేసు॥

---

(1). 1.కొండ 2.మనసు 3.విడిపోవు 4.శాస్త్రములో మాటయొక్క 5.నూతనమైన మంచి క్రైస్తవసహవాసం 6.దేవుండ్లు 7.సిగ్గు 8.చిక్కైన 9.బాధకరములు 10.అనుకూలముగ 11.పాపముల సమూహము 12.చెడ్డ బుద్ధులు 13.సంకెళ్లు 14.నిత్యమైన 15.స్థిరముగా 16.ఓర్వలేనితనము, విరోధములు వీటియందు 17.విస్తరించే 18.తనవలె 19.గొప్పదయ,శాంతి.

1833సం॥ కటకపురిలో బాప్తిస్మముగైకొని, ప్రభురాత్రిభోజన సంస్కార సందర్భముగా ఆలపించిన స్వీయకృతి.

**2.**

## దేవుడు మన విమోచకుడు.

రా - కేదారగౌళ　　　　　　　　　　　　　　　　　　తా - ఆది

దేవా - దివ్యానంత ప్ర - భావ[1] - మాంపాహి[2] ఘన యె - హోవా = స్థావర జంగమ -సహిత[3] నిఖిల జగ[4] - దావన[5] పావన - భావ నిరంతర ॥దేవా॥

1. సార[6] - కారుణ్యపారా - వారా[6] - సర్వజ్ఞ[7] నిర్వి - కారా[8] - యేసు నామావ - తారా - దీన జనోప - కారా = ఘోరమైన సం - సారాటవిబడి[9] - దారి గనని నను - జేరబిలిచితివి ॥దేవా॥

2. అక్షీ - ణ విభవానంద[10]- మోక్ష - రాజ్య - మహిమా - ధ్యక్ష[11]- సంతత సుజన - రక్షా[13] - కపట దుర్మజన - శిక్షా = పక్ష - విపక్ష వి - లక్షణ రహిత క-టాక్షము[14] నాదెస[15] - దీక్షను నిలుపవె ॥దేవా॥

3. సుంద - రాశ్చర్యగుణ - బృందా[16] - బంధుర నిత్యా - నందా[17] - సాధు సజ్జన-వంద్యా[18] ఖండిత కలుష - బృందా[19] = మంద మతిని నా - డెందము కడు దెలి - వొంద జేసి నీ - యందు నిలుప గదె ॥దేవా॥

4. నీవు - నన్ను సృష్టించి - నావు - నా గురురాడ్దేవు[20] - డవు - క్రీస్తు యేసుని - చావు - వలన సన్మనిపి[21] - నావు = త్రైవిధ జనక సు - తాత్మల[22]తోడను - గేవలమొక్కడ - వై వెలిగెడి ॥దేవా॥

5. ప్రేమ స్వరూప నిత్య - పతితపావన - నామ[23] - దాసలోకాబ్ధి - సోమ[24] - సర్వేశ పరమ - ధామ[25] = నేమ[26] మెరుంగని[27] - నీచుడ[28] నధముడ[29]- నోమహాత్మ దయ - తో మన్నింపవె ॥దేవా॥

---

1.మితిలేని దివ్య మహిమ గలవాడా 2.నన్ను రక్షింపుము 3.చలింపని వాటితోను చలించు వాటితోను గూడుకొని 4.సమస్త లోకమును. 5.రక్షింపవలెనను పరిశుద్ధభావము నిరంతరము కలవాడా 6.సారమైన కరుణకు సముద్రుడా 7.సమస్తము తెలిసినవాడా. 8.రూపము లేనివాడా. 9.సంసారమనెడి అడవి. 10.తరుగని భాగ్యమును ఆనందమును గలవాడా. 11.మహిమకు అధికారి. 12.ఎల్లప్పుడు. 13.మంచివారిని రక్షించువాడా 14.శత్రుమిత్రత్వ భావములనెడి విరుద్ధ గుణములులేని కటాక్షము గలవాడా. 15.దిక్కు 16.గుణ సమూహములు గలవాడా 17.దట్టమైన నిత్యానందము గలవాడా 18.నమస్కరింప దగినవాడా 19.ఎంత మాత్రము పాపములేనివాడా 20.నా గురువు రాజువు దేవుడవు 21.రక్షించినావు 22. తండ్రి కుమారా శుద్ధాత్ములు 23.పాపులను పవిత్ర పరచువాడవు 24.సమూహమనెడి సముద్రమునకు చంద్రునివాడా 25.శ్రేష్ఠమైన నిత్య నివాస స్థానము గలవాడా 26.నియమము 27.తెలియని 28.నీచుడను 29.తక్కువవాడను

## 3.

# క్రీస్తుకు స్తోత్రము.

రా - సురటు తా - అట.

మంగళమే యేసునకు - మనుజావతారునకు - శృంగార ప్రభువునకు - క్షేమాధిపతికి ॥మంగళమే॥

1. పరమ పవిత్రునకు - వర దివ్య తేజునకు - నిరుపమానందునకు - నిపుణ వేద్యునకు ॥మంగ॥

2. దురిత సంహారునకు - వర సుగుణోదారునకు - కరుణా సంపన్నునకు - జ్ఞానదీప్తునకు ॥మంగ॥

3. సత్య ప్రవర్తునకు - సద్ధర్మ శీలునకు - నిత్యస్వయం జీవునకు - నిర్మలాత్మునకు ॥మంగ॥

4. యుక్త స్తోత్రార్హునకు - భక్త రక్షామణికి - సత్య పరంజ్యోతియగు - సార్వభౌమునకు ॥మంగ॥

5. ఘనుడైన యెహోవా - యను పేరట దేవునికి - తనయుండై బరగు స - జ్జన పూజ్యునకు ॥మంగళమే॥

6. నర ఘోరకలుషముల - నురుమారంగ నిలకు - నరుదెంచిన మాపాలి - వరరక్షకునకు ॥మంగళమే॥

7. దుర్మరణ శ్రమలకు - పేర్మితో నోర్చుచు ధర్మ - జ్ఞానము దెల్పు - దైవ వాక్యమునకు ॥మంగళమే॥

8. పరమార్ధము జూపుటకు-భావంబులు మార్చుటకు -పరిశుద్ధాత్ముని కొరకు - ప్రార్థింతుము నీకు ॥మంగళమే॥

9. పరమపురి వాసునకు-నర దైవ రూపునకు - పరమేశ్వర తనయునకు - ప్రణుతింతుము నీకు ॥మంగళమే॥

---

కవితా ధర్మాలను పాటించిన పురుషోత్తముగారు తాను రచించిన కీర్తనలలో కూడా వాటిని వ్యక్తం చేశారు మగణం మంగళ ప్రథమవడం వల్ల కార్యారంభ పద్యం మగణంతో మొదలు పెట్టడం పరిపాటి. ఇష్టదేవత స్తుతిని కీర్తన ద్వారా చేయాలని సంకల్పించినప్పుడు తొమ్మిది చరణాలున్న కీర్తన వ్రాయడం కవితా ధర్మం. వాస్తవానికి "మంగళమే యేసునకు" అనే కీర్తన స్తుతి కీర్తన. కాని మనవాళ్లు పెళ్ళిలో మాత్రమే ఈ కీర్తనను గానము చేయుదురు.కవితా ధర్మమును పాటించి చౌధరిగారు ఈ కీర్తనను తొమ్మిది చరణాలతో వ్రాసిరి.అదే విధముగా ఆంగ్లేయుడైన తెలుగులో మంచి పట్టువున్న "విలియం డాసన్‌గారు" కవితా ధర్మాన్ని పాటించి తను ముద్రించిన మొట్టమొదటి (1846 సంవత్సరములో) తెలుగు కీర్తనల పుస్తకమును ముద్రించిరి. ఆ కీర్తనల పుస్తకములో ఈ కీర్తన యొక్క అన్ని చరణాలు అనగా తొమ్మిది చరణాలు ముద్రించారు. ఇప్పుడు మన సంఘాలలో వాడుచున్న "ఆంధ్రక్రైస్తవ కీర్తనల పుస్తకములో" ఆరు చరణాలు మాత్రమే కలవు.అయితే ఈ పుస్తకములో ఆ మూడు చరణాలతో పాటు ఈ కీర్తన మొత్తం చరణాలు ముద్రించడం జరిగినది.

**4.**

## అనాది దేవుండైన యెహోవా

రా - గౌళిపంతు తా - ఆది.

అనాది దేవుండైన యెహోవా ఘనబలమిది గనరే - దినంబులారిట[1] దివి[2] భువి మొదలగు ననూన[3] జగమెల్లను[4] సృజించెను ॥అనాది॥

1. సకల చరాచర సాగర సంయుత జగంబు వాక్యమునన్ - ప్రకటంబుగ నుద్భవింప నొనరించె నకళంకు[5] డతండనంతు[6] డాఢ్యుడు[7] ॥అనాది॥

2. ఆది నరులనెడి ఆదాము హవ్వలను హస్తముతో తుదను - మేదిని[8] పై జన్మింప జేసెనని మోదముతోడను[9] మోషే వ్రాసెను ॥అనాది॥

3. ఆ యిరువురు నింపలరగ[10] నేదేనను వన[11] మధ్యమునన్ మాయారహితాత్ములై[12] నగ్నులునై[13] యుండిరి ॥అనాది॥

**5.**

## యేసు నామ సుధా మధురము.

రా - ధన్యాసి తా - ఛాప్

యేసు నామ సుధా[1]మధుర మోద రసమాన[2] - నా మనస్సున జిహ్వాకేమో రుచి = వేమారు[3] చవి గొన్న[4] విసుకు పుట్టదు నూత్న - ప్రేమానందములాత్మ బెనుగులాడును ॥యేసు నామ॥

1. పరమార్థమైన సుందర శాశ్వతారామ[5] - తరుమూలములకు[6] జక్కరగ[7] బారి= గురుతం ఫలము లెక్కువ గల్గజేయ - మధురమైన మహిమ బం - ధురమైన యట్టి మన ॥యేసు॥

2. నిజభక్త హృదయానందితవై[8] యెన్నడు దాహ - ము జనించనట్టి[9] జీవోదకంబు = వృజినాగ్ని[10] వ్యధచేత[11] వెతనొందు నే ద్రావ - నిజముగా నొసగి శాంతిని బొందించెడు ॥యేసు॥

3. వెలసొమ్మియ్యక ద్రాక్షా - ఫలరసమును బాలు - బలిమితో గొనబిల్చు ప్రభువు వాక్కు = చెలిమిగా నాబుద్ధి జెవులతో విని - పులకింప జేసి[12] యాకలి దీర్చగల ॥యేసు॥

---

(4). 1.ఆరుదినములలో 2.ఆకాశము 3.అంతములేని 4.లోకము 5.పాపములేనివాడు 6.అంతములేనివాడు 7.సంపన్నుడు 8.భూమిపై 9.సంతోషముగా 10.సమృద్ధియైన 11.తోట 12.పాపలేనివారుగా 13.దిగంబరులు

(5). 1.అమృతము 2.త్రాగగ 3.పలుమారు 4.రుచిచూడగ 5.తోట 6.చెట్లవేళ్లకు 7.ప్రవాహముగ 8.ఆనందమునిచ్చు 9.పుట్టనియ్యని 10.పాపమనెడియగ్ని 11.కష్టముచేత 12.గరుపొడుచునట్లుచేసిరి.

## 6.

### క్రీస్తుకు మంగళార్చన.

రా - పంతువరాళి (చాయ: గీతములు పాడుడీ) తా - త్రిపుట.

మంగళము[1] పాడరె - క్రీస్తుకి జయ - మంగళము బాడరె - యో ప్రియులారా - మంగళము పాడరె = మంగళము బాడి దు - స్సంగతిని[2] వీడి ప్రభు - సంగులను[3] గూడి మది - పొంగుచు[4] జెలంగుచును[4] ॥మంగళము॥

1. రాజులకు రాజని - దూతలచేత - బూజగొనువాడని = తేజమున సూర్యునికి - దీప్తి నిడు సద్గుణ వి - రాజితుని[5] సాధు జన - రక్షకుని పక్షముగ ॥మంగళము॥

2. కరుణగల వాడని - పాపుల బ్రోచు - బిరుదు గొనినాడని = మరణమును దాని బరి - మార్చు[6] ఘన శక్తిగల - పరమ గురుడితడె మన - పాలివాడని శుభ ॥మంగళము॥

3. సంగీతము పాడుచు - సువార్త ప్ర -సంగముల గూడుచు = నింగికిని[7] భూమికిని - నిత్యముగ నేలదగు - శృంగారపు రాజునకు - క్షేమమగు నామేనని ॥మంగళము॥

## 7.

రా - దర్బారు తా - అట.

పరమాత్ముడితడే - మన ప్రభుయేసు - పరమాత్ముడితడే - సోదరులారా - పరమాత్ముడితడే = పరమాత్ముడితడే - పరికించి[1] మదిగాంచు[2] - వరభక్తులకు క్షేమ - కరమానందము గల్గు ॥పరమాత్ముడితడే॥

1. జననమద్భుతము - ఈతడు సేయు - పనులత్యద్భుతముల్ - మృతిబొంది లే - చిన దెంతో ఘనము - నమ్మిన వారి - కిని నిత్య సుఖము మనుజ మాత్రుల కిట్టి - మహిమ లుండునెయెందు - మనసాలోచన గల్గు - మతిమంతు లెద జూచు ॥పరమాత్ముడితడే॥

2. చదలమానికము[3] - వేడిమి సోకి - జలజాతకులము[4] - యుత్పుల సం - పంద నొందు విధము - భక్తులలోని - ముదము[5] ఈ విధము = సదయుడౌ[6] ప్రభు యేసు - సాంగత్యమును[7] జేయు - మృదుమానసుల[8] కెల్ల - హృదయానందము నిండు ॥పరమాత్ముడితడే॥

---

(6). 1.శుభము 2.చెడ్డ సాంగత్యమును 3.ప్రభునితో గూడినవారిని 4.సంతోషించుచు 5.ప్రకాశించువానిని 6.నశింపచేసె 7.ఆకాశము.

(7). 1.పరీక్షించి 2.మనస్సుతోచూచి 3.సూర్యుడు 4.తామరపువ్వు 5.సంతోషము 6.శాశ్వతమైన 7.సహవాసము 8.లేతమనస్సుగలవారికి

## 8.

### క్రీస్తుకు మంగళ స్తోత్రము

రా - మారువ (చాయ: సందియము వీడవే లేదా గీతములు పాడుడీ) తా - అట.

మంగళంబని పాడరే - క్రీస్తుకు జయ - మంగళంబని పాడరే - యేసుకు జయ - మంగళంబని పాడరే = మంగళంబని పాడి సజ్జ - నాంగ పూజితుడై[1] కృపా త - రంగి[2]లోక సమూహ పాపవి - భంగుడని[3] యుప్పొంగి జయజయ ॥మంగళ॥

1. ఘన యూద దేశంబులో - బెత్లెహే - మున యూదా గోత్రంబులో = వినుడు యోసేపునకు సతియై - తనరుచుండెడి మరియ కడుపున - జననమై యీ మర్త్యవరులకు - సద్గతిని గల్గించు వానికి ॥మంగళ॥
2. సోదరాళిభంగిని[4] - భక్తుల నెల్ల - జూచి బ్రోచెడు వానిని = యూద దేశపు వారలధిక - బాధ బెట్టుచు హింసజేసిన - సాదరంబున త్రిదినములకు[5] ముదముతో గనుపడిన ప్రభునకు ॥మంగళ॥
3. ధరణి న్గొల్చెడి దాస జ - నములనుబ్రోచు - దైవ తనయుడని నిజ = మరయ[6] నిలను స్మరించువారికి - గురుతరంబగు[7] కలుష జలనిధి[8] - దరికిజేర్చు పరమ పదమే - యిరు[9] వొనర్చెద ననిన ప్రభునకు ॥మంగళ॥

## 9.

### క్రీస్తుకు వందనము.

రా - ఆనందభైరవి తా - ఆది

వందనమే యేసునకు - వరసుగుణో దారునకు - సౌందర్య ప్రభువునకు - సర్వేశ్వర నీకు ॥వందనమే॥

1. యెహోవా తనయునకు - ఇమ్మానుయేలునకు - బహు కరుణా భరణునకు ప్రభుల ప్రభువునకు ॥వందనమే॥
2. ఆశ్రిత జన పాలునకు - నకలుష నర దేహునకు - ఇశ్రాయేల్ రాజునకు - యెహోవా నీకు ॥వందనమే॥
3. మరియా తనూజునకు - మహిమా గంభీరునకు - పరిశుద్ధాచరణునకు - పరమేశ్వర నీకు ॥వందనమే॥
4. రాజులపై రాజునకు - రవికోటి తేజునకు - పూజార్హపదాబ్జునకు - భువనావన నీకు ॥వందనమే॥
5. ప్రేమ దయా సింధునకు - క్షేమామృత పూర్ణునకు - నామేనని సాష్టంగము - లర్పింతుము ॥వందనమే॥

---

(8). 1.సజ్జన సమూహముచే పూజింపబడిన వాడై 2.కృపా సముద్రము 3.పోగొట్టు వాడని 4.సహోదర సమూహమునకువలె 5.మూడు రోజులకు 6.విచారింపగా 7.గొప్ప 8.పాప సముద్రము 9.నివాస స్థలము

**10.**

## యెహోవా ప్రేమ.

రా - శంకరాభరణము తా - ఆది.

యెహోవా నా మొఱ లాలించెను - దన - మహా దయను నను గణించెను[1] = అహర్నిశల[2] ధైర్యహీనుడగు నా - దు హాయనెడు[3] ధ్వని - గ్రహించి - మనిపెను[4] ॥యెహోవ॥

1. పిశాచి కడిమి[5] బడగొట్టెను - దన - వశాన నను నిలువ బెట్టెను = ప్రశాంత[6] మధుర సు - విశేష వాక్ఫల[7] - నిశాంతమున[8] జే - ర్చి సేద[9] దీర్చెను ॥యెహోవ॥

2. మదావళము[10] బోలు నామదిన్ - దన - ప్రదీప్త[11] వాక్యం[12] కుశాహతిన్ = యధేచ్ఛలన్నిటి - గుదించి పాపపు - మొదల్ తుదల్ నరి - కి దరికి జేర్చెను ॥యెహోవ॥

3. అనీతి వస్త్ర మెడలించెను[13] - యే - సు నాధు రక్తమున ముంచెను = వినూత్న[14] యత్నమె - ద నూని యెన్నడు - గనన్ వినన్ బ్రే - మ నాకు జూపెను ॥యెహోవ॥

4. విలాపములకు[15] జెవి నిచ్చెను - శ్రమ - కలాపములకు[16] సెలవిచ్చెను = శిలానగము[17] పై - కి లాగి నను సుఖ - కళా వళుల్ మన - సులోన నిలిపెను ॥యెహోవ॥

5. అగణ్య పాపియని త్రోయక - న - న్ను గూర్చి తన సుతుని దాచక = తెగించి మృతికొ - ప్పగించి[18] పాపపు నెగుల్[19] దిగుల్ సొగ - సుగా నణంచెను ॥యెహోవ॥

**11.**

## రక్షణకొరకు కృతజ్ఞత.

రా - జంఝూటి తా - ఏక

పరలోకమున నుండు దేవ - నీ - పదముల కొనరింతు సేవ = దురితంబులకు నేను - వెరచియున్నాని - కరుణించి నీ సుతుని - ధర కంపితివి గాదా = అరయగా నీ ప్రేమ యింతన - దరము గాదో పరమ జనక - మరణ పర్యంతంబు నిను నే - మరువ జాలను - వర కృపానిధి ॥పరలోకమున॥

1. యేసుక్రీస్తుని దయ సేయ - కున్న - మోస మొందెద నెందు కన్న = దోసంబులకు నేను - దాసుండనై ప్రతి - వాసరంబును నీదు - భాసురాజ్ఞలు విడిచి = వేసటలు గల నరకమున బడ - ద్రోసిన నది న్యాయమౌ గద - నా సునాధ పేర్మిచేతను - నీ సుతుని నంపించినావు ॥పరలోకమున॥

---

(10). 1.సంపాదించెను 2.రాత్రియందు పగటియందు 3.దు:ఖముచేత గలిగిన 4.రక్షించెను 5.శక్తి 6.మిగుల నెమ్మదిగల 7.వాక్కుయొక్క ఫలమైన 8.గృహమున 9.అలత 10.మదించిన ఏనుగు 11.ప్రకాశమైన 12.అంకుశపు దెబ్బచేత 13.పోగొట్టెను 14.క్రొత్త 15.ఏడ్పుట 16.సమూహము 17.రాతికొండ 18.ఎంచశక్యముకాని 19.బాధ

2. ఎన్నరాని మహిమ నుండి - యేసు - నన్ను బాలింప నేతెంచి = యెన్న శక్యము గాక - యున్న పాపము లన్ని - ఛిన్నాభిన్నము జేసి - నన్ను సమ్మతిపరప - నన్న యగు నా రక్షకుండు - తన్ను తానర్పించి వెండియు - నున్నతుండై లేచి యిప్పుడు - సన్నిధానం బొసంగె నాకు ॥పరలోకమున॥

## 12.

## సమస్త మనుష్యులు భ్రష్టులై యున్నారు.

రా - కళ్యాణి (ఎంతో సుందరమైనవి ధరగిరులపై) తా - అట.

అయ్యో మానవులారా - పాపము వృద్ధి - యయ్యె బలిమి మీరా = చెయ్యరానటువంటి -చెడు దుష్కర్మములు - వ్రయ్యంగ[1] మదిలేక బహుగా జేయుచున్నా = రెయ్యెడను[2] గనుగొన్న మర్త్యులు - దయ్యముల పూజించి యొకరొక - రొయ్యనను[3] కయ్యములు[4] జేయుచు - నెయ్యములు విడి పగ వహించిరి ॥అయ్యో॥

1. కపటము మదినుంచి - మాటలతోటి - కైవార[5] మొనరించి = నిపుణత్వములు కొన్ని - నెరపి[6] యన్యుల సొమ్ము - లపహరించెడు - వారలధికమై యున్నారు = కృపణులై[7] యొక గవ్వ కోసం - బెపుడు నన్నృతము[8] లాడు వారలు - నెపములిడి శపియించు వారలు - నిపుడు ధరనెల్లెడల నిండిరి ॥అయ్యో॥

2. పర దైవ నిష్ఠలందు[9] - సత్య జ్ఞాన - పరిహాసోక్తుల[10] యందు = పర నారి[11] - పరనింద పరధనాసక్తులై - విరివిగ నెంద రెందరు నిండి యున్నారు = కరుణ మాలినవారు మరి భీ - కర నరాంతకు లుగ్రకోపులు - నిరత మత్సరు లాత్మ నుతిరతు[12] - లరుదుగా పెరిగిరి ధరిత్రిలో[13] ॥అయ్యో॥

3. ఇందుకోసమె దేవుడు - తొల్లిటి కాల - మందె బంపెను కీడు = అందరిట్లతి పాపులైన - యందెనమంద్రు - మంది దక్క నుదక - మయకాల మొనరించి[14] = యందరిని బరిమార్చి[15] యంతకు - ముందు పొందుగ బ్రోచు నెనిమిది - మందిచేత మనుష్య వితతి[16] - ధరం దనర[17] పుట్టించె బెక్కుగా ॥నయ్యో॥

4. మరలి పాపము జేసిరి - మానవులెల్ల - నరక మార్గము బట్టిరి = పరమేశ్వరుడు కృపా - పరిపూర్ణుడై సర్వ - నరుల బ్రోచుటకొక్క - తెరవు[18] గల్పించెను = నరుని పోల్కెను యేసుక్రీస్తుని ధరణిపై బుట్టించె నాతని - మరణ పుణ్యము నమ్మి మనమం - దరము జీవన్ముక్తి బడయుద ॥అయ్యో॥

---

1.పగులునట్లు 2.ఏ స్థలమందును 3.చల్లగా 4.జగడములు 5.స్తోత్రము 6.వ్యాపింపజేసి 7.లోభులు 8.అబద్దములు 9.శ్రద్ధలయందు 10.అపహాస్యములాడుట 11.పర స్త్రీ 12.తమ్మును తాము పొగడించుకొనుటయందాసక్తులు 13.భూమి 14.తప్పించి విస్తారమైన జలప్రళయమును 15.నశింపజేసి 16.సమూహము 17.లోకమందు బాగా. 18.మార్గము

## 13.

### క్రీస్తే మానవాశ్రయుడు.

రా - సెహనా                                                                                                     తా - ఛాప్

నీ చరణములే నమ్మితి నమ్మితి నమ్మితి - నీ పాదములే బట్టితి బట్టితి బట్టితి ॥నీ॥

1. దిక్కిక నీవే చక్కగ రావే = మిక్కిలి మ్రొక్కుదు మ్రొక్కుదు మ్రొక్కుదు ॥నీ॥
2. ఐహిక సుఖము - నరసితి నిత్యము = ఆహాహా ద్రోహిని ద్రోహిని ద్రోహిని ॥నీ॥
3. భావము మార్చి నా వెత దీర్చి = దేవర బ్రోవవే బ్రోవవే బ్రోవవే ॥నీ॥
4. చంచల బుద్ధి - వంచన యెద్ది = యుంచక ద్రుంచవే ద్రుంచవే ద్రుంచవే ॥నీ॥
5. చుట్టుకొని యున్న - శోధన లున్న = పట్టువిడ గొట్టవె గొట్టవె గొట్టవె ॥నీ॥
6. నాచు పిశాచి - నరుకుట గాచి = గాచుకొ దాచవె దాచవె దాచవె ॥నీ॥
7. బలమెదలేని - పాపుడనని = బిలచెద బల్కవె బల్కవె బల్కవె ॥నీ॥
8. నీరసుడనంచు - నీ దయనుంచు = దరికి జేరితి జేరితి జేరితి ॥నీ॥
9. కరుణ దలంచి - శిరమిదె వంచి = శరణని దూరితి దూరితి దూరితి ॥నీ॥
10. నేరము బాప - గూరిమి జూప = సారెకు గోరితి గోరితి గోరితి ॥నీ॥
11. నీచుల బిల్చు - నిర్భయమిచ్చు = నీ చేయి దాచకు దాచకు దాచకు ॥నీ॥
12. వాడుక యున్న - వరకృప యెన్న = నేడది చూపవె చూపవె చూపవె ॥నీ॥
13. యేసుని తోటి - కెవ్వరు పాటి = దోసము బాపును బాపును బాపును ॥నీ॥
14. నిస్తుల ప్రేమ - క్రీస్తుని నామ = సంస్తుతి సేయరే చేయరే చేయరే ॥నీ॥

## 14.

### పాప వృద్ధి.

రా - పున్నాగతోడి                    (నీకన్న యికవేరె వేల్పులు)                    తా - ఆది.

అయ్యో నరులారా - పాపము వచ్చె - నయ్యో జనులారా = ఇయ్యుర్విలో[1] నాది - యయ్యమ్మలిద్దరు - సయ్యన[2] చెడిపాప - సరణిలో[3] నడచి ॥అయ్యో॥

1. వారి సంతతివల్ల - గల్గెడి వారు - గారె భూ నరులెల్ల = నీ రీతి తొల్లి - దేవుని లేఖనములలో - ప్రారంభమున మోషే - వ్రాసి తెల్పెను నిజము ॥అయ్యో॥

2. పెరిగె నిద్ధరయందు - పాపము సర్వ - నరుల డెందములందు = దరి లేని సంసార - శరధిలో[4] మునిగెడు - నరు లాచారము - లిక నెరిగింప పని లేదు ॥అయ్యో॥

3. వినరే చక్కని వార్త - దేవుడొసంగె[5] - ఘనమైన సుచరిత్ర = మన పాపములు బోగొ - ట్టను క్రీస్తు వచ్చె నా - తని నమ్ముదము - ప్రేమను రండి వెస[6] రండి ॥అయ్యో॥

(14). 1.భూమియందు 2.వేగముగా 3.మార్గమందు 4.సముద్రము 5.దేవుడుదయచేసెను 6.వేగముగా

15.

## నిజమైన రక్షణ మార్గము.

రా - శుద్ధకాంభోజి తా - జంపె.

ఇదె గదా జనులార - ఇల[1] జ్ఞాన పథము[2] - విదితముగ[3] లేఖనం - బిది బోధ సేయు = సదమలంబగు[4] జ్ఞాన - సారంబు తోరంబు[5] - హృదయాంధ కారంబు - వదిలింప జేయు ॥ఇదె గదా॥

1. తనువందు వివిధముగ - తత్వముల్ తర్కించి - వినుపించు కథలన్ని -వృధలు కావె = మనసు లోపలి పాప - మర్మమగుపడ జేసి - తన సూక్ష్మ గతి దెల్పు - తత్వమింకేది ॥ఇదె గదా॥

2. కూడు గుడ్డలు లేక - కొందరిండ్లను దిరిగి - మోడువలె పనిమాను - వాడు గురువగునే = వేడుకను బహు శాంతి - వినయోపకారముల - జాడ యొరులకు[6] జూపు - సద్గురుండేడి ॥ఇదె॥

3. మారు పుట్టుక రీతి - దారి దెల్పగ లేక - తారుమారుగ జేయు - వారి విధులన్ని = దూరముగ దొలగించి - దురితంబు లణగించి - పారమార్థిక[7] బుద్ధి - పట్టువడ జేయు ॥ఇదె గదా॥

4. నీతి తెరవు[8] జొరండి - నిత్యమ్ము మీరనుచు - నేతరిన్ బోధించు - రెంతేని గురువుల్ = పాతకము వీరిచే - బాయునే తద్దోష - జాతభరుడౌ[9] క్రీస్తు - చేత నగుగాక ॥ఇదె గదా॥

5. ఏటి కోనేటి ము - న్నీటి యెలనీటిలో - మాటిమాటికి మున్గ - మడియున[10] యఘము[11] = మేటియౌ కల్వరి - మెట్టయందున క్రీస్తు - ధాటిగా జిందు ర - క్తము చేత గాక ॥ఇదె గదా॥

6. దేవకోపాగ్ని పాత్రభూని నరకోటి - గావ రక్తము జిందగా జేసె నెవడో = దేవ ప్రియకుమారుడు విభుండు దయాస్వభావుడాతని కంటె - పరుడు లేడనుటె ॥ఇదె గదా॥

---

.1భూమియందు .
2. మార్గము
3. తెలియబడినది
4. నిర్మలమైన
5. గొప్పది
6. ఇతరులకు
7. మోక్షసంబంధమైన
8. మార్గము
9. సమూహమును భరించువాడు
10. నశించునా
11. పాపము

## 16.

# క్రీస్తుని చూడ రండి.

రా – శంకరాభరణము తా – ఆది.

రారే మన యేసు స్వామిని – జూతము కోర్కె – లూర[1] ప్రియులారా పేర్మిని[2] = గూరిమ[3] భక్తుల – జేరువ – విందట[4] – భూరిదయామృత[5] – సారము లొలికెడి – చారు[6] కటాక్ష వి – శాలేక్షణుడట[7] – నారకు[8]లగు నర[9] – నారీజనులకు – దారక[10] మొసగను – దానె పిలుచునట – దారుణ[11] పాప మ– హారణ్యమునకు – గారుచిచ్చు[12] గతి – గన్పడువాడట – ఘోర దరిద్రత – గూల్చెడివాడట = సారంబగు తన – సభకు మకుటమట[13] ॥రారే॥

1. పతిత[14] పావనమౌ వేల్పట – అనాది – దేవ – సుతుడై యిల జేరినాడట = సతతము[15] కడు[16] దు – రితతమోయుత మగు – ప్రతి దేశమునకు –హితభాస్కరుడట[17] – అతులిత[18] మోక్షో[19] – న్నత గుణగణుడట – కుతలంబున[20] స – ద్గతి[21] రహితంబగు – పతితుల గావను – మృతుడైనాట – అతిపుణ్య తమ – క్షత[22] శోణితమును – వ్రతముగా[23] సిలువను – నతడొసంగెనట – మృతిని జయించుచు – బ్రతికి లేచెనట = మతి నమ్మిన మన – గతి యితడేనట ॥రారే॥

2. తుదలేని మహిమవాడట – తను గొల్చు సాధు – హృదయుల సొమ్ము మూటట = చెదరిన గొఱ్ఱెల – వెదకవచ్చెనట – చిదురపలగు[24] జన హృదయము లన్నిట – బదిలముగా నె – మ్మది నిడువాడట – నదితట[25] మఠ[26]జన[27] పదవనముల స – మ్మద[28] శుభవార్తను – బలికిన వాడట – సదయుత నంధుల[29] – కక్షుల[30] నిడెనట[31] – వెదకి బధిరులకు[32] – వీను[33] – లొసగెనట – సదమల[34] మోక్ష[35]– ప్రదుడగు విభుడట = యిదిగో మనకిత – దేలినవాడట ॥రారే॥

---

1.వృద్ధిపొందునట్లు 2.ప్రేమచేత 3.ప్రేమచేత 4.బంధువు 5.అమృతము యొక్క రసము 6.సుందరమైన 7పెద్ద నేత్రములు గలవాడు 8.నరక సంబంధులు 9.పురుషులు స్త్రీలు 10.ఆధారము 11.భయంకరమైన 12.అడవి నిప్పు 13.కిరీటము 14.పాపులను పవిత్రముచేయు 15.నిత్యము 16.పాపమనెడి చీకటితో కూడికొనిన 17.అనుకూలమైన సూర్యుడు 18.సమానము లేని 19.మోక్షము కంటె ఉన్నతమైన గుణ సమూహము గలవాడు 20.భూమియందు 21.సద్గతిలేని 22.శరీరము యొక్క గాయపు రక్తమును 23.పట్టుదలగా 24.ముక్కలుగా 25.నదీ తీరములయందు 26.గుళ్ళలో 27.గ్రామములలో 28.సంతోషముతో 29.గ్రుడ్డివారికి 30.కన్నులు 31.యిచ్చెను 32.చెవిటివారికి 33.చెవులు 34.పవిత్రమైన 35.మోక్ష మిచ్చువాడు

## 17.

### యేసే దేవుండు.

రా - ఆనందభైరవి (చాయ: మహిమ మహిమ మహిమ) తా - అట.

యేసు దేవుడని యెరుంగరే - మనుజులార - మోసబుద్ధులను దొలంగరే = భాసురమగు దేవన్యాయ పద్ధతులను మీరునట్టి - దోసకారులకు విముక్తి - దొరుకు కొరకు ధరకు వచ్చె ॥యేసు॥

1. న్యాయమునకు కృపకు పొందుగా - తగిన సంధి - సేయ జగతి నెవడు లేడుగా = శ్రేయాసాధికారి దానె - సిద్దపడి నరాళి కొరకు ఆయువొసగ నవతరించి - న్యాయమునకు తృప్తి జేసె ॥యేసు॥

2. మనుజ జాతి పాపములకై - తాను శిక్ష - ననుభవించుటకు నరుండునై = తనువు బలి యొనర్చి న్యాయ - మునకు తృప్తి జేసి కృపను - జనుల త్రాణ కొసగె సత్య - ఘన దయా ప్రపూర్ణుడతడు ॥యేసు॥

## 18.

### క్రీస్తునందలి అభయము.

రా - హుసేని తా - అట.

నన్ను గన్నయ్య రావె నా యేసు = నన్ను గన్నయ్య రావె నా ప్రభువా ॥నన్ను॥

1. ముందు నీ పాదారవిందము[1] - లందు నిశ్చల భక్తి ప్రేమను = పొందికగా జేయ రావే నా - డెంద[2] మానంద మనంతమై[3] యుప్పొంగ ॥నన్ను॥

2. హద్దులేనట్టి దురాశల - నవివేకినై కూడి[4] యాడితి[5] = మొద్దులతో[6] నింక కూటమి[7] - వద్దయ్య వద్దయ్య వద్దయ్య తండ్రి ॥నన్ను॥

3. కాలము పెక్కు[8] గతించెను - గర్వాదు లెడదెగ వాయెను = ఈ లోక మాయ సుఖేచ్ఛలు - చాలును జాలును జాలు నోతండ్రి ॥నన్ను॥

4. దారుణ[9] సంసార వారధి[10] - దరి - జూపి ప్రోవ నీ కన్నను = కారణ గురువు[11] లింకెవ్వరు లేరయ్య లేరయ్య లేరయ్య తండ్రి ॥నన్ను॥

5. నా వంటి దుష్కర్మ జీవిని - కేవల మగు నీదు పేర్మిని[12] = దీవించి రక్షింప నిప్పుడే - రావయ్య రావయ్య రావయ్య తండ్రి ॥నన్ను॥

---

1.పద్మముల వంటి పాదములు 2.మనసు 3.సంతోషముయెడతెగనిదై 4.చేరి 5.మునిగితిని 6.దుష్టులతో 7.కూడిక 8.చాలభ 9.యంకరమైన 10.సముద్రము 5.హృదయతాపముమాన్పుగురువులు 12.ప్రేమచేత

## 19.

# రక్షణాహ్వానము.

రా - శ్రీ                                    తా - త్రిపుట.

రారో జనులార - వేగము గూడి - రారో ప్రియులారా - శాశ్వతమైన - ఘన రక్షణ జేర = సారాసారముల్[1]= సమ్మతిగా జూచి - ధీరత్వమున[2] క్రీస్తు - జేరు దారి గోరి ॥రారో॥

1. అనుమానములన్ని - మీరలు మాని - యాద్యంతము[3] లేని = కనికరము చేత - మనల రక్షింపను - తన జీవము నిచ్చు - ఘనుని క్రీస్తుని గొల్వ ॥రారో॥

2. మన పాపములన్ని - మోయను దే - వునిచే పని బూని = మనుజావతారుడై - వినుట కద్భుతమైన - పను లెన్నో చేసి సి - ల్వను బడిన ఘను జేర ॥రారో॥

3. పాపాత్ము లగు వారి - భారము ద్రుంచు[4]- బలువైన యుపకారి = ఓపికతో తన - దాపు జేరిన వారి - శాపము తా మోసి - కాపాడు ఘనువేడ ॥రారో॥

4. తన యాత్మకు గీడు - గల్గించెడు ఘనత లెల్లను పాడు[5] = తనువు నిత్యముగా - దని యభిమాన - మును వీడి మన క్రీ - స్తునిజాడ గతి జూడ ॥రారో॥

5. ఒక మానవుడైన - పాపము లేని - యకళంకు డెవడన్నా = సకలావస్థల - సంసార మగ్నులై - మెకములవలె జ్ఞాన - మెరుగని వారెల్ల ॥రారో॥

6. సకలాంతర్యామి - నిరాకారు - డొకడే యంతటసామి = ప్రకటముగా మర్త్య - లకు[6] నెల్ల మధ్యస్థ - డొకడే క్రీస్తుడు సం ర - క్షకుడై యిలకు వచ్చె ॥రారో॥

(పురుషోత్తముగారు బాప్తిస్మము తీసుకొనిన 3సం॥ తరువాత, తనభార్య కూడా ప్రభువు అంగీకరించి తనతో ఉండుటకు బయలుదేరినప్పుడు, ఆయన భార్యను బంధువులు అడ్డుకొననపుడు అశువుగా వ్రాసిన కీర్తన.రారో జనులార వేగముగూడి. ఇది 1836సం॥లో వ్రాయబడినది.)

## 20.

# కాలము గతించి పోవుట.

రా - మధ్యమావతి     (చాయ: ఉన్నపాటునవచ్చుచున్నాను)          తా - అట.

ఎంతో వేగము చెల్లి పోవును - కాలము - చింతింపదగును మనకు - గుంత నీరు హరించు గతి మన - వంతు దినములనేక మరిగె ని - కెంత కాలము నేడో రేపో - నితాంతముగ మృతి వచ్చుచున్నది ॥ఎంతో వేగము॥

---

1.సారము లేనివి, సారము గలవి 2.ధైర్యముతో 3.నిత్యమైన 4.తీసివేయు 5.పనికిరానివి 6.శరీరము.

1. ఇలలో నిల్లగునట్టి - యింతి గర్భమునుండి - యిలకు వచ్చిన కాలము - బాలత్వమవ్వలి యౌవనపు కాలము - ముది కాలము - తలచి చూచిన కలను గనుగొను - ఫలమువలె నొక గడియయైనను - కలిమి బలములు నీటి బుగ్గల - గతి వడిం గడ తేరి పోవు ॥ఎంతో వేగము॥

2. మన తాత ముత్తాత - లగు పూర్వులగు వారి - దినములే గతించి పోయెను - వారల పేరు ఘనము వినబడ దాయెను - మాయమై పోయెను - వెనుక ముందట వారు చెల్లుట - గనుచు వినుచు దురాశ నిహ జీ - వన మనిత్య శరీర సుఖములు- మనకు గోరుట తగవు గాదిది ॥ఎంతో వేగము॥

3. బహు రోగముల చేత - బాధింపబడు దు:ఖ - వహమైనదీ కాయము - నిర్భర మోహ బహుళ దుర్వ్యవసాయము - కడు హేయము - అహహ యీ సంసార దారుణ - గహన దహనంబైన క్రీస్తుని - మహిత నామము సతత మాత్మను - విహితముగ సేవింప గతిగను ॥ఎంతో వేగము॥

## 21.

## విమర్శను గురించి జాగ్రత్సూచన.

రా - సావేరి (చాయ: ఉన్నపాటున వచ్చుచున్నాను) తా - త్రిపుట

ఇప్పటి నరులార - యిక వచ్చు లయ బాధ - తప్పించుకొన మీరు త్వరపడరయ్య = మెప్పు బొందిన యట్టి - గొప్పవారు మీరైన - తప్పులేని మంచి - దారిలో నున్నారే ॥ఇప్పటి నరులార॥

1. పండితులైనను - బలశాలులైన భూ - మండలాధిపులైన మాన్యుల్ మీరైన = ఖండితమగు తీర్పు - కాలంబులో బడ్డ - నిండు నెమ్మదిలేని - నేర్పులు వృధగాన ॥ఇప్పటి నరులార॥

2. ధనవంతులైనను - తగువారలైనను - గుణవంతులైన బల్ - కులజుల్ మీరైన = నెనలేని తుది దిన - మునకు లోబడు వేళ - మనసు నెమ్మదిలేని - మహిమలు వృధగాన ॥ఇప్పటి నరులార॥

3. ఉపవాస పరులైన - జపమాల ధరులైన - తపసులైనను యెంతో - నిపుణుల్ మీరైన = నుపమ లేనట్టి న్యా - యపు వేళ మీ మదికి - విపుల శాంతము లేని - విధులన్ని వృధగాన ॥ఇప్పటి నరులార॥

4. సకలంబు విడిచి సం - శయమెల్ల దుడిచి న - మ్మికతో క్రీస్తుని గొల్చు - మృదు భక్తులైతే = నకలంకమగు హృద - యానందముల నుందు - రొక బాధ మది నంట - కుండు నంతమునందు ॥ఇప్పటి నరులార।

## 22.

# స్వంత తప్పితములు కనుగొనుట.

రా - రేగుప్తి తా - ఆది.

ఇతరుల దప్పెంచ - వేగిర పడుకంటె - మతి నీలో నీవు జూడుమీ - పాపిష్టి మనసా - మతి నీలో నీవు జూడుమీ - ప్రతి కాలమందు నీ - కృత కార్యంబులను జూ - చితివేని నీ తప్పు లతిశయముగ దోచు ॥ఇతరుల॥

1. పరుల నేరము కంట - బడిన వీనుల విన్న - త్వర కోపమొదవు నీకు -పొరపాటునుండి నీ - బుద్ధి ద్రిప్పితివేని - మరి యంతకన్న వి - స్తర దోషివై యుందు ॥ఇతరుల॥

2. ఒకరి దోషములు బయి - టికి వచ్చిపప్పుడిం - చుక సహింపకుందువు - ప్రకటంబు లేక లో - పల దాగి యున్న నీ - సకలావస్థలు జూడ - మొకము వంచుట గల్గు ॥ఇతరుల॥

3. చెవి యొగ్గి విను వారి - చెడు కార్యములు - నీ విచ్చెదువుగా విను వేళను - నవివేకమున నిన్ను - రసితివా వారి - సవతైన కొన్ని ల - క్షణముల్ నీలో నుండు ॥ఇతరుల॥

4. అత్యంత క్షమాబ్ధి - యగు క్రీస్తు నామము - సత్యంబుగా గ్రోలు మీ - మత్యను కూలత నౌ - న్నత్య మౌనటమీద - నిత్యంబు పెరవారి - నీవలె గనుగొందు ॥ఇతరుల॥

## 23.

# మనసుకు నిజమైన నెమ్మది యిచ్చువాడు క్రీస్తు.

రా - యదుకుల కాంభోజి తా - ఛాప్

మనసు కలగిన వేళ మహిత - సంపదలన్ని - తనకేల యున్నలారా = ధనము వేయి కోట్లున్న ధర యెల్ల గలిగినను - తన మనోవ్యాధి నంతము సేయ గలవే ॥మనసు॥

1. తనువు బైటికి జక్క దనముతో - వస్త్ర కాంచన - భూషణముల వెలుగున్ = అనిశంబు కామాదు లారు దయ్యంబులకు - నునికైన యొక బిలము తనలోన నుండున్ ॥మనసు॥

2. నరకోటి వెనుక ముందర - గొల్చి చనుదేర - కరి నెక్కు ధరణి పతికిన్ = దరిలేని పెక్కు చింతలచేత గంట ని - ద్దుర లేక నిట్టూర్పుతో రేలు గడుచున్ ॥మనసు॥

3. వెలికి దొడ్డ సమాధి - తెలుపు గోడను బోలి - కళలచే బొంగి యుండున్ = బెలుచ బాతిన కుళ్లు పీన్గు దుర్గంధంబు - వలెను చెడ్డ దురాశ దలపులో నుండున్ ॥మనసు॥

## 24.

# లోకము మాయ యనుట.

రా - యదుకులకాంభోజి తా - ఆది

మాయలోని మాయ - సర్వము మాయ లోక మాయెర = కాయము సదుపాయము నా - దాయ మెల్ల మాయర ॥మాయలోని॥

1. మంటిలో సర్వంబు పుట్టి - మంట గలసి పోవుర = యొంటిగా వచ్చెడి యాత్మ - యొంటిగానె పోవుర ॥మాయలోని॥

2. పుట్టుచుండు నొక్కడు మృతి - బొందుచుండు నొకడుర = ఇట్టి మార్పులు గల్గుచుండు - నెల్ల వేళల నిలనుర ॥మాయలోని॥

3. ఎంత సంపద్భోగము కా - సంతలోనే వీడుర = సంత గొల్లు దీరినట్లు - సర్వముడిగి పోవుర ॥మాయలోని॥

4. రూపులు వీక్షించు కంటికి - చూపు తృప్తి లేదుర = మాపు రేపు లేని చోటు - జూపు జూపే జూడర ॥మాయలోని॥

5. డెంద మానందబు నిండు - బొందదీ జగమందుర = అందముగను క్రీస్తు పాద - మందు భక్తి నిల్పర ॥మాయలోని॥

6. ఆసలెల్ల గాలి మూట - లట్లు గాకే మబ్బెర = యేసు నామామృతము గ్రోలు - మింతియే సారంబు ॥మాయలోని॥

## 25.

# మోక్షము విశ్వాసుని గృహము.

రా - సురటు (చాయ : మా యేసుక్రీస్తుని మఱుగు) తా - అట.

ఆనందమగు ముక్తి - యే నా మందిరము = జ్ఞాని మానుగ జూచు - దాని సుందరము ॥ఆనంద॥

1. పరదేశివలె దేహ - వరణమందుందున్ - ధరణి కాననముగా దర్శించు చుందున్ - నెరి దు:ఖ సుఖములు - సరిగ భావింతున్ = పరిశుద్ధాత్ముని వేడి - పరి తృప్తి నుందు ॥ ఆనంద॥

2. బహు శోధనలు నాపై - బడి వచ్చునపుడు - నహితాంధతమము నన్నడ్డుకొన్నపుడు - నిహ బాధలన్ని - నన్నెదిరించినపుడు = నహహ యేసునివల్ల - నమృతుడ నెపుడు ॥ఆనంద॥

3. ముందు నా మనసు దే - వునిక కప్పగింతు - నందరి నస్మత్తుల్యముగా ప్రేమింతున్ - సందేహ రాహిత్య - సరణిలో[6] నిల్తుం = పొంద బోయెడి ముక్తి - భువి యందె గాంతు ॥ఆనంద॥

## 26.

### అడుగుడి మీకియబడును.

రా - పంతువరాళి (చాయ : యేసుని ప్రేమను) తా - ఆది.

దాసుల ప్రార్ధన - దప్పక యొసగెడు - యేసునాయకుడె మా వేల్పు = దోసములు సేయు - దుర్జనుడైనను - దోసి లొగ్గ బర - వాసి - జేయునట ॥దాసుల॥

1. జన రహిత స్థల - మున జని వేడెడి - మనుజుల ప్రార్ధన - విను చుండున్ = తన పాదము న - మ్మిన సాధూత్తమ - జనులను జూచిన - సంతస మిడునట ॥దాసుల॥

2. మది విశ్వాసము - గూడిన ప్రార్ధన - సదయుత వినుటకు - జెవులొగ్గున్ = హృదయము గనుగొని - యుచిత సమయమున - గుదురుగ భక్తుల - కోర్కె లిచ్చునట ॥దాసుల॥

3. ముదమున నిద్దరు - ముగ్గురు నొకచో - బదిలముగా దను బ్రార్థింపన్ = వదలక దానట - వచ్చి యుందు నని - మృదువుగ బలికిన - కృత రక్షణుడట

## 27.

### ప్రాతస్స్తవము.

రా - కాంభోజి (చాయ: తనువు నా దిదిగో) తా - కురుఝంపె.

తెల్లవారిన వేళ - దెలి వొంది మన క్రీస్తు - దివ్య నామము బాడరె - యో ప్రియులార - దివస రక్షణ - వేడరే = తల్లి రొమ్మున దాచు - పిల్ల రీతిని మనల - జల్లదనముగ రాతి - రెల్ల గాచిన విభుని ॥తెల్లవారిన॥

1. నిద్రపోయిన వేళ - నిఖిలాపదల బాపి - నిశ లన్ని గడుపు విభునిన్ = భద్రముగ వినతించి - భయభక్తితో మనము - ముద్రి తాక్షుల గేలు - మోడ్చి మ్రొక్కుచును ॥తెల్లవారిన॥

2. భాను డుదయం బయ్యె - బద్మములు వికసిల్లె - గానములు జేసె బక్షుల్ = మానసాబ్జము లలర - మనము కల్వరి మెట్ట - పై నెక్కు నిను డనెడి - ప్రభు జూచి వేడ్కన్ ॥తెల్లవారిన॥

3. దిట్టముగా మానసేం - ద్రియ కాయ శోధనలు - పట్టుకొని యుండు దినమున్ - దట్టముగా మన నాల్గు - తట్ల యేసుని కరుణ - జుట్టుకొని రక్షించు - శుభ మడుగుకొనుచున్ ॥తెల్లవారిన॥

4. పాప భారము మనము - ప్రభుని పై నిడి గురుని - పాదముల చెంత నొరగి = కాపు కర్త విశాల - కరము మాటున డాగి - యాపదల దొలగించు - మని వేడుకొనుచున్ ॥తెల్లవారిన॥

## 28.

# శుభవర్తమానము దేవదత్తము.

రా - శంకరాభరణము　　　　　　　　　　　　　　　　　　　　　　తా - అట.

దేవుడిచ్చిన దివ్యశాస్త్రమిదేను మనకో యన్నలారా = భావ శుద్ధిని జేయు ఘన శుభ - వర్తమానము దీని పేరు ॥దేవుడిచ్చిన॥

1. భయముతో భక్తితో జదివిన - ప్రాపు క్రీస్తుడటంచు దెల్పును = దయామయుడగు దేవుడే మన తండ్రి యని బోధించు నెల్లెడ ॥దేవుడిచ్చిన॥

2. పాపముల మన్నింపు నొసగు - పరిశుద్ధియె మదికి నిచ్చును = శాపంబు దొలగజేయు - సంతోషము - జూపు నాత్మకు ॥దేవుడిచ్చిన॥

3. సత్యశాంతములంకురించును - సత్క్రియా ఫలములును బొడమును - నిత్యజీవము గలుగుదానాన్ - నిస్సందేహంబు నుండును ॥దేవుడిచ్చిన॥

4. ఈ సుమంగళ దివ్యశాస్త్రము - నిప్పుడే మీరనుసరించుడు = దోషంబులు నెడబాసి మోక్షపు - త్రోవగోరిన వారెల్లను ॥దేవడిచ్చిన॥

5. పాపములలోనుండి విడుదల - పరమసుఖమని దలతు రేనియు =తాప మార్పును లేచిరండి - త్వరగ క్రీస్తుని శరణుబొందను ॥దేవుడిచ్చిన॥

6. దురిత ఋణములు దీర్చుమధ్య - స్థుండు గావలెనన్న వారలు = త్వరగ రండీ త్వరగ రండీ - వరదుడౌ క్రీస్తు కడ కిపుడే ॥దేవుడిచ్చిన॥

7. సాధు పౌరోహిత్య సహితున్ - సద్గురున్ - వెదుకెదరయేనియు = మోదమొప్పగ రండి రండి - మోక్షపతియగు క్రీస్తునొద్దకు ॥దేవుడిచ్చిన॥

8. నిర్మలాంత:కరణ సౌఖ్యము - నిజముగా నిల వెదుకు వారలు = ధర్మచిత్తుండైన క్రీస్తుని - దరికి రండి రండి వేగము ॥దేవుడిచ్చిన॥

9. మరణమునకై భయము నొందెడి - మానసము గలవారెల్లను = బరమ శాంతి యొసంగు క్రీస్తుని - పజ్జ డాయగ రండివేగము ॥దేవుడిచ్చిన॥

10. మోక్ష రాజ్యము జేరగోరెడు - బుద్ధి గలిగిన వారలెల్లరు = రక్షకుండగు యేసు నొద్దకు రండి రండి - విశ్వసించుచు ॥దేవుడిచ్చిన॥

## 29.

# దేవుని వాక్యానందము.

రా - మోహన　　　　　　　　　　　　　　　　　　　　　　　　తా - అట

సుఖ మిచ్చెగద మాకు - ప్రభుయేసువా నీ - సురుచిరమగు వాక్కు = నిఖిల కల్మష వనమునకు దవ - శిఖి శిఖలవలె గాల్చు నీదగు - ముఖవికాసిత వాక్యములు బహు - సుఖము లొసగు తవాశ్రితాళికి ॥సుఖమిచ్చె॥

1. జగతిలోపల మెండుగ - నుండిన వివిధ - మగు శాస్త్రములు జూడగ = మిగుల గందరగోళమై మరి - యొకటి కొకటి విరుద్ధముగ మ - ర్త్యగణ కల్పిత మగుచు నున్నవి - తగని వని ద్రోచితిమి వాటిని ॥సుఖమిచ్చె॥

2. నీ వాక్యముల భావము - నమ్మిన పాపి - జీవుల కది జీవము = కేవలంబగు ధర్మశాస్త్రము - దేవు డిచ్చిన దొకటి బైబిలు - ఈ వసుధగల సర్వ పాపుల బ్రోవ వచ్చిన నిన్ను జూపెను ॥సుఖమిచ్చె॥

**30**

## క్రైస్తవ బోధకులయొుక్క యుద్యోగ పత్రిక.

రా - కల్యాణి — తా - త్రిపుట.

సువార్తా మధుర వచనము - నా సఖులార - భువిలో జాటుడీ యనుదినము = అవిరతమును[1] జగదం - త్యము[2] వరకు మీతోనె - తవిలి[3] యుండెదను - సంతసముగ మీరేగి = సవినయ ప్రియ బోధచే ని - శ్చయముగ మద్వాక్యములు మా - నవులకెల్లను దెలిపి వారి - మృ - దువుగ శిష్యులగ నొనరించుచు ॥సువార్త॥

1. వరుసతో నటమీదను - పితా పుత్ర - పరిశుద్ధాత్మల పేరను = పరమానందముతోడ బాప్తిస్మ స్నానము - గురుతుగ మీరలొసగుడీ యంచు మరి దెల్పె = నెరవుగ[4] నా యాజ్ఞలన్నియు - నిక్కముగ[5] మది[6] నమ్మువారలు - పరమ పదమున నిత్య రక్షణ - వర సుఖంబులు బొందుచుందురు ॥సువార్తా॥

2. మదిలోన నను నమ్మని - దుర్జనులను - తుది[7] ఘోర నరకాగ్నిని = విదితంబుగ దీర్చి వేయంగ బడు నంచు - నిదిగో రమ్మని జేతు లెత్తి శిష్యుల పైని = ముదముగ[8] నాశీర్వదించిన - పిదప[9] మింటికి[10] నెత్తబడి తన - యెదుట వారి కదృశ్యుడై[11] ప్రభు - యేసు కైవల్యమున[12] కేగెను[13] ॥సువార్తా॥

**31.**

## క్రైస్తవానుభవాభ్యాసములు.

రా - శంకరాభరణము — తా - అట

యేసు నామంబెత్తి పాడుదమ - క్రీస్తు = దాసులతో పొత్తు గూడుదమ ॥యేసు॥

1. ఇహ సంబంధుల పొందు చాలింతమ = మహా మహుడౌ దేవుని యాజ్ఞ పాలింతమ ॥యేసు॥

2. సువిశేషార్థములన్ని శోధింతమ = యనుభవమాత్మగొను దాక సాధింతమ ॥యేసు॥

---

(30). 1.ఎల్లప్పుడు 2.లోకాంతమువరకు 3.వెంబడించి 4.పూర్ణముగా 5.నిశ్చయముగా 6.మనస్సున 7.చివరకు 8.సంతోషముగా 9.తరువాత 10.ఆకాశమునకు 11.అదృశ్యమై 12.పరలోకమునకు 13.చేరెను.

3. దోషములను బైట బెట్టుదమ – కపట = వేషభాషల గ్రుంగ బట్టుదమ ॥యేసు॥

4. సర్వోన్నతునిపాట్లు మదినెంతమ – మన = గర్వాదులను బట్టి తలద్రుంతమ ॥యేసు॥

5. జనులనిందలకెల్ల నోర్చెదమ – బోధ = కనిపెట్టి ప్రభుచెంత నేర్చెదమ ॥యేసు॥

6. మానావమానముల్ భరియింతుమ – యోర్వ = లేని గుణముల వేరు పెరుకుదమ ॥యేసు॥

7. పరిశుద్ధాత్మను పొందనడుగుదమ – బుద్ధి = పరమానందము జాడనడుపుదమ ॥యేసు॥

8. సకల మానవులాత్మ సరిజూతమ – సరి = మొగమిచ్చుకపు మాట విడిచెదమ ॥యేసు॥

9. దినము ప్రార్థన సేయ గురియుంతమ – చెడ్డ = మనసు బద్ధకముపై నెదిరింతమ ॥యేసు॥

10 గురుబోధస్థలికి బిరబిరబోదమ – బుద్ధి = తిరముంచి వాక్యార్థ మెరుగుదమ ॥యేసు॥

11. మనసులొక్కటి జేసి ప్రార్థింతమ – తండ్రి = కనికరమును భాగ్యమర్థింతుమ ॥యేసు॥

12. ఒకరితప్పొకరు క్షమించుదమ – చిత్త = మకలంకముగను బ్రేమించెదమ ॥యేసు॥

13. యెపుడితరుల మేలు భావింతమ – మనల = శపియించు పగవారి దీవింతమ ॥యేసు॥

14. ఇతరుల మనపోల్కె స్నేహింతుమ – క్రీస్తు = మతసార మిదియని యూహింతుమ ॥యేసు॥

15. ఘనమైన దేవుని దలచెదమ – మనము = మనసంతటితో బ్రేమ సలుపుదమ ॥యేసు॥

16. మంచి మానససాక్ష్యమాశింతమా – దాని = నుంచి భక్తులలో ప్రకాశింతుమా ॥యేసు॥

17. దిట్టమైన విశ్వాసమున నిల్లమ – వహ్నిన్ బుటము పెట్టిన ధైర్యమతి దాల్తమ ॥యేసు॥

18. భువినున్నన్నాళ్లు నెమ్మది గొందమ – కాల = అవసానమున క్రీస్తు దరినుందమ ॥యేసు॥

## 32.

## యేసునకు వందనము.

రా - శంకరాభరణము (చాయ: ఉదయించినాడు) తా - అట.

వందనమయ్యా - యేసు నీకు - వందనమయ్యా - మా కోరిక - లందియ్యవయ్యా = వందనమయ్య నీ సుందర పాదార - విందములకు భక్తి - వినతులు గావింతు = సందియంబులు లేని పరమానందమున నీయందు డెందము - పొందుపడ జేయవె యెహోవా - నందనా పాపేంధనాగ్ని ॥వందనమయ్యా॥

1. నర దైవత్వములు - రెండుగూడి - పరిపూర్ణమైన - దేహాత్మలు - ధరియించి యందు - లేశంబయిన - దురితంబులేని - యవతారము - నెరవుగా దాల్చి = ధరణికి నేతెంచి నిరయార్హులగు సర్వ - నరుల రక్షింప నీ కరుణా ప్రవాహము = విరివిగా పరుగెత్త జేయుచు - విమలమగు నీ ప్రాణరక్తము - లరుదుగా సమర్పణము చేసియు - తిరిగి లేచితివో మహాప్రభూ ॥వందనమయ్యా॥

2. నీ పుణ్యమందు - నమ్మికొనెడి - యే పాపియైన - తత్క్షణమున - శాపంబుబాపి - త్రాణగలిగి - నీ సజ్జనుండు - కృపవానిని - కాపాడుచుండు = దీవించు భవదీయ దివ్య వాగ్దత్తంబు - లాపత్పరంపరల కడ్డుపడుచు నుండి = నీ పయిన తన భారమెల్లను- మోపి యోపికనుండ నేర్పిన - పాపిపుణ్యుండగుచు నాత్మను - భవ్య సుఖ మఖిలంబు బడయును ॥వందనమయ్యా॥

3. శమదమ ప్రేమ - కృపా వినయ - సద్గుణములనెడి - భూషణముల - నిమిడియున్నట్టి - తనువు దాల్చి - క్రమముగానందు - దైవత్వము - కనుపరచినావు = విమలోపదేశముల్ వివిధంబుగా శిష్య - సముదాయమునకు నుత్తమముగా బోధించి - యమిత పాపహరంబునకు భువి నవతరించిన మేను సిలువను - శ్రమను మృతి కల్పించి మృత్యువు - జంపి జీవించిన మహాత్మా ॥వందనమయ్యా॥

## 33.

## యేసు నామము మధురము.

రా - మారువ తా - ఆది.

యేసు నామ - మెంతో మధురం - యేసు నామ - మెంతో మధురం = దోసములు మోసములు - నాశ మొనరించు ప్రభు ॥యేసు॥

1. స్వాంతమునను - శాంతి నిడును = చింతలను భ్రాంతులను - వింతలుగ ద్రుంచు ప్రభు ॥యేసు॥

2. నెమ్మి జేయు కమ్మివేయు = నమ్మికలు సొమ్ములుగ - ముమ్మరము జేయు ప్రభు ॥యేసు ॥

3. ప్రేమ లెదుగు - క్షేమ మొదవు = కామ గుణ పామరతి - లేమి చొరనీదు ప్రభు ॥యేసు॥

4. మోక్ష దశకు - సాక్ష్య మొసగు = నక్షయ సురక్షణకు - దక్షత వహించు ప్రభు ॥యేసు॥

5. శీల మతుల - పాలి వెతల = తూల జనదోలి తన - జాలి కనపరచు ప్రభు ॥యేసు॥

## 34.

## యేసు నామము పావనము.

రా - ఆనందభైరవి తా - అట.

యేసు నామమే పావనము - మాకు - యేసు గద నిత్య జీవనము = దాస జన హృద్వికాసమైయెల్ల[1] - దోసములకు వి - నాశకరమైన ॥యేసు॥

1. సాధు మానసోల్లాసములు - యేసు - నాధు గుణ చిద్విలాసములు = బోధ గొను వారి - బాధ వెడలించి - మాధుర్యమగు ముక్తి - సాధనము లిచ్చు ॥యేసు॥

2. భక్త[2] జన లోక పూజ్యములు - రక్త[3] - సిక్త పాదపయోజనములు = ముక్త[4] రాజ్యాభి - షిక్తుడౌ సర్వ - శక్తి యుతుడైన - సామియగు క్రీస్తు ॥యేసు॥

3. దీన జన నిత్య తోషణము[5] - సిల్వ - మ్రాని ప్రభు మృత్యుఘోషణము = పానకము[6] జుంటి - తేనియల స్వాదు[7] - వీనులను గ్రోలు[8] - మానవుల కెల్ల ॥యేసు॥

4. పాపులకు మంచి పక్షములు[9] - ముక్తి - జూపు క్రీస్తు కటాక్షములు = పాప సందోహ[10] - కూపమున గూలు - కాపురుషు నన్ను గాచుకొని ప్రోచు ॥యేసు॥

## 35.

## పాపోత్పత్తి.

రా - శంకరాభరణము (చాయ: నీ సమాధానము దాసునికిప్పుడు) తా - త్రిపుట.

మన మొదటి తలిదండ్రులు - మాయకులోనైరి యన్నలారా - వారి కనుగొనలకు సిగ్గు - గదుర మోములు వంచిరన్న లారా ॥మన మొదటి॥

1. తమ నగ్నతలు చూడ - తా మొప్పలేరైరి - యన్నలారా = కొన్ని యమరిన మఱ్ఱాకు లంగంబు - లనుగట్టి రన్నలారా ॥మన మొదటి॥

2. పరమాత్ముడిడు నాజ్ఞ - పాలించలేరైరి - యన్నలారా - పూర్వ = పరిశుద్ధి యడబాసి - పాపాత్ములైపోయి రన్నలారా ॥మన మొదటి॥

3. నరవంశజుల కెల్ల - దొరలె తద్దురవస్థ యన్నలారా - క్రీస్తు = మరణంబు మన పాపహరణంబు గావించు నన్నలారా ॥మన మొదటి॥

---

1.మనసున వికసింపజేయునది 2.భక్తజనుల సమూహముచేత పూజింపబడినది 3.రక్తముచేత తడపబడిన పాదపద్మములు 4.ముక్తి రాజ్యమునకు రాజుగా అభిషేకింపబడినవాడు 5.సంతోషము 6.పానకము యొక్క పూదేను యొక్క 7.మధురము 8.త్రాగు 9.సహాయములు 10.సమూహమనెడి నూతిలో

**35.**

## ఆయన అప్పగింపబడిన రాత్రి.

రా - అసావేరి (చాయ: సిరులెల్ల వృధకాగ) తా - రూపకము.

ఆ యంధకారంపు - రేయిలో క్రీస్తు పడు - నాయాసములు దలచరే = సాయంతనము శిష్య- సమితితో[1] భోజనము - జేయుగూర్చున్న ప్రభవు - భక్తుల కనియె ॥ఆ యంధ॥

1. ఒకడు మీలో నన్ను - యూద గణముల[2] చేతు - లకు నప్పగింప దలచెన్ - మొక[3] మిచ్చకము గల్గు - మూర్ఖుడగు యూదాను - మొనసె[4] వీడనుచు దెలిపి యిక మిమ్ము గూడియుం - డక యుందునని రొట్టె - విరిచి స్తోత్రంబుజేసి = ప్రకటంబుగా - దీని భక్షించుడని పిదప - నొక పాత్ర నాన[5] నిచ్చెన్ - ద్రాక్షారసం ॥ఆ యంధ॥

2. తనమేని గురుతు రొ - ట్టెను జేసి పాపవిమో - చనమైన రక్తమునకు - నొనరంగ ద్రాక్షారస - మును గురుతుగా దెలిపి - నెనరుగల కర్త యపుడు - చనె గెత్సెమను వన - స్థలిలోన శిష్యుల - నునిచి తానొక్కరుండు = మనసు వ్యాకులము చే - నిండియుండగా - ఘనుడు ప్రార్థించె దండ్రిన్ - గాఢముగాను ॥ఆ యంధ॥

3. శ్రమచేత దన శరీ - రము నుండి దిగజారె - జెమట రక్తపు బొట్లుగా - నమితమౌ[6] లోకపా - పము జూచి నిట్టూర్పు లప్పటప్పటికి బుచ్చి - క్రమముగా దూత తన - కడ కరుగుదెంచి[7] శాం - తము బల్కి చనిన పిదపం[8] = తమ మనంబుల బోలు - తమసమున[9] యూద సై - న్యము లేగు[10] దెంచె నపుడు - గెత్సెమను వనికి ॥ఆ యంధ॥

4. పరశాంతి శీల[11]స - ర్వజ్ఞతలు గల ప్రభుం - డెరిగి తనకున్న పాట్లు - పరిపంది[12] గణముతో - బలికె మిరిచ్చోట - నరయుచున్నారెవనిని - నరులు నజరేతు యే - సను వాని ననగ దా - నెరిగించె నేనేయని = గురుదీప[13] శిఖల సో[14] - కు పతంగముల[15] భంగి - ధరణిపై పడిరి వారల్ - దర్పము[16] లణగి ॥ఆ యంధ॥

5. తన శిష్యులను విడువు - డని చెప్పి రిపులచే[17] - దను దానె పట్టువడియెన్ - కినిసి[18] పేతురు యాజ - కుని దాసు కర్ణంబు[19] - దునుమంగ[20] క్రీస్తుడపుడు - కనికరంబున స్వస్థ - తను జేయు నావిభుని - కరములను విరిచి కట్టి = వెనుక ముందర జుట్టు - కొని యెరూషలేము పుర - మునకు దీసుక బోయిరి - రాణువవారలు ॥ఆ యంధ॥

---

1.సమూహము 2.సమూహముల 3.ముఖస్తుతిచేయు 4.సిద్ధపడెను 5.త్రాగుటకు 6.అపరిమితమైన 7.వచ్చి 8.పిమ్మట 9.చీకటిలో 10.వచ్చెను 11.మంచిస్వభావము 12.శత్రువుల 13.గొప్పదీపజ్వాలలు 14.తగులు 15.మిడతలవలె 16.గర్వములు 17.శత్రువులచేత 18.కోపించి 19.చెవి 20.కోయగా

## 36.

### క్రీస్తు తన ప్రయాసములను ముందు దెలియజేయుట.

రా - ఆనందభైరవి (చాయ: నీకన్న నీకవేరె వేల్పులు) తా - ఆది.

యేసు శిష్యులకు - నెరుక జేసిన భవిష్యోక్తులు వినరే = కైసారయ న - గరి ప్రాంతములను - ఘనుడు జేరి తన - గతిమతి - దలచుచు ॥యేసు॥

1. యెరూషలేమనెడి - పురమున తనకిక - కలిగెడి దు:ఖములు = దురితాత్ములు యూ - దులు కడుబాధలు - పరిచి తన్ను సిలువను చంపుదురని ॥యేసు॥

2. నీతి పాతకు ల - నేకులు పెద్దలు - ఖ్యాతిగ నర్చకులు = ఆ తరి తన నప - హాస్యములాడుచు - బోతరించి యుమ్మి - వేతురటంచును ॥యేసు॥

3. మనుజ కుమారుడు - మరణమై సమా - ధిని వేయంగబడున్ = తనరగ మూడవ - దినమున పునరు - త్థానుడగుచు ద - ర్శన మిడు మీకని ॥యేసు॥

## 37.

### సిలువ యెదుట హృదయవేదన.

రా - ధన్యాసి తా - ఆది.

నా యన్న రాగదే - ఓ యేసు తండ్రి - నా యన్న రాగదే = నా ప్రాణ ధనమా - నా పట్టుకొమ్మా - నా ముద్దు మూట - నా ముక్తిబాట - నా యన్న రాగదే = నా యన్న సిలువలో నీ - వాయసపడిన నాటి - నీ యంఘ్రియుగము[1] నిపుడు - నా యాస దీర జూతు ॥నా యన్న॥

1. ఒక తోట లోపట - నాడు నీవు పడిన - సకల శ్రమ లిచ్చోట = నికటమై[2] యున్నట్లుగా - నిట్టూర్పులతో దలంతు - నకట[3] నా - రాతిగుండె - శకలంబై[4] పోవునట్లు ॥నా యన్న॥

2. పరమాశ్చర్యము గాదా - యీలాటి ప్రేమ - ధరణిలో[5]నున్నదా = చురుకౌ ముల్లుల పోట్లకు నీ - శిరము[6] నా వంటి నీచపు - పురుగు కొరకం దిచ్చెడు నీ - కరుణన్ దర్శింతు నేడు ॥నా యన్న॥

3. ఇచ్చక[7] మిది గాదు - మిగుల దలపోయ - ముచ్చట దీరదు = అచ్చి వచ్చిన నా - యవతారుడ నీ ప్రక్క - గ్రుచ్చు గాయము లోపల నే - జొచ్చి నీ ప్రేమ జూతు ॥నా యన్న॥

4. తల వంచి సిగ్గున - నే జేయు నేర - ముల నెంతు నాలోన = బలుమారు నీ గాయముల - గెలికి నిన్ శ్రమపరచు నా - ఖల[8] దోషములకై యిపుడు - విలపించి వేడుకొందు ॥నా యన్న॥

---

1.రెండుపాదములు 2.సమీసము 3.అయ్యో 4.ముక్కలై 5.భూమిలో 6.తల 7.ప్రియము 8.నీచమైన

## 39.

### ఆశ్చర్యకరమైన సిలువ.

రా - పున్నాగ తోడి (చాయ: ఎంతో సుందరమైనవి) తా - త్రిపుట.

ఏమాశ్చర్యము ప్రియులారా - క్రీస్తు మరణము - ప్రేమ జూడరే మనసార = నా మహాత్ముడు మరణ - మగు రీతి గనుగొన్న - సామాన్యమగు నొక్క - జనుని చందము గాదు = ఈ మహిని గల పాప జీవుల - పై మహాకృపజూపి నిత్య - క్షేమ మొసగెడు కొరకు బలు శ్రమ - చే మృతుండైనాడు స్వేచ్ఛను ॥ఏమాశ్చర్యము॥

1. కొండలవలె భారమై - లోక పాపములు - దండింపబడె ఘోరమై = నిండు భారము క్రింద - నిలుచున్న వేళను - గుండె దిగులున తనువు - నిండె రక్తపు జెమట = వెండుకొని దు:ఖములతో నా - తండ్రి యీ పాత్రమును నా కడ - నుండి తొలగించుటకు మనపై - యుండినను జేయు మని వేడెను ॥ఏమాశ్చర్యము॥

2. కడు దుర్మార్గులచేతను - గ్రీస్తుడు పట్టు - పడె దానంతట తాను = జెడుగు లెందరు నింద - జేసి మోముపై నుమిసి[1] - వడిముళ్లతో నల్ల - బడిన కిరీటము = తడయ[2] కౌదల[3] బెట్టి కరముల - నడుగులను సిలువ నిడి మేకులు - దొడిపి[4] ప్రక్కను రక్త జలములు - దొరగ[5] గుంతము[6] గ్రుచ్చి రహహా ॥ఏమాశ్చర్యము॥

3. ఇరు[7]పార్శ్యముల నిద్దరి - దొంగల నునిచి - మరణావస్థల బెట్టిరి = నిరపరాధి ప్రభువు - దురితాత్ము లొనరించు - తరుచు బాధల కోర్చి - మరి వారి గరుణించి = యెరుగ రేమి యొనర్తురో యీ - దురిత జీవుల వీరి నోహూ - పరమ జనక[8] క్షమించు మని తన - యురుల[9] కొర్కై వేడుకొనియెను ॥ఏమాశ్చర్యము॥

## 40.

### స్త్రీలు సిలువచెంత ధ్యానించుట.

రా - సారంగ (చాయ: వచ్చి గాబ్రియేలు) తా - త్రిపుట.

చేడియలు గుంపుగూడిరి - క్రీస్తు - జాడ - గని తాల్మి[1] వీడిరి = ఆడికల[2] నోర్చి నేడు మన పాలి - వాడు సిలువ ను - న్నాడు గదె యంచు ॥చేడియలు॥

1. వారి మొగములు వాడెను - యేసు - వారి వెత లెల్ల - జూడను = నీరు[3] దృక్సర[4] - సీరుహములందు - జార తమ కొన - గోరులను మీటి[5] ॥చేడియలు॥

2. రొమ్ములను జేతు లుంచుచు - చింత[6] - గ్రమ్మి నిట్టూర్పు[7] లిచ్చుచు = కొమ్మలట[8] నిల్పు[9] - బొమ్మలన చేష్ట[10] - లిమ్ముచెడి యబ్బు[11] - రమ్ముతో నిల్చి ॥చేడియలు॥

---

(39) 1ఉమ్మివేసి 2.అలస్యముచేయక 3.తలమీద 4.గ్రుచ్చి 5.దొర్లునట్లు 6.ఈటె 7.ప్రక్క 8.తండ్రి 9.శత్రువుల
(40). 1.ఓర్పు 2.నిందలు 3.కన్నీళ్ళు 4.కమలములవంటి కన్నులనుండి 5.చిమ్మ 6.దు:ఖముచేత నిండుకొని 7.ఉస్సురనుచు 8.స్త్రీలు 9.నిలువబెట్టిన బొమ్మలువలె 10.కదలక మెదలక 11.ఆశ్చర్యముతో

## 41.

### సిలువ.

రా – ఆనందభైరవి (చాయ: వచ్చి గాబ్రియేలు పల్కెను) తా – త్రిపుట.

అపు దర్చుకాదు – లుప్పొంగిరి – ప్రభుని – విపరీతముగ జంపసాగిరి = కృపమాలినట్టి పా – పపు జిత్తమున నిష్ఠు – రపు సిల్వమ్రానిపై – బ్రభుని వేయుట కొప్పి ॥అపు దర్చు॥

1. యెరూషలేమను నూరి బైటను – దు:ఖ – కరమైన కల్వరిమెట్టను = పరమ సాధుని సిల్వ – పై బెట్టి తత్పాద – కరమధ్యముల మేకు – లరుదుగ దిగగొట్టి ॥అపు దర్చు॥

2. జిమ్మె నిమ్మగు మేని రక్తము – దాని – నమ్ము వారల కెంతో యుక్తము = నెమ్మోము వాడి కెం – దమ్మి పూవెల మస్త – కమ్ము వేటులను ర – క్తము జారి కనుపెట్టె ॥అపు దర్చు॥

3. గడి దొంగ లిరువురుని బట్టిరి – ప్రభుని – కుడి యెడమలను సిల్వ గొట్టిరి = చెడుగు యూదులు బెట్టు – కడు బాధలను మరియ – కొడు కోర్చుకొని వారి – యెడ దయ విడ డయ్యె ॥అపు దర్చు॥

## 42.

### సిలువ ధ్యానము.

రా – ముఖారి (వందనం నీకే వందనం) తా – త్రిపుట.

చూడరే క్రీస్తుని జూడరే – నా సఖులార – చూడరే క్రీస్తుని జూడరే = చూడరే నా ముక్తి పదవికి ఱేడు – యే దశ గూడినాడో ॥చూడరే॥

1. మంటికిని నాకాశమునకును – మధ్యమున వ్రేలాడుచుండగ – నంటగొట్టిన సిలువ మ్రాని – కప్పగించుట కొఱకు నిను గాంచెనా – యిది మది నెంచున – హా నా = కంట నే నిటువంటి యాపద గంటి ప్రాణములుండునే యిక ॥చూడరే॥

2. మించి పొంతిపిలాతు సత్య మొ – కించుకైన దలంప కక్కట – వంచనను గొట్టించి యూదుల – మంచితనమే కోరి యప్ప – గించెనా – మేలు గ – ణించెనా = ఇతని – గాంచి కాంచి భక్తులెట్లు స –హించిరో పరికించి మీరిది ॥చూడరే॥

3. ఊటగా రక్తంబు కారుచు – నుండ బల్లెపు బ్రక్కపోటు – మాటిమాటికి జూడ దు:ఖము – మరలునే తలమీద ముళ్ల కి – రీటమా – యితనికి – వాటమా = యూదులు – మోటులై బాహాటమున నీ – పాటులను గాటముగ జేసిరి॥చూడరే

## 43.

### క్రీస్తుని యద్భుత ప్రేమ.

రా – సౌరాష్ట్ర (చాయ: యేసుని ప్రేమను నేమరక) తా – ఆది.

పాపులయెడ క్రీ – స్తుని ప్రియ మెట్టిదో – పరికింపరె క – ల్వరిగిరిపై = నాపదలను దన – కీగతి బెట్టెడు – కాపురుషుల దెస – గనుగొను కృపతో ॥పాపుల॥

1. యెరుషలేము క – న్యలు కొందరు తన – యెదుట వచ్చి యేడ్చుచు నిలువన్ = వరుస నప్పురికి – వచ్చు – నాశన గతు – లెరుగ బలికి వా – రల నోదార్చెను ॥పాపుల॥

2. శత్రువులటు తను – జంపుచు నుండగ – మైత్రి జూపె సమ్మతి తోడన్ = స్తోత్రము జేసెను – దండ్రీ వీరల – దురిత మెల్ల క్షమి – యింపవె యనుచును ॥పాపుల॥

3. తన ప్రక్కను సిలు – వను వేసిన యొక – తస్కరు డించుక వేడుకొనన్ = కనికరము మన – మున బెనగొన ని – చ్చెను మోక్షము తన – తో నుండుటకున్ ॥పాపుల॥

4. మితిలేని దురిత – జీవుల లోపల – మించి యున్న పతితుల కైనన్ = హితముగ మోక్షం – బిచ్చుటకై శో – ణిత మిచ్చెను నా – మతి కది సాక్షిగా ॥పాపుల॥

## 44.

### మరియ బాధ వివరింపతరమా.

రా – మరువ తా – జంపె.

ఈలాటి వెతజెందెనా[1] – నీకు నా యేసు ప్రభు వరనందనా = తాలిమెదదూలి మరియాలతా తన్వి తన వాలు[2] గన్నీళ్లు భువిరాల నేడ్చుచు ననియె ॥ఈలాటి॥

1. తుదమొదలు లేని దేవా – నీవు నా యుదరమున[3] బుట్టి నావా = యిదిగో నీ సిలువదెస వీక్షింప[4]నా గుండె – చెదరి ఝల్లుఝల్లుమని కుదురుపడ దహహ నీ ॥ఈలాటి॥

2. ఏ దోష మెరుగనట్టి – యన్న నీ పాద[5] కర[6] తలము లిట్టి = సూదిమేకుల చేత మోదబడె[7] నయ్యయో – యేది యూదుల న్యాయ మెంత చెడు తన మహహ ॥ఈలాటి॥

3. తలపైని ముళ్ళవేటూ – రక్తజల[8] మొలుకు[9] నీ ప్రక్కపోటూ = సలుపు నీ గాయముల వలవంత నాలోన – దలపోయ తరిగుండె తల్లడిలు వహహ ॥ఈలాటి॥

---

1.బాధకలిగినదా 2.కన్నులు 3.కడుపున 4.చూడగా 5.పాదములు 6.చేతులు 7.కొట్టబడెను 8.జలమువలె రక్తము 9.కారుచు

## 45.

# క్రీస్తుయొక్క బాధలు.

రా - ఆనందభైరవి తా - త్రిపుట.

వినరే క్రీస్తుని బాధా - విధమున - ముదము[1] - ఘన భక్త సౌఖ్యాస్పదము[2] = ఇనుడు[3] తూర్పున బొడమున[4] వేళను - ముని ప్రధానార్చకుని యెదుటకు- కినుకనుగొని[5] చనిరి యూదులు - గుణ నిధియగు మరియ తనయుని ॥వినరే॥

1. యేసు నాధుని మోము[6] - వీక్షించి యాజకుడు బలికెన్ - మదిలోన నలుకన్[7] - నీవు జేసెడి యుపదేశములనున్ - నమ్మ - నే సాక్ష్యమిడితి మర్త్యులకు[8] - నేమి - చేసి వచ్చితివి శిష్యులను - నపుడు = యేసు వానితో ననియె నేకాంతమున గాక - భాసురంబుగ[9] సభల - బాహాటముగను - నుపదేశ మొనరించితిని నేనని - తెలుప తలవరి[10] యొకడు దండము[11] - దీసి కొట్టెను మోసమతియై - దోసమించుక[12] లేని ప్రభువును ॥వినరే॥

2. నీవే క్రీస్తుడవని - నిజము మేమందరము - వినగ - జెప్పుమనగ - నప్పు - డా విభుడు[13] బలికె మెల్లనగా - నిదే - మీ భావము దెలియ వచ్చెనుగా - మీకు - నా విధము దెలుప నమ్మరుగ యికను - దేవుని బలమైన దివ్య సన్నిధిని ప్ర-భావుడై[14] మనుజ కుమారుడు వసియించు - కేవలంబని తెలుప వారలా - శీవిషంబులభంగి[15] దురితపు - భావులై సాక్ష్యంబికేలని - పరమ సాధుని జంప దలచిరి ॥వినరే॥

## 46.

రా - సారంగ తా - ఆది.

యేసు సిలువలో వెలసిన సారము - నెపుడు గ్రోలుదము ప్రియులారా = ఘోషలు మూల్గులు గొల్గొత గిరిని ప్ర - యాసము లొందిన యేసుని దలచుచు ॥యేసు॥

1. పరిసయ్యులు నా ప్రధానార్చకులు - పట్టుకొనిరి ప్రభువు క్రీస్తుని =స్థిరమతి యగు శ్రీ యేసుని కరములు - వెరువక కట్టిరి మరి కఠినాత్ములు ॥యేసు॥

2. కన్నుల గంతలు గట్టిరి కర్తను - గొట్టిరి బహు పాట్లుబెట్టిరి = అన్నిటి కోర్చెను యా పుణ్యాత్ముడు - గన్నను మన పాపముల మన్ననకే ॥యేసు॥

3. ఇల నరుల దయ గోరిన పిలాతు - సిలువకు యేసుని సెల విచ్చెను = పలుముండ్లతో నల్లి కిరీటము - పలుగులు బెట్టిరి ప్రభువుని తలపై ॥యేసు॥

---

(45). 1.సంతోషముతో 2.సుఖమునకాధారము 3.సూర్యుడు 4.ఉదయించు 5.కోపముచేత 6.ముఖము 7.కోపముచేత 8.నరులకు 9.ప్రకాశమానముగా 10.బంటు 11.దుడ్డుకర్ర 12.పాపమెరుగని 13.ప్రభువు 14.మహిమతో 15.సర్పములవలె

4. అసత్య జనములు యా రాణువులు - యెత్తిరి సిలువను యేసుపైన = ప్రశస్త ప్రభువా మృత్యువ మ్రానును - ప్రజలందరికై ప్రేమగ మోసెను ॥యేసు॥

5. కపాల స్థలమున కర్తను మేకులు - కొర్తను వేసిరి గొల్లుగాన్ = కాయము నిండా కమ్మెను రక్తము - ఆయన బాధలు అన నొల్లగునా ॥యేసు॥

6. ప్రాణము వీడిన ప్రభువుని ప్రక్కను - రాణవు డీటెతో బొడవగా = నాణ్యపు రాజుకు రక్తము నీళ్లును - త్రాణ గలిగి బహు ధరలో బడెను ॥యేసు॥

## యేసుక్రీస్తు జన్మము.

**47.**

### నేడు రక్షకుడు మీకు పుట్టియున్నాడు.

రా - సురటి (చాయ: పరలోకమున నుండు దేవ) తా - త్రిపుట.

ఉదయించినాడు - క్రీస్తుడు నేడు - ఉదయించినాడు - ఓ జనులార - ఉదయించినాడు - మన రక్షకుడు - ఉదయించినాడు = విదితయౌ మరియ నందనుడై[1] యిమ్మానుయేల్ = సదయుడై[2] చెడియున్న పృథికి [3] - నొదవ[4] సమ్మద[5] మల పిశాచికి - మద[6] మణంగను సాధు జనముల - హృదయముల ముద[7] మెదుగునట్లు ॥ఉదయించినాడు॥

1. ఏ విభుని[8] వలన - నీ జగ మయ్యె - నా విభుడీ యిలను = దైవత్వమగు మను - ష్యావతారము దాల్చె = జీవులకు జీవనమునై తగ - దేవుడును దా నొక్కడు చిర - జీవియగు ప్రభు పాపి జీవుల - గావ దను జావునకు నొడబడి[9] ॥ఉదయించినాడు॥

2. యూదుల నడుమన్ - బెక్కగు భేదా - భేదముల్ బొడమన్ = వాదించి ప్రభు రాక - గాదంచు మది నెంచి = మీదు జూడని వారి కాత డ - నాదరుండై స్వీయ జనులకు - మోద మిగు రొత్తంగ మద్ఘను[10] - డౌ దయాళుడు ప్రాణ మిడుటకు ॥ఉదయించినాడు॥

---

1.కుమారుడు 2.కృపగలవాడు 3.భూమి 4.కలుగునట్లు 5.సంతోషము 6.గర్వము అణగులాగున 7.సంతోషము పెరుగునట్లు 8.ప్రభుని 9.సమ్మతించి 10.నా

## 48.

### క్రీస్తు నరావతార సందేశము.

రా - యదుకులకాంభోజి తా - ఆది.

వినరే యో నరులారా - వీనుల కింపు మీర - మనల రక్షింప క్రీస్తు - మనుజావతారు డయ్యె - వినరే = అనుదినమును దే - వుని తనయుని పద - వనజంబుల[1] మన - మున నిడికొనుచును ॥వినరే॥

1. నరరూపు బూని ఘోర[2] - నరకుల రారమ్మని - దురితము బాపు దొడ్డ - దొరయౌ మరియా వరపుత్రుడు = కర[3] మర దగు క - ల్వరి గిరి దరి కరి[4]- గి రయంబున[5] ప్రభు - కరుణను గనరే ॥వినరే॥

2. ఆనందమైన మోక్ష - మందరి కియ్య దీక్ష[6] - బూని తనమేని సిలువ - మ్రాను నణచి మృతి బొందెను = దీన దయా పరు - డైన మహాత్ముడు - జానుగ - యాగము సలిపిన తెరంగిది ॥వినరే॥

3. పొందు[7]గోరిన వారి - విందా[8] పరమోపకారి - యెంద రెందరి బరమా - నందపద - మొందగ జేసెను = అందమునన్ దన - బొంది[9]సురక్తము - జిందెను భక్తుల - డెందము గుందగ ॥వినరే॥

4. ఇల మాయావాదుల మాని - యితడే సద్గురు డని - తలపోసి చూచి మతి ని - శ్చల భక్తిని గొలిచిన వారికి = నిల జనులకు గలు - ముల[10]నలరెడు ధని - కుల కందని సుఖ - ములు మరి యొసగును ॥వినరే॥

5. దురితము లణప వచ్చి - మరణమై తిరిగి లేచి - నిరత మోక్షానంద సుం - దర మందిరమున కరుదుగ జనె[11] = బిరబిర[12]మన మం - దర మా కరుణా - శరనిధి[13] చరణ[14] మె - శరణని పోదము ॥వినరే॥

## 49.

### గొల్లల గానము.

రా - ఆనందభైరవి తా - త్రిపుట.

రారె గొల్లవారలారా - నేటి - రాత్రి బేత్లెహేము నూర = జేరి మోక్ష దూత - కోరి దెల్పెను క్రీస్తు - వారి జాడకన్ను - లారా జూతము వేగ ॥రారె॥

1. పుట్టుచావులు లేనివాడట - పసుల - తొట్టి లోపల బుట్టె నేడట = ఎట్టి వారలను జే - పట్టి పాపము లూడ - గొట్టి మోక్షపు త్రోవ - బెట్టు వాడట వేగ ॥రారె॥

2. బహు కాలమాయెను వింటిమి - నేడు - మహికివచ్చుట కనుగొంటిమి = విహితముతోడ - సేవింప వత్తము మోక్ష - మహితుని గని దుఃఖ - రహితుల మవుదము ॥రారె॥

---

(48). 1.తామరపువ్వులవంటిపాదములు 2.భయంకరులగు 3.మిక్కిలి ఆశ్చర్యకరమైన 4.వెళ్ళి 5.త్వరగ 6.శ్రద్ధతో 7.సహవాసము 8.బంధువు 9.శరీరముయొక్క 10.సంపదలతో నొప్పుచున్న 11.వెళ్లెను 12.త్వరగ 13.సముద్రము 14.పాదము.

## 50.

### దూత మరియను దర్శించుట.

రా - ఆనందభైరవి　　　　　　　　　　　　　　తా - త్రిపుట.

వచ్చి గాబ్రియేలు పల్కెను - మరియ - మచ్చ[1]కంటిడెంద - ముల్కెను[2] = హెచ్చైన శుభముల - నెనలేని[3] కృప దేవు - డిచ్చి యింతులలో[4] ని - న్నెచ్చు జేయునటంచు ॥వచ్చి॥

1. భయ మాత్మలో వీడు కన్యకా - నీవు - దయబొంది యున్నావు ధన్యగా = రయముగా[5] నిదిగో గ - ర్భము దాల్చెదవు పుత్రో[6] - దయమౌ యేసను పేర - తని కిడు మంచును ॥వచ్చి॥

2. అతడెన్నబడును మహాత్ముడై - సర్వో - న్నతుడైన దైవకుమారుడై = హిత మొప్పు దేవు డు - న్నతి జేసి దావీదు - వితత[7]సింహాసన - మతని కిచ్చునంచు ॥వచ్చి॥

3. ఘనతరుడగు వాని రాజ్యము - అంత - మొనగూడ దది నిత్యపూజ్యము = వనితమగు[8] యాకోబు - వంశ మెల్లపు దేలు - కొను నాత దనుచు దె - ల్పెను దూత మరియతో ॥వచ్చి॥

## 51.

### క్రీస్తుని గూర్చిన ప్రవచనములు.

రా - పంతువరాళి　　　(చాయ: ఇదుగగో గొల్లెల కాపరి)　　　తా - అట.

ఇదిగో శుభద త్రాణము - దేవుడు పంపె - నిదిగో శుభద రక్షణము = సదమలంబగు[1] పూర్వ - సత్యవాక్యమునందు - మృదువుగా - దీర్ఘ ద - ర్శుల చేత బలుకబడె ॥ఇదిగో॥

1. అల[2]పిశాచముతోడను - దేవుడు తొల్లి - బలుకు వాక్యము జూడను = పొలతి[3] సంతతి నిన్ను - తలగొట్ట బుట్టునని - తెలియజేసెను మోషే - దీర్ఘ దర్శన వాక్య॥ఇదిగో॥

2. ఘన దివ్య బలిచేయను - పాపములెల్ల - దునిమి[4]పుణ్యము లియ్యను = ఒనరంగ[5] నీ కాల - మున గ్రీస్తు వచ్చునని - మును దానియేలు బ - ల్కెను దీర్ఘ దర్శనము ॥ఇదిగో॥

3. యూద రాజ్యములోపట - బెత్లేమనెడి - యూర గ్రీస్తుడు పుట్టుట = ఆదిలోన మీకా - యను దీర్ఘ దర్శిచే - మోదమున దెల్పబడె - ముందు వేదమునందు ॥ఇదిగో॥

4. మన దోషముల కొరకునై - యేసుని కాయ - మది గాయముల హ్రస్వమై[6] = మన రక్షకునిపాట్లు - గనిపెట్టుల యెషయ్య - మును దెల్పె దీర్ఘ ద - ర్శన వాక్యముల నిచ్చి ॥ఇదిగో॥

---

(50) 1.స్త్రీ 2.ఉలికిపడెను 3.సాటిలేని 4.స్త్రీలలో 5.శీఘ్రముగ 6.కుమారుడు పుట్టెను 7.వెడల్పైన 8.స్తుతింపబడదగినది

(51). 1.మిక్కిలి పరిశుద్ధమైన 2.ఆ 3.స్త్రీ 4.నాశనముచేసి 5.చక్కగా 6.క్షీణించి

## 52.

### క్రీస్తు యొక్క ప్రకాశమైన రాకడ.

రా – ముఖారి (చాయ: హృదయమనెడి తలుపు) తా – ఆది.

నాడు వచ్చినట్లు గాదు – నేడు రాకడ – తేరి = చూడరాదు క్రీస్తునింక జొత్తుమెచ్చుట ॥నాడు॥

1. మొదట గొఱ్ఱెపిల్ల రీతి – నొదిగి వచ్చెగా – యిపుడు = కొదమ సింహమయ్యె మనకు – గుండె దిగులుగ ॥నాడు॥

2. దాసుని వలెను తొల్లి – జూచినాముగా – యిపుడు = దోసములెంచి దండింప – దొరయైనాడుగా ॥నాడు॥

3. ఏ తట్టుబోయిన మనకు – నెదురు వచ్చెగ – పిడుగు = రీతి వాని –యుగ్రమైన దృష్టి హెచ్చగ ॥నాడు॥

4. కొండ బండ లందు డాగి – యుండలేముగా – వాని = అండనుండి మండుయగ్ని – యదిగో వచ్చెగ ॥నాడు॥

5. దిక్కుగ నున్నట్లు యితర దేవతల నమ్మి – వట్టి = పుక్కిటి పురాణములకు – బోయి చెడితిమి ॥నాడు॥

6. వీధుల బోధించువాని – వినక బోతిమి – యిపుడు = బాధబొంది నరకాగ్నిలో – బడబాలైతివి ॥నాడు॥

## 53.

### రాకడ.

రా – ఫరజు తా – ఆది.

తుది[1]దివసము[2] రానున్నది పాపులకు – నదేగదా దుర్గతి కీడ్చున్= సదావిదారిత[3] – హృదాంతరస్థ నర – క దారుణాగ్ని క్రి – మి దు:ఖకరమగు ॥తుదిదివసము॥

1. ఫలమొసగని[4] మ్రానులు[5] నరకంబడి – జ్వలన జ్వాలలపాలగును = ఇలా తలిని[6] క్రీ – స్తులోన ఫలరహి – తులైన నామ ధ – రుల కందరికి యగు ॥తుది॥

2. విగ్రహముల పేరవేల్పుల[7]గొలిచెడు[8] – వివేకశూన్యల కాదినము = వ్యగ్రత[9]నిత్యో – దగ్ర సమగ్ర మ – హోగ్ర నిరయ[10] వ – హ్ని[11]స్తంబగు ॥తుది॥

3. ధనవంతులు ఘనకుల బలశాలులు – దరిద్రులిక నెవ్వరుగాని = ఒనరగ[12] ప్రభు క్రీ – స్తుని మనమున[13] న – మ్మని జనముల కా –దిన మతి భయమగు॥తుది॥

---

1.చివరి 2.దినమున 3.నిత్యముబ్రద్దలుచేయబడినది 4.ఫలింపని 5.చెట్టులు 6.భూమిమీద 7.దేవతలు 8.పూజించే 9.త్రోటుపాటు 10.నరకము 11.అగ్ని 12.సరిపటు 13.మనస్సున

## 54.

# అంత్య దినము.

రా - పంతువరాళి  తా - ఆది.

అయ్యో యిది యెంత దు:ఖము - ప్రభు తీర్పు వేళ - నయ్యో యిది యెంత దు:ఖము = చయ్యన యెహోవా సింహా - సనము చుట్టు - వహ్ని మండు - నయ్యెడ విశ్వాసులకు దు - రాత్మల కగు నిత్య ఖేద ॥మయ్యో॥

1. తల్లి పిల్లలు గూడుదు రచట - దండ్రి తాత లచట గలియుదు = రెల్ల కాల మటుల నుండ - కెడబడి మరి యెపుడు చూడ ॥అయ్యో॥

2. అన్నదమ్ము లచట - గూడుదు రక్క సెలియ లందు గలియుదు = రెన్నడు మరి చూడ రాని - యెడగల స్థలములకు బోదు ॥అయ్యో॥

3. భార్యభర్తలు గూడుదు రచట - బంధు మిత్రులు కలియుదు రందు = కార్య భేదము వలన సర్వ - కాలము మరి కూడజాల ॥అయ్యో॥

4. క్రీస్తు మత ప్రబోధకులు స - మస్త శిష్యులు కూడుదు రచట = వాస్తవ స్థితు లెరుగ బడిన - వలనను విడబడుదు రంద ॥అయ్యో॥

5. శిష్టులు దుష్టులు కూడుదు రచట - స్నేహవంతు లందు గలియుదు = రిష్టము గాని భిన్ను లగుచు - నిక మరి యెన్నటికి గూడ ॥అయ్యో॥

6. అల పిశాచి పాపు లందరు - నడుపు కర్తకు భిన్ను లగుచు = పలు గొరుకుల నిత్య నరక - బాధల పాల్పడక పోరు ॥అయ్యో॥

7. సాధు సజ్జనంబు లెల్ల - సకల దూతలతోడ గూడి = మోదముతో - ప్రభుని వెంట - ముక్తి కేగి నిత్యులగుదు = రాహా యిది యెంత విజయము ప్రభు తీర్పు వేళ - నాహా యిది యెంత విజయము ॥అయ్యో॥

## 55.

# క్రీస్తు మహిమతో వేంచేయుట.

రా - గౌళీపంతు  తా - ఆది.

అదిగో క్రీస్తుడు మేఘారూఢుం - డయి వేంచేయును మింట = తుది దినమున పది పది వేలధికము - దూతలు రావెను వెంటను ॥అదిగో క్రీస్తుడు॥

1. ఇరు తెగువలు గల ఖడ్గము ముఖ గ - హార్వమున[1] వాడిగ లెల్లను = ఖరఖరు[2] వేడిమి కన్నను తమ ముఖ - కాంతులు నంతట బర్వను[3] ॥అదిగో క్రీస్తుడు॥

2. పటుతరమగు వహ్ని జ్వాలలవలె - ప్రభుని కనుంగవ[4] లొప్పను = దిటముగ కుడిచేతిలో నారును నొ - క్కటి నక్షత్రములుండు ॥అదిగో క్రీస్తుడు॥

3. తళతళమను తెల్లని శిశిరమువలె[5] - దన తల వెంట్రుక లొప్పును = ఎలమితోడ[6] కొలిమిలో కరిగించిన - నిత్తడివలె కాళ్లుండు ॥అదిగో క్రీస్తుడు॥

4. చూపులకును మిరుమిట్లగు[7] వస్త్రము - సుపదంబుల వరకుండును = బాపుల గుండెల పగిలెడు నట్లుగ - బాకానాదము నిండును ॥అదిగో క్రీస్తుడు॥

**56.**

## నరకము భయంకరమైనది.

రా - గౌళీపంతు                                        తా - ఆది.

పాపులారా మీ పని సరిగద ప్రభు - కోపదినము వచ్చెన్ = మీ పౌరుషములు మిట్టిబడుటలు[1] - నీ[2] పట్లను పని యేమగునయ్యో ॥పాపులార॥

1. చిటచిట ని[3] నదోత్కట నారకశిఖి[4] - శిఖిలంగముగప్పున్ - పటపట రవముల[5] పండ్లు కొరుకు సం - కట వేదన లొదవున్[6] - కటకట యనియెడి పటుశోక[7] ధ్వని - కలకాలము గలుగు - నెటు జూచిన విటతటంబుగా[8] నం - తటన్ పిశాచుని దళంబు[9] లాచునున్ ॥పాపులార॥

2. బొరిబొరి[10]దుష్కృతములు సాక్షిగ ముం - దర వరుసను నిలుచుం - దెరతెరలై నిప్పుల పురువులు వడి - తెగదిను నంగములన్ - జురజుర గాల్చుచు జుట్టుజుట్టివి - స్ఫులింగములు[11] గురియున్ = బరిపరివిధ దుర్బాధల మూల్గగ - గరుణ జూప నెవ్వరు లేరయ్యో ॥పాపులార॥

3. భగభగమనియెడి మంటలు తనువుల[12] - బై బరుగులు పెట్టున్ - నిగనిగలాడెడు నిప్పుల గంధక - పొగ లెగయుచు[13] ధగ ధగమను యూదనగ్ని రవులుచు -దరికొని[14] జుట్టుకొను - నగాధతమ[15] నరకాగ్ని కుండమున - యుగయుగాలు బడి యుండెదరయ్యో ॥పాపులార॥

---

(55). 1.గుహలో 2.సూర్యుని 3.వ్యాపింపగా 4.రెండుకన్నులు 5.మంచు 6.సంతోషము 7.చిరుతలుపారు

(56). 1.మిడిసిపడుటలు. 2.ఈ విషయమందు 3.మిక్కిలిధ్వని 4.నరకాగ్నిజ్వాలలు 5.ధ్వనులు 6.కలుగును 7.విస్తారమైన 8.గందరగోళముగా 9.సమూహములు సేనలు 10.మాటిమాటికి 11.నిప్పులకణములు 12.శరీరములమీద 13.లేచును 14.అంటుకొని 15.మిక్కిలి అగాథము.

## 57.

## ఆవిక శిశువైన క్రీస్తు యొక్క అపరిమిత మహిమ.

రా - ముఖారి తా - త్రిపుట.

అదిగో నాడు ధరకు వచ్చిన - యతడే యితడో యన్నలారా = యిదిగో నేడు దివి[1]నుండి యా - యేసువే వేంచేసె జూడుం ॥అదిగో॥

1. తొల్లి[2] దరిద్రుండై పసుల - దొడ్డిలో బుట్టినాడంచు = నుల్లసంబు[3] లాడితిరే - సర్వోన్నతుడై వచ్చె నేడు ॥అదిగో॥

2. మరియ కొడుకు వీడె కాడా - మన బోటి వాడను కొంటిరి = పరమేశ్వరు నాత్మజుడీతడు మీ - రెరుగ దొరగా వచ్చెగా ॥అదిగో॥

3. యేసు నజరేతుడని - హీనమగు పేర్పొందె మున్ను = వాసిగ రారాజై నేడు - వచ్చి గద్దెపై నున్నాడు॥అదిగో॥

4. నాడు గార్దభముపై[4] నెక్కి - నాడనుచు తక్కువ జూచితిరి = నేడు మేఘారూఢుండై వ - ర్ణింప దగిన వాడై వచ్చె ॥అదిగో॥

5. చేపలను బట్టు జాలరులు - శిష్యులింతేగా నంటిరి = యేపు మీర కోట్ల దూత - బైలు దేరి వచ్చె నేడు ॥అదిగో॥

6. పాపాత్ములు సుంకరిలౌవారి - పంక్తిలో దిన్నాడంటిరి = ఆ పరేశు కుడి పార్శ్వమునం - దమలుడై యున్నాడు ॥అదిగో॥

7. దయ్యములచే దొల్లి యదృ్భ - తములు జేసినా డంటిరి = యియ్యెడను[3] శాశ్వత కాయంబు - లిచ్చి మిమ్ము లేపినాడు ॥అదిగో॥

8. దీనుడై మృదూక్తులను - దివ్య బోధ జేసె మున్ను = సానబట్టు కత్తివలెను - సబలుడై[5] మాట్లాడు నేడు ॥అదిగో॥

9. జీవాధారమైన బోధ - చెవిని బెట్టకుంటి రపుడు = చావరాని చావు గలిగె - శాపమును వినియెదురు నేడు ॥అదిగో॥

10. తల దాచుటకు స్థలము లేని - దరిద్రుడని వీడితిరి = నిలుకడైన వారికి ముక్తి - నెలవు[6] లియ్య వచ్చె నేడు ॥అదిగో॥

11. వెలితిగాను[7] జూచి తొల్లి - వెళ్ల దరిమినారు మీరు = ఫలములెంచి యియ్య మీకు - ప్రభువుగా వేంచేసె నేడు ॥అదిగో॥

---

1.పరమునుండి 2.మొదట 3.పరిహాసముతోకూడిన సంతోషము 4.గాడిద 5.ఆయుధధారియై 6.నివాసము 7.లోకువగా

12. ముళ్లనల్లు కిరీటము - మూర్ధ్న[8] మందుంచితిరి తొల్లి = నెల్ల లోకస్థుల కేలికగా - నిప్పు డభిషిక్తుండై వచ్చె ॥అదిగో॥

13. దీనతను ప్రధానార్చకుని - దేవిడిలో[9] నిలిచె దొల్లి = భానుతేజుడై[10] న్యాయాధి - పతియై వచ్చినాడు ॥అదిగో॥

14. పొంతిపిలాతునకు నప్ప - గించు కోబడినాడు తొల్లి = మంచి చెడ్డ వారి నిపుడు - మన్నింప దండింప వచ్చె ॥అదిగో॥

15. సిలువపై నెక్కించి మున్ను - చిన్నతనముగా జూచితిరి = కళలుప్పొంగుచుండ ముక్తి - గద్దె నెక్కినాడు నేడు ॥అదిగో॥

16. శిరములూచి యపహాస్యములు - చేసినారు మీరు తొల్లి = స్థిరముగా తలలెత్తి నిలిచి - తేరి చూడ జాలరిపుడు ॥అదిగో॥

17. దొంగ వాడై నట్లిద్దరు - దొంగల మధ్యను వేసితిరి = దొంగయొ స్వతంత్రుడో మీ - దొరయొ యిది జూచెదరు నేడు ॥అదిగో॥

18. మృతి బొందు వారిలో నొకని - గతిగ నెంచితిరి తొల్లి = ప్రతి ఫలమిచ్చు మీ ప్రభువై - ప్రత్యక్ష మైనాడు నేడు ॥అదిగో॥

## 58.

### మంచి క్రైస్తవుల గుణములు.

రా - ఆనందభైరవి (చాయ: వారు భాగ్యవంతులు) తా - అట.

వారె మంచి క్రైస్తవులు గదా - యీ లోకమందు - వారె మంచి క్రైస్తవులు గదా = పారమార్థమైన క్రీస్తు - సారవాక్య మనుభవించు - వారి దారి గోరి జేరి - భూరి సుఖము బడయునట్టి ॥వారె॥

1. కపట వేష భాష లెల్లను - తొలంగ ద్రోచి - విపుల భక్తి నిపుణు లగుచును = లపితములు నసత్యములును - శపథములును లేక దేవ - కృప మనంబులోన వెలిగి - యుపరిభాగ మరయునట్టి ॥వారె॥

2. నమ్మకంబు సుస్థిరంబుగా - మనంబులో - సమ్మతంబు గలిగి మెండుగా = క్రమ్ము కొనెడి శ్రమలయందు - సొమ్మసిలక ప్రభుని పా - దమ్ములందు బుద్ధి నిలిపి - నెమ్మది గలవార లెవరొ ॥వారె॥

---

8.తలమీద 9.కోటవాకిలి/ రాజనగరు 10.సూర్యతేజస్సుతో

## 59.

### నరకము భయంకరమైనది.

రా - కలణ్యి (చాయ: పోపోవే యో లోకమా) తా - అట.

రారో చేతనులార[1]- నరకాగ్ని నూరకె బడనేలా = సారవిరహిత ఘోరతర సం - సార మగ్నులుగాక[2] మాయాదూరులై[3] క్రీస్తుని భజించిన - వారి నాతడు కరుణ గాచును ॥రారో॥

1. అందరా క్రీస్తుని నివేదనము[4] - జేయుచు సతతము[5] - జెందరె కిల్బిష[6] పలాయనము[7] = నెందుకూరకె నరకమున బడి - జెందెదరు బహు దు:ఖ తాపము - లందునను నుద్ధరణ మెప్పుడు - బొందనేరరు కడనశింతురు ॥రారో॥

2. ఈశ్వరోగ్ర[8] ప్రచండ[9] దండనను[10] - సహించుటకు నీ - విశ్వమున నెవరికి వశంబగును = శాశ్వతపు యాతన లనంతముగా స్వీకార మొనర్చు తరి నట - మీ స్వీయుడెవడెవని శరణములు స్వీకారము జేయ నేర్తురు ॥రారో॥

3. మాయాదు లహంకారులు - వ్యభిచారు లన్యాయులు పాపాత్ములు = హేయ మిథ్యావాద దుష్ట క్రి - యా యుతులు విఘాతకులు మొద - లీ యవిశ్వాసకుల నందరి - ద్రోయు తుద నరక వ్రజమునకు[11] ॥రారో॥

4. చండ గంధకాబ్ధ్యగ్నిలో - గాలి మండుచు - నుండి హాహాకారముతో = దండి ధూమం బెగయు బొగలుచు - నుండి దంత విఘట్ట వాద్య - ఖండక్లేశా కాంతులగుచు ప్ర - చండ దు:ఖము లనుభవింతురు ॥రారో॥

5. ఈ దు:ఖవళులాత్మకు - బొందక యుండ నిచ్చయించిన నందుకు = మోదమున[12] నా క్రీస్తునామము - నాదరత గొనియను తపించి య - నాది యగు నీశ్వరుని సత్యా - పాదమతిని భజింపుచుండరె ॥రారో॥

6. పాపౌఘ[13] పరిహర్త[14]- క్రీస్తుడు మనుజ పరమ సం- త్రాణకర్త[15]= పాపులను రక్షించ బిలుచుచు - నొపి పాపుల తరణమునకై - దాబరాసుత నొందెనా కరు - ణా పయోనిధి నాశ్రయించరె ॥రారో॥

## 60.

### తక్షణముగా క్రీస్తుని శరణుగోరుట యుక్తమని.

రా - భైరవి. (హృదయమనెడి తలుపునొద్ద) తా - ఆది.

ఓహోహో మా యన్నలారా - యుద్యోగింపండి = యిపుడే - త్రాహి త్రాహి యనుచు గ్రీస్తుని దయను గోరండి ॥ఓహోహో॥

---

(59). 1.ప్రాణముగలవారలారా 2.మునిగిపోయెవారుకాక 3.మాయకుదూరముగా 4.సమర్పణము 5.ఎల్లప్పుడు 6.పాపము,రోగము,చెడ్డవిషయము,తప్పు 7.పారిపోవును 8.దేవునిఉగ్రత 9.భయంకరమైన 10.శిక్ష 11.పసువులమందగాకూర్చుట 12.సంతోషమున 13.పాపములు 14.పరిహరించువాడు 15.రక్షణకర్త

1. అంత్యదినమునాటి బాధ - ఆలకించండి = నరక - ప్రాంతమునకు బోక మునుపే - ప్రభువును వేడండి ॥ఓహోహో॥

2. మింట ప్రభువు తేజోమయమౌ - మేఘారూఢుండై - యగ్ని - మంటలీను సింహాసనము - నంటి గూర్చుండు ॥ఓహోహో॥

3. అంధకారమగును సూర్యు - డా దినమునందు =కుముద - భాంధవుండు - మిగుల రక్తవర్ణము నొందు ॥ఓహోహో॥

4. కడు భీతిగ సర్వసృష్టి - కంపించుచు నుండున్ = భూమి - కదలి అభ్రము తాపమున - కరిగి పోవుచుండున్ ॥ఓహోహో॥

5. నరక ప్రచండగ్నిగుండ - మరుగైగన్పడును = దాని - జొరక మరియే తెరవు పాపా - త్ములకు గలుగును ॥ఓహోహో॥

6. ప్రేమతో నడిగెదను ఓ నా - ప్రియబంధవులారా = మీర - లా మహా దినమందున దిరమై - యట నిలువం గలర ॥ఓహోహో॥

7. కామక్రోధ లోభమోహ - గర్వ గుణములను = మీరు- ప్రేమించి చేసితిరి గదరె - పెక్కు విధములను ॥ఓహోహో॥

8. కల్లలాడుచుండి ప్రొద్దు - గడుపుచుంటిరే = యింక- చిల్లర వేల్పుల పూజ - సేయకుండరే ॥ఓహోహో॥

9. ప్రకటంబుగనైనా మరి గు - ప్త స్థలమందైన = సేయు - సకల క్రియల ప్రభువు కెరుక సంపూర్ణముగాను ॥ఓహోహో॥

10. జాతి గోత్ర మడుగబోడు - సర్వేశ్వరుండు = క్రియల రీతి మనసు మాత్రమే విచా - రించు ప్రభువతడు ॥ఓహోహో॥

11. క్షత్రియ బ్రాహ్మణ శూద్ర - చండాలులైన = నరక - పాత్రులై తమతమ దోషముల - ఫలముల బొందుదురు ॥ఓహోహో॥

12. దేవుని కోపాగ్ని యెదుట - తృణ తుల్యులైన = పాపి - జీవులెల్ల నే యుత్తరవు - జెప్పగలరన్న ॥ఓహోహో॥

13. ఘోరమగు నీశాస్తినుంచి - కుశలము లేదన్న = మీరు - పారిపొండి పారిపొండి - బ్రతుకెక్కడనున్న ॥ఓహోహో॥

14. యెటుబో గలరిక దిక్కు మీ - కెవ్వరున్నారు = దైవ - పటుశాపాగ్ని తప్పించే యా - పాటి వారెవరు ॥ఓహోహో॥

15. గురువా లేక పౌరోహితుడా - మరి యే మునివరుడా = లేక - పెరవేల్పా మిమ్ముద్ధరింప ధరనెవ్వడు గలడు ॥ఓహోహో॥

16. వీరంత బహు దోషులు మిమ్మే - విధమున గాచెదరు = గుడ్డి - వారు గుడ్డివారికెట్లు - దారి జూపెదరు ॥ఓహోహో॥

17. యెవరు పుట్టిరెవరు మోసి - రీ భారమును = క్రీస్తు -డవతరించి వహించు కున్నాడనాథ బంధుండు ॥ఓహోహో।

## 61.

### క్రైస్తవు పశ్చాత్తాపము.

రా - అఠాణ తా - ఆది.

రావయ్యా యేసునాధా - మా - రక్షణ మార్గము నీ = సేవ జేయ మమ్ము జేపట్టుటకు ॥రావయ్యా॥

1. హద్దులేక మేము - ఇల - మొద్దులమై యుంటిమి - మా - కొద్ది బుద్ధులన్ని - దిద్ది రక్షింప ॥రావయ్యా॥

2. నిండు వేడకతోను - మమ్ము - బెండువడక చేసి - మా = గండంబు లన్నియు - ఖండించుటకు ॥రావయ్యా॥

3. మేర లేని పాపము - మాకు - భారమైన - మోపు - నీవు = దూరంబుగా జేసి - దారి జూపుటకు ॥రావయ్యా॥

4. పాపుల మయ్య మేము - పరమ - తండ్రిని గానకను - మా = పాపంబు లన్నియు - పార దోలుటకు ॥రావయ్యా॥

5. అందమైన నీదు - పరమానంద పురమందు - మే = మందరము జేరి యానందించుటకు ॥రావయ్యా॥

## 62.

### పాపులను పిలుచుట.

రా - యరుకులకాంభోజి తా - త్రిపుట.

పాపి రా - రమ్ము లెమ్ము - ప్రభునొద్దకిపుడే రమ్ము = నీ పాలి తండ్రి యేసు - నేడు నిన్ను రమ్మనుచున్నాడు ॥పాపి॥

1. ఇపుడే యేసుని యొద్దకు - నిపుడే యేసుని సన్నిధికి - నిపుడే క్రీస్తుని దగ్గరకు = నెపము లేమి చెప్పక వేవేగమే ॥పాపి॥

2. నిన్ను రక్షించు ప్రభువు - నిన్ను రక్షించు గురుడు - నిన్ను రక్షించు కర్తంచు = యున్నపాటుననే వడిగా లేచి ॥పాపి॥

3. నమ్ము నీ మానసమున - నమ్ము నీ బుద్ధియందు - నమ్ము నీ యాత్మలోన = నిమ్మళంబు నీకిపుడే దొరుకును ॥పాపి॥

4. హలెలూయ యెప్పుడామెన్ - హలెలూయ యెప్పుడామెన్ - హలెలూయ యామే ననుచున్ = దలపు నిలిపి సలిపెడు పాటలతో ॥పాపి॥

## 63.

## పాపము సార్వత్రికము.

రా - కేదారగౌళ (దేవుడిచ్చిన దివ్యశాస్త్రమిదేను) తా - త్రిపుట.

నిజముగా పరిశుద్ధు డొక డీ - నేలపై లేదు = వృజినములచే[1] జెడిన మదిని బ - విత్రమూలం బెటుల బొడమును[2] ॥నిజము॥

1. దురిత[3] లతలకు మూలకందము[4] - దుస్స్వభావము దాని గూడిన - నరులలో బరిశుద్ధ విధు లె - న్నటికి గనరావు = నెరవుగా[5] సద్ధర్మములనే - తెఱగునను[6] గావింప[7] నేర్తురు - ధరణి లోపల ముసిడి చెట్టున - చెరకు రస ముండునె తలంపగ ॥నిజము॥

2. మనసు క్రియ లన్నిటికి మూలం - బనుచు శాస్త్రము పల్కు మరి యా - మనసు శుచిగాకున్న నగునే - తనకు క్రియాశుద్ధి = అనిశ[8] మా హృదయము దురిచ్ఛల - నలరి[9] మిధ్యాసక్తి[10] నుండగ -ఘనతగల సత్కార్యముల నిల - మనుజు డెట్లొనరింప[11] జాలును ॥నిజము॥

3. నిరతమును పాపాగ్ని చేతను - గరగుచున్న మనంబులోపల - పరమ ధర్మము భక్తి ఎటువలె - బాదుకొని యుండున్ = నిరపరాధి యొకండు లేదని - నిక్కముగ గనవచ్చుచున్నది - పరమ దేవుడు క్రీస్తుకృతమున - పాపులను రక్షింపవలయును ॥నిజము॥

## 64.

## క్రైస్తవ యుద్ధ ప్రేరణము.

రా - శహన తా - ఆది.

లేలెమ్ము క్రైస్తవుడా - నీలో మేల్కొని - లేలెమ్ము క్రైస్తవుడా - నీలో మేల్కొని ॥లేలెమ్ము॥

1. విడువకు యుద్ధము - నుడువక బద్ధము = యొడయుడు నీకడ - నుండును బాయడు ॥లేలెమ్ము॥

2. విడువకు ధైర్యము - వదలకు కవచము = సదయుడు క్రీస్తుడు - సత్ఫల మిచ్చును ॥లేలెమ్ము॥

3. బెదరకు వేరికి - వదలకు దారిని = నది యిది కానిది - యాత్మను బెట్టక ॥లేలెమ్ము॥

4. ప్రార్ధన సారము - వర్ధిల గోరుము = సార్థక కాలము - వ్యర్థము చేయక ॥లేలెమ్ము॥

5. భావములోనన్ - దేవుని ప్రేమన్ = నీవది వేడుచు - నెమ్మది గూడుచు ॥లేలెమ్ము॥

6. యేసుని సిలువ - నెదుట బెట్టుకో = మోసము నొందవు - యేసుని కాపున ॥లే॥

---

1.పాపములచేత 2.పుట్టును 3.పాపమను తీగలకు 4.వేరుగడ్డ 5.చక్కగా 6.విధముగా 7.చేయలేరు 8.ఎల్లప్పుడు 9.సంతోషించు 10.మాయ 11.చేయగలుగును

## 65.

### క్రీస్తు పునరుత్థానము.

రా – సారంగ. (చాయ: నీకన్న యిక వేరే వేల్పులు) తా – త్రిపుట.

సుదతులార మీ – రిచ్చోట నెవ్వరి – వెదకుచునున్నారు = మృదువుగాను జీ – వించు వాని పెద్ద – నిదురబోయినట్టు – లెదలందు భావించి ॥సుదతులార॥

1. ఇచట లేడు లేచి – యున్నాడు ప్రభుక్రీస్తు – యేసు స్వతంత్రుడై = ప్రచురంబుగ తన – పాట్లు లేచుటయున్న – వచియించె గలిలైయ్య – వరదేశమున మీతో ॥సుదతులార॥

2. మనుజ కుమారు డె – క్కుడు పాపిష్ఠులచేత – మరణమొందుట సిల్వపై = తనకు తానె మూడవ – దినమందు లేచునంచును – దెల్పె గద మీరు – వినుచుండగ దొల్లి ॥సుదతులార॥

3. ఎదలలోన జ్ఞాపకము చేసుకొనుడింక – యేసు తెల్పిన మాటలు = ముదముతోడ జీవ – మున గని లేచె నను వార్త – సుదతులాలాకించి – రది నిక్కముగ దోచ ॥సుదతులార॥

## 66.

### ప్రభుని బాప్తిస్మము.

రా – ముఖారి (చాయ: ఎన్నడు గాంచెదమో) తా – ఆది.

వినరే నరులార – మనముల వేడుకలను మీర = మన, రక్షకుడగు – మరియా తనయుని – మహిమలు చెవులార ॥వినరే॥

1. తన కన్నను ముందు – యోహా – నను నత డింపొందు = ఘనతర మగును – ప్రవచనము బ – ల్కెను భూజన లందు ॥వినరే॥

2. అతడు యోర్దాను – నదిలో – ఖ్యాతిగ ననుదినమున్ = పాతకులకు బా – ప్తిస్మ మిచ్చు నెడ – ప్రభు వచ్చుటి కరిగెన్ ॥వినరే॥

3. న్యాయము నిలుపుటకై – ప్రభువు వి – ధేయత గనుపరచి = శ్రేయపతి బొం – దెను యోహానుని – చేత బాప్తిస్మము ॥వినరే॥

4. పరమండల మపుడు – తెరవం – బడి పావురము గతిన్ = పరిశుద్ధాత్మ శు – భ ప్రభ లీనుచు – ప్రభువు మీద వ్రాలెన్ ॥వినరే॥

5. ఆకాశము నుండి – కలిగెను – ప్రాకటమగు రవము = నా కితడు ప్రియం – బౌ కుమారు డా – నంద మొందు రనుచు ॥వినరే॥

6. అంతట మన కర్త – పరిశుద్ధాత్మ బలము కలిమిన్ = సంతసమున మో – క్ష కుశల వార్తను – జాటంగను దొడగెన్ ॥వినరే॥

7. ఆ నిత్య సువార్త - మన మెద - లో నిడి నమ్మినచో = నానంద మయం బమృత మేసు ద - యా నిధి మన కొసగున్ ॥వినరే॥

## 67.

### క్రీస్తుయొక్క అనుజ్ఞ.

రా - ముఖారి  తా - ఆది.

ఇదిగో నా శిష్యులారా - యెరుక లుంచుడి = మోక్ష - సదనమున[1] కేను బోదు - సంతోషించుడి ॥ఇదిగో॥

1. యెరూషలేమందుడి మీ - రెదురు చూడుడి = మీపై - పరిశుద్ధాత్మయు దిగి వచ్చి - పనులు దెల్పును ॥ఇదిగో॥
2. దిక్కులేనట్లు మిమ్ము - దిగనాడిపోను = మీతో - మక్కువై[2] యుండ బరిశు - ద్ధాత్మను బంపెదను ॥ఇదిగో॥
3. నిర్యాణమున[3] మీ కొరకై నెలవులు[4] గల్పింతు = నాతో - సర్వకాలము నిత్య - సామ్రాజ్యము నేల ॥ఇదిగో॥
4. ఒకరితో నొకరు ప్రియము[5] - లొప్పి యుండుడి = నాదు సకలాజ్ఞలందు నిదియె - సార మనుకొనుడి ॥ఇదిగో॥
5. ఏదైన నా పేరిట మీ - రించుక వేడినను = మీకు - మోదముతోడ[6] దాని - ముందే చేయుదును ॥ఇదిగో॥
6. విశ్వాసముంచండి సర్వేశ్వరుని యందు = మీకు - శాశ్వతమైన మోక్షస్థలి[7] సౌఖ్యము లబ్బు ॥ఇదిగో॥
7. ఉల్లములందు[8] కలత - లెల్ల విడువుడి = నేను - మళ్ళి వచ్చెడు విధము మరువ కుండుండి ॥ఇదిగో॥

## 68.

రా - శంకరాభరణము  తా - అట.

కరుణానిధియై - క్రీస్తుడువచ్చె - ధరణికి నరుడై = నరజాతి దురవస్థ - దరిశించి తత్పాప - పరిహారము కొరకై య - ర్పణ సేయ దేహము ॥కరుణా॥

1. నరులందు నరుడై - దేవునియందు - పరమేశ్వరుడై - ఇమ్మానుయేల్ వరనామ ధరుడై - పాపులబ్రోవ - కరుణా తత్పరుడై = నిరయ వహ్నికి బోవు - నరులార నను నమ్మ - త్వరగా రండని బిల్చె - దరిజేర్చి రక్షింప ॥కరుణా॥

---

1.నివాసస్థలము 2.స్నేహము 3.మోక్షమందు 4.నివాసస్థలములు 5.ప్రేమతో 6.సంతోషముతో 7.పరలోకమందున 8.మనస్సున

## 69.

### పరిశుద్ధాత్మ కుమ్మరింపు.

రా - ఆనందభైరవి (రారే గొల్లవారలారా) తా - ఆది.

వినరే యపొస్తలుల కార్యముల్ - క్రైస్తవు - వారి కవి యెంతో ధైర్యముల్ = మనసు లొక్కటి జేసి - కొని యట్లు ప్రార్థింప - ఘనముగా విమలాత్మ - చనుదెంచె[1] వారిపై ॥వినురే॥

1. పరమండలమునుండి వచ్చెను - కరువలి[2]వలె శబ్ధ మిచ్చెను = తిరముగ వార లం - దరు గూడి యున్న మం - దిర మెల్ల నిండె బం - ధురమై[3] తన్నాదము[4] ॥వినరే॥

2. అనలార్చులను[5] దీప్తి[6]మించుచు - బీట - లగు[7] - జిహ్వాల్వలె గనుపించుచు = ఘనముగ నొక్కొక్క - జనునిపై - నవి నిల్వ - గను బరిశుద్ధాత్మచే - తను నింపబడి రంత ॥వినరే॥

3. వారన్య భాషలతోడను - నాత్మ - ప్రేరణమును జేయు జాడను[8] = ధారాళముగ[9] భాషాం - తరము లాడిరి విన్న - వారి కబ్బురమై[10]వి - చారము ల్పొడమంగ[11]॥వినరే॥

4. ముందట వారిటుల గుంపుగ - మోద - మందుచు దేవుని గొల్చి తా = మందరు చూడగ - వింత వింత పనుల - నందందు జేసిరి - దేవుని దయచేత ॥వినరే॥

5. మనము నా రీతిగ గుంపుగా గూడి - మన దేవు గొల్వగ భూమిలో = మనుజుల కాశ్చర్య - మగు కార్యముల జేయ - నొనగూడు[12] మనసు కా - నందమును గల్గు ॥వినరే॥

## 70.

### సుబోధ.

రా - మోహన తా - ఆది.

వద్దు మనస - బుద్ధి కురుచ = పెద్దలకు బెద్ద పరి - శుద్ధ దగు క్రీస్తు తా - దిద్దు నిను బ్రేమ సరి - హద్దులను మీరబో ॥వద్దు॥

1. చెడ్డ తలపు - లడ్డి నిలుపు = మెడ్డెలకు నెడ్డెయగు - గడ్డు సాతానునకు - మెడ్డుకొని దొడ్డ ప్రభు - బిడ్డవలె నడువు మిక ॥వద్దు॥

---

1.దిగివచ్చె 2.గాలి 3.దట్టము 4.ఆధ్వని 5.అగ్నిజ్వాలలను 6.శాంతిచేత 7.చీలిన 8.విధముగా 9.అడ్డు లేక

2. నింద పాలు - బొంద మేలు = పొందుగను అందముగ - ముందు నీ యందు వెలుగొందు ప్రభు సుందర ని - బంధనలు మరచి పో ॥వద్దు॥

3. ఆశ బెట్టు - యేసు తట్టు = దోసములు వాసి చన - జేసి నిను మోసికొను - యేసు నిజ దాసులను - బాసి యుండకు మిక ॥వద్దు॥

4. బెండు పడకు - నిండు విడకు = దండి గల తండ్రి యొడ - యుండు యేసుండు నీ - యండ నుండగ నీ - గుండె దిగు లేల యిక ॥వద్దు॥

5. పట్టు విడకు - దిటము సెడకు = నెట్టుకొని ముట్టగ - జుట్టుకొను కష్టముల బిట్టు విడగొట్టు ప్రభు - తట్టు కనిపెట్టు మిక ॥వద్దు॥

6. మంచి గుణము - లెంచికొనుము = వంచనల మించి గ - ర్వించి నీ దుర్భావము - ద్రుంచు ప్రభు నొద్ద గురి - యుంచి ప్రార్థించు మిక ॥వద్దు॥

**71.**

## ఆత్మ వంచన.

రా - ధన్యాసి తా - ఆది.

ఎఱిగి యెఱిగి చెడిపోతివి మనసా - యిక నీ దిక్కెవ్వరు చెపుమా = దురితం బిది స - చ్చరితం బిది యని - యెరుక సరకు గొన - కేమియు నీ ॥ఎరిగి॥

1. ఇది దేవుని దయ యిది క్రీస్తుని ప్రియ - మిది విమలాత్ముని గుణ మనుచు = ఎదలో ననుభవ - మెరిగి మరల దు - ర్మదమున దుష్కృత - పదమున బడితివి ॥యెరిగి॥

2. సకలము జూచెడు దేవుని కంటికి - జాటుగ జరిగెడి పని యేది = ఇక జెవి గుసగుస - లెల్లను దిక్కుల - బ్రకటము జేసెదు - ప్రభు వున్నాడని ॥యెరిగి॥

3. ఎన్ని మార్లు సిలువను వేయుచు ప్రభు - యేసుని వెతబడ జేసెదవు = తిన్నని మార్గము - తెలిసియుండి నీ - కన్నుల గంతలు - గట్టితి వయ్యో ॥యెరిగి॥

4. గద్దించెడు మనస్సాక్షికి గడ - గడ లాడక పోతివి నీవు = హద్దు మీరి దై - వాజ్ఞలు ద్రోయుచు - నెద్దు లాగు పరు - గెత్తితి వయ్యో ॥యెరిగి॥

5. పలువిధ శోధన బాధలలో ఘన - ప్రభు క్రీస్తుడె నీ దిక్కనుకో తాళుచు బశ్చాత్తాపము పడి యిక - జాలించుము కలు - షపు యత్నంబు ॥యెరిగి॥

6. అపరిమిత దయా శాంతులు గల ప్రభు - వనిశము కోపింపడు నీపై = కృపా వాగ్దత్తము - లెపుడు దలచి నీ - యపవిత్రత గని - హా యని యేడ్వుము

## 72.

# పశ్చాత్తాప ప్రార్థన.

రా - యదుకులకాంభోజి తా - ఆది.

త్రాహి[1] మాం[2] క్రీస్తు నాథ - దయ జూడ రావే = నేను - దేహి[3] యనుచు నీ పాదములే - దిక్కుగా జేరితి నిపుడు ॥త్రాహి॥

1. గవ్వ చేయరాని చెడ్డ - కర్మేంద్రియాధీనుడనై - రవ్వ[4] పాలై నే నెంతో -నెవ్వ[5] బొందితి - త్రవ్వుచున్న కొలది - పెరుగు - దరగదు నా పాప రాశి - యివ్విధమున జెడిపోతినినే - నేమి సేతు నోహోహోహో ॥త్రాహి॥

2. నీ యందు భయభక్తులు లేని - నిర్లజ్జాచిత్తము[6] బూని - చేయరాని దుష్కర్మములు - చేసినాడను = దయ్యాలరాజు చేతిలో - చేయి వేసి వాని పనుల - జేయ సాగి నే నిబ్బంగి[7] - జెడిపోయితి నే నయ్యయ్యయ్యో ॥త్రాహి॥

3. నిబ్బర మొక్కించుకైన - నిజము రవ్వంతైన లేక - దబ్బర లాడుటకు ము - త్తాత నైతిని = అబ్బురమైన ఘోర పా - పాంధకార కూపమందు - దబ్బున బడిపోతి నయ్యో - దారి చెడి నేనబ్బబ్బబ్బా ॥త్రాహి॥

4. నిన్ను జేరి సాటిలేని - నిత్యానంద మందబోవు - చున్నప్పుడు నిందలు నా - కెన్ని చేరినా = విన్నదనము లేకుండ నీ - వే నా మదికి ధైర్యమిచ్చి - యన్నిట రక్షించి తివి నా - యన్న స్తోత్ర మహహా ॥త్రాహి॥

## 73.

# దేవుని మాట చెవిని బెట్టకపోవుట.

చెప్పినట్లు చేయలేవు - చెడ్డజీవుడా నీవు - మప్పినట్లు మరుగ లేవు - మాయజీవుడా ॥చెప్పి॥

1. పెదవుల పోరాట పెక్కు - చదువెలెన్నైన మోటు - హృదయము మృదులము గాని - చదువు లేటికి ॥చెడ్డ॥

2. నిన్ను నీవు తెలిసికొనని - నేర్పు లేటికి - గ్రుడ్డి - కన్ను మంచికంట నలుసు - లున్న తీయునా ॥చెడ్డ॥

3. కాదు కాదనంగవచ్చు - కాని పనులకు - వాటి మీద మనసు బారినపుడు - లేదు నిలుకడ ॥చెప్పి॥

4. అగ్గిపురుగు వంటి దొకటి - యాత్మలో నుండి - తెలివి = మ్రగ్గజేయు చుండు దాని - మంటలార్పక ॥చెడ్డ॥

5. తవిలియున్న మనసాక్షి - తప్పుమోపగా - నింక = నెవరు కానరా నట్టిదో - రెదుట నుండగ ॥చెప్పి॥

6. నీలో నిన్ను మెచ్చుకొనుచు - నిమ్మళింతువా - నిద్రమేల్కొని నీ దుర్భావము నీ - మెప్పు సరిపుచ్చు ॥చెడ్డ॥

7. మనసులోని మరుగు నీకే - మరుగై యుండగ - నితర - జనులను గుణపరచు తెరగు చర్చించెద వెటుల ॥చెడ్డ॥

8. మొదట పరిశుద్ధాత్మను నీవు - మొగమెరుగకున్న - నింక - తుది మొదలులేనట్టి ప్రభువు - తోడు లేకున్న ॥చెడ్డ॥

9. సతతం ఆత్మకు యేసు నామా - మృతము గ్రోలించి - శక్తి - యుతమైనట్లు చేసి శత్రు - తతి గెలువకున్న ॥చెడ్డ॥

10. యేసుక్రీస్తు సిలువ కనుల - యెదుట లేకున్న - సకల - మోసముల కారకమగు బాప - మూలము దెగకున్న ॥చెడ్డ॥

## 74.

### విశ్వాసమువలని విశ్రాంతి.

రా - మారువ (చాయ: మంగళంబని పాడరే) తా - అట.

సందియము వీడవే - నా మనసా యా - నందమున గూడవే = సందియము లింకేల నిను సుఖ - మొంద జేసెడు క్రీస్తు రక్తపు - బిందువులు శుభవార్త వాక్యము - లందు గని తెలి వొంది బ్రతుకుచు ॥సందియము॥

1. చింత లిక మానుము - లోకులు దెల్పు - భ్రాంతుల్ బడ బోకుము = ఎంత వింత దురంత పాపము - లంతటను దన రక్తమున గో - రంత లేకయె దుడుచు నని సి - ద్ధాంత మగు ప్రభు వాక్యమును విని ॥సందియము॥

2. పాపములు వీడుము - నీ విక బశ్చా - తాపమున గూడుము = ఏపు మీరిన యోర్పుతో నొక - పాపి కైన లయంబు గోరక - పాపులందరు దిరిగి వచ్చెదు - కోపు గోరెదు కర్త దరి జని ॥సందియము॥

3. నేరముల నెంచుకో - యేసుని కరుణా - సారము దలంచుకో = భారముల్ మోయుచు శ్రమన్ బడు - వార లందరు నమ్మి నా దరి - జేరి విశ్రమ మిత్తు నను ప్రభు - సార వాక్కులు చక్కగా విని ॥సందియము॥

4. నిమ్మళము నొందుము - రక్షకుని పలుకు - నమ్ముకొని యుండుము = ఇమ్మహిని పాపులకునై ప - క్షమ్ము జేసి పరాత్పరుని సము - ఖమ్మునందు చిత్తమ్ముగా - కాయమ్ము బలియిడు నీ ప్రభుని గని ॥సందియము॥

5. ప్రేమా దయా శాంతముల్ - కర్తకు భూషా - స్తోమము లనంతముల్ = నీ మొర ల్విని యేసునాధ - స్వామి తన రక్తమున బాపము దోమిని న్నకళంకు జేయును నీమదిన్ దగ నమ్ముకొని యిక ॥సందియము॥

**75.**

## క్రీస్తు ఎన్నటికి విడనాడు వాడుకాడు.

రా - సావేరి　　　　　　　　　　　　　　　　　　　　　　తా - ఆది.

ఎందుకే చింతించెదవు నా - డెందమా నీ కందమా = యిందాక రక్షించినవా - డికను నిన్ను విడువబోడు ॥ఎందుకే॥

1. తొల్లి నీ వొనరించినట్టి - దోషమెంతో యరసి చూడు - చెల్లచెదరై పరచు తరిని - చెయ్యి చాపి పట్టినాడు - అల్లుకొనిన నీ దుర్గుణము - లణగ ద్రొక్కి వేసినాడు - తల్లడిల్లజేయు నీ శ - త్రువుల దరిమి బ్రోచినాడు = వల్లగా దన్నాడా నేడు - వద్దు సందేహంబులు వీడు ॥ఎందుకే॥

2. తల యెత్తరాని చోట - కళ లిచ్చి నిలిపినాడు - పలుమారు నీ యక్కరలు - తెలిసి యందిచ్చినాడు - బలహీన మపుడు నీకు ని - ర్భయ మియ్య వచ్చెడు వాడు - పలు విధంబు లగు బాధల - పార దోలివేసినాడు - నెల విప్పుడు లేదన్నాడా - నీతో నిక సరి యన్నాడా ॥ఎందుకే॥

3. ఒక్క నీ తల వెంట్రుక యైన - నూడిపడ దని చెప్పెడు వాడు - దిక్కు నీకిక నేనే యని తన దివ్య వాక్కుల దెలిపెడు వాడు - చిక్కులను బెట్టెడు పగవారి - చేత నిను జిక్కింపని వాడు - ఇక్కట్టు మెట్టుల దాటించుట - కిదగో యని చెయి యిచ్చెడు వాడు = హక్కు లేదన్నాడ నేడు - అతడు నిను వెలి వేయబోడు ॥ఎందుకే॥

4. యేసు తన రక్తముతో నిన్ను - నెంచి ముందే కొనుకొన్నాడు - దోసములు వెడలించు విమలాత్ముండు నీ సాక్షిగ నున్నాడు - ఆశతో నీవు గొలిచెడు తండ్రి యంతటా గాపై యున్నాడు - నీ సురక్షణ జేయు వారు - నిను జుట్టి యున్నా రెల్లపుడు = శేషరహితానంద మల్లదే చేరువగుచున్నది చూడుము **॥ఎందుకే॥**

---

శోధనలోపడి, పాపముచేసిన తరువాత పశ్చాతాపముతో, మహానది తీరానవున్న ఒక సొరంగములో కూర్చొని వ్రాసిన కీర్తన "త్రాహిమాం క్రీస్తునాధ". ఆదే శోధనలో వ్రాసిన మరొక కీర్తన "చెపినట్లు చేయలేవు చెడ్డ" మరియు "వద్దుమనస బుద్ధికురుచ" అనే కీర్తనలు. తాను చేసిన పాపమునకు పశ్చాతాపముతో కుమిలి పోవుచుండగా తనకు బాప్తిస్మము యిచ్చిన రెవ. చార్లెస్ లేసి దొరగారు "పురుషోత్తము సోదరా! నీ పాపములు ఎక్కువైనవా? క్రీస్తు రక్తపుచుక్క విలువ ఎక్కువైనవా? అని యడిగినంతట ఆయనలోని సందేహమంతయు పోయినది. అప్పుడు ఆయన వ్రాసికొన కీర్తనలే "సందియము వీడవే" మరియు "ఎందుకే చింతించెదవు". ఈ కీర్తనలు 1845సం॥ములో వ్రాసినవి.

**76.**

## యేసే రక్షణ.

రా - సెహన తా - జుల్వా.

పాపవినాశము గల్గునే - యేసు నీ పరమ కృప లేకనే = శాపాత్ములై దైవ - కోపాగ్నికిని బోవు - కాపురుషులు ముక్తి - కేపాట్లు బడినను ॥పాప॥

1. ఆయా నియమాదులు సల్పిన - బుద్ధి - భ్రమను తీర్థములాడబోయిన = శ్రమచేత దేశాంత - రములన్ని దిరిగి జీ - వము లేని ప్రతి మార్చ - నము లెన్ని జేసిన ॥పాప॥

2. క్రతు దాన జపము లొనర్చిన - మంత్ర - స్మృతి శాస్త్రములను పఠించి ఇతర = ధర్మములిక యెన్ని జేసినగాని - మృత కర్మములుగాక - వృజినముల్ దెగవెందు ॥పాప॥ ( క్రతు=యజ్ఞం )

3. పరలోకమును దిగివచ్చుట - పాప - నరుల రక్షింపను చచ్చుట =అరుదైన పనియిట్లు నెరవేర్చితివి దీని - స్థిరముగ నమ్మి నీ - సేవ జేయక యున్న ॥పాప॥

**77.**

## మనోసాక్ష్యానందము.

రా - శహన (చాయ: సకలేంద్రియములార) తా - అట.

ఇతరుల సాక్ష్యము - ఎంతో గలిగియున్న - మతి సాక్ష్యమే - మంచిది = మృతి బొంది లేచి యు - న్నత మోక్ష రాజ్యాధి - పతియై యుండెడు యేసు - ప్రభువే మా విభుడైన ॥ఇతరుల॥

1. గురి సిలువ దెసమాకు - స్థిరమై నిలిచియున్న - దురితము తలయెత్తునే = మరి యేసు ప్రక్కలో - చొరబారి యందున్న - కరుణారసము గ్రోలు - టెరిగి యుండిన చాలు ॥ఇతరుల॥

2. తలవాల్చుటకు తనకు - స్థలములేదని బల్కు - పలుకే మా కైశ్వర్యము = బలమిచ్చి యెదిగించు - ప్రభు వాగ్దత్తములే మా - కిలలో పంచభక్ష్య -ములుగా నుండిన చాలు ॥ఇతరుల॥

3. బెదరించి సైతాను - కదిలింప లేనట్టి - కుదురైన విశ్వాసము = బొదలుచు మాలో నిం - పొదుపు చుండిన చాలు - మదిలో నెమ్మది యిచ్చు - మా యేసు కృపగల్గ ॥ఇతరుల॥

## 78.

# యేసు రక్తము పాప పరిహారము.

రా – ఫరజు (చాయ: యేసును జూచుట యెన్నటికో) తా – ఆది.

పాప పరిహారము గలిగెగదా – మా – పాలిటి రక్షణ దొరికెగదా = పాపము శాపము – తాపము బోవును – ఆ పరమగురుని – యడుగులు బట్టిన ॥పాప॥

1. నెత్తురు జిందక పాపంబు – తల – మొత్తబడదనెను శాస్త్రంబు = బత్తిని హత్తిని చిత్తముతో స – ర్వోత్తమ ప్రాయ – శ్చిత్తము గంటిమి ॥పాప॥

2. ఎంత చోద్య మీ చరితంబు – మా – స్వాంతంబుల కలతి హర్షంబు = కాంతము చింత్య మ – నంతము క్రీస్తుని – శాంతి పుణ్యఫల – మంతయు మాదగు ॥పాప॥

3. కారణ రహిత కృపాదృష్టిన్ – మా – దారుణ దురితము విడగొట్టెన్ = తోరము దారము – సారము ఘన గం – భీరము యేసుని – కారుణ్యంబది ॥పాప॥

4. ఉద్ధారకుడొకడే ఇలకు – తన – పద్దతిలో జనువారలకు = బుద్ధిగ శుద్ధిగ – సిద్ధము జేయును – శుద్ధాత్మను క్రీ – స్తు కటాక్షించును ॥పాప॥

## 79.

రా – సావేరి తా – అట

పరాస్తముడితడే – ప్రభువగు యేసు – పరాస్తముడితడే – సోదరులారా – పరాస్తముడితడే మరియానందనుడని – నరమూర్తి అనుగొని – సరకుసేయని యూద – జనులకందగరాని ॥పరాస్తముడితడే॥

1. కడుబీదవాడు అల మరియా పు – త్రుడగాడె వీడు – మనలోన నొ – క్కడుగానున్నాడు – ఈ జ్ఞానమె – క్కడ బడసినాడు = కడు క్రూరమతులు మూ – ర్ఖపు చిత్తుల్ పరిసయులు – నుడివిరా రీతి బ – ల్కెడు వారికందని ॥పరాస్తము॥

2. నరదైవత్వములు – రెండును దాల్చి పరమాద్భుతములు – పెక్కొనరించి – వరదృష్టాంతముల్ నిండుగనున్న – పరతత్వార్థములు = నెరి శిష్యులకు బోధ – పరచి వచ్చిన పనిని – నెరవేర్చి మరణమై – తిరిగి లేచినయట్టి ॥పరాస్తము॥

3. క్షితిలోన నెవరు – ఈతని రీతి – క్రియ చూపినారు – మరణమునొంది – బ్రతికినవారు – తొల్లియు నేడు – వెతికినలేరు = ఇతడొక్కడే స్వేచ్ఛా – మృతుడై యా మృతినణచి – బ్రతికి లేచి మహిమో – న్నతుడై ప్రకాశించి ॥పరాస్తము॥

**పరాస్తముడితడే అంటే నిరాకరింబడినవాడు అని అర్థము.**

## 80.

## ఉన్న విధముననే నీ యొద్దకు వచ్చుచున్నాను.

రా – ముఖారి తా – త్రిపుట.

ఉన్నపాటున వచ్చు – చున్నాను నీ పాద – సన్నిధికో రక్షకా = యెన్న శక్యముగాని పాపము – లన్ని మోపుగా వీపు పైబడి – యున్న విదె నడ లేక తొట్రిలు – చున్నవాడను నన్ను దయ గను ॥ఉన్నపాటున॥

1. కారుణ్యనిధి యేసు – నా రక్షకా నీ శ – రీర రక్తము చిందుట = భూరి దయతో నన్ను నీదరి – జేర రమ్మని పిలుచుటయు ని – ష్కారణపు నీ ప్రేమ యిది మరి – వేరే హేతువు లేదు నాయెడ ॥ఉన్నపాటున॥

2. మసి బొగ్గువలె నా మా – నస మెల్ల గప్పె దో – ష సమూహములు మచ్చలై = అసిత[1] మగు ప్రతి డాగు తుడువను – గసటు[2] గడిగి పవిత్ర పరపను – నసువు[3] లిడు[4] నీ రక్తమే యని – మసల[5] కిప్పుడు సిలువ నిదె గని ॥ఉన్నపాటున॥

3. వెలుపట బహు యుద్ధ – ములు లోపటను భయము కలిగె నెమ్మది దొలగెను = పలు విధములగు[6] సందియంబుల – వలన బోరాటములచే నే – నలసి యిలునటు గొట్టబడి దు – ర్బలుడనై గాయములతో నిదె ॥ఉన్నపాటున॥

4. కడు[7] బీదవాడ నం – ధుడను[8] దౌర్భాగ్యుడను – జెడిపోయి పడియున్నాను = సుడివడిన[9] నా మదికి స్వస్థత – జెడిన కనులకు దృష్టి భాగ్యము – బడయవలసిన వన్ని నీ చే – బడయుటకు[10] నా యొడయుడా[11] యిదె ॥ఉన్నపాటున॥

5. నీ వాగ్దత్తము నమ్మి – నీపై భారము పెట్టి – జీవ మార్గము గంటిని = కేవలంబగు[12] ప్రేమచేతను – నీవు నన్ను క్షమించి చేకొని – భావశుద్ధి[13] నొనర్చి[14] సంతోషవసరముల నిడుదువని యిదె ॥ఉన్నపాటున॥

6. దరిలేని యానంద – కరమైన నీ ప్రేమ – తరమే[15] వర్ణన[16] చేయను = తెరవు[17] కడ్డం బైన యన్నిటి – విరుగగొట్టెను గాన[18] నే నిపు[19] డరుదుగా నీ వాడ నవుటకు – మరి నిజము నీవాడ నవుటకే ॥ఉన్నపాటున॥

---

1.నల్లని 2.మైల 3.ప్రాణములు 4.ఇచ్చుట 5.అలస్యముచేయక 6.సందేహములు 7.మిక్కిలి 8.గ్రుడ్డివాడను 9.సొమ్మసిల్లిన 10.పొందుట 11.కర్త 12.ముఖ్యమైన 13.మనస్సుశుచిగా 14.చేసి 15.శక్యమా 16.స్తుతి 17.మార్గము 18.కనుక 19.ప్రియముగా

ఈ కీర్తన ఆంగ్లంలో చార్లెట్ ఇలియట్ అను వనిత రచించిన అనే కీర్తనను చౌధరిగారు ఉన్నపాటున వచ్చుచున్నాను" అను దేశీయబాణీని అనుసరించి చక్కగా తెలుగుభాషలోనికి అనువదించారు. అయితే ఈ కీర్తన ఇంగ్లీష్‌లో చదివి దాని భావమును జాన్ హే దొరగారు చెప్పగావిని ఈ కీర్తనను తెలుగులోనికి అనువదించాడు పురుషోత్తము చౌధరిగారు.

## 81.

### యువజనులు క్రీస్తునందు సంతోషించుట.

రా సారంగ (చాయ: పుట్టె నేసుడు నేడు) తా - ఝంపె.

దేవాది దేవాత్మజా - మమ్ము - దీవించు ప్రభురాజా = దేవాదిదైవ మానుష్యా భవ్య - దేదిప్య గుణతేజా ॥దేవాది॥

1. చెదరిన నీ గొఱ్ఱెల - కదుపు - వెదుక వచ్చితివియ్యెల = సదయా హృదయా భ్యుదయా సాధు - జన నిత్య పరిపాలా ॥దేవాది॥

2. దురితాలవాలమునం బుట్టు - నరకీటకముల - మన్నా = కరుణారస మనిశము మాపై - విరజిల్లవే చల్లగా ॥దేవాది॥

3. నరకంబునిధి యొడ్డున - మేము - దిరుగుచు పడబోయిన = తరి నీ వెరిగి త్వరగా మమ్ము - మరలించి నావన్నా ॥దేవాది॥

4. యేసు నీ దాసులము - నీకు - దోసిలి యొగ్గినాము = దోష రోషాభ్యాసములను - దూరము దొలగించుము ॥దేవాది॥

5. ప్రాణేశ నీ సిలువం - జిందు - శోణితంపు విలువ = త్రాణకరము స్థిరము దాని - దర్శించుటే జీవము ॥దేవాది॥

6. బాలుర మజ్జులము - మమ్ము బాలింపవే నిత్యము = నీ లోపలి జాలి మాకు - నిజముగా జూపించుము ॥దేవాది॥

7. ఆనందమగు నీ కృప - మేము - ధ్యానించుటకు నేర్పుమా = జ్ఞానోజ్వలము బలము శిశువుల - మైన మా కవి యిమ్ము ॥దేవాది॥

## 82.

### క్రీస్తువల్ల బోధితులు భాగ్యవంతులు.

రా - యరుకులకాంభోజి. తా - ఆది.

ఎవరు భాగ్యవంతులౌదు - రవనిలోపల[1] - మోక్ష = వివరమైన[2] క్రీస్తు బోధ - చెవులొగ్గి వినువారికన్న ॥ఎవరు॥

1. కవులు[3] లాభ మరసి[4] జేయు - కపట మంత్రముల్ = విధులు - దవుల[5] బోవ దరిమి యేసు - తత్వము[6] గొనువారికన్న ॥ఎవరు॥

2. దీనమానసులకిట్టి యుప[7] - దేశమిచ్చెను - దివ్య = మైన మోక్ష రాజ్యము వారదౌనటంచు ప్రభువు దెల్పె ॥ఎవరు॥

---

1.భూమిపైని 2.స్పష్టమైన 3.కవిత్వముచెప్పువారు 4.విచారించి 5.దూరముగా 6.వాస్తవము 7.బోధ

3. వృజినములకై[8] దు:ఖించెడి - సుజనులెవ్వరో - వారు = నిజముగ నొదార్పు బొంది - నిత్య సంతోషితులని[9] దెల్పె ॥ఎవరు॥

4. శాంతి నీతి కరుణల యందాసక్తి గలవారు - భూ స్వ = తంత్రులై పరితృప్తి[10] నొంది దయబడ సెదరని ప్రభువు దెల్పె ॥ఎవరు॥

5. పరిశుద్ధ హృదయులు పరా - త్పరుని[11] జూతురు - సర్వ = నరుల సమాధానము నరులె పరమ జనకుని సుతులు ॥ఎవరు॥

6. నీతి కొరకాపద నొందెడి నిశ్చలాత్ములు - వారు = ఖ్యాతిగ[12] పరలోక రాజ్య - ఘన సౌఖ్యము లెల్లను బడయుదురు[13] ॥ఎవరు॥

## 83.

### క్రీస్తుని యద్భుతము.

రా - శంకరాభరణము (చాయ: పరమ రాజ్యమునకు) తా - ఆది.

వినరె మనుజులార క్రీస్తు - డిలను జేయు ఘనములైన పనులలోన చిత్ర మొక్క పని వచించెద ॥వినరె॥

1. మన మనంబుల లరుచుండ - దినదినంబు ప్రభుని నిండు = ఘన మహాద్భుతములు వినిన తనివిదీరదు ॥వినరె॥

2. ఇలను బేతనియాపురంబు - గలదు మరియ మార్త లక్క = చెలియలందు వాసముండి రెలమి తోడను ॥వినరె॥

3. పరిమళంపు తైలమేసు - చరణములకు బూసిన యీ = మరియ సోదరుండు రోగ భరితుడయ్యెను ॥వినరె॥

4. వ్యాధిచేత లాజరుండు - బాధనొందుచుండ క్రీస్తు = నాధు బిలువనంపి రపుడు - నాతులిరువురు ॥వినరె॥

5. తమ్ముడక్క సెలియలును ప్రి - యమ్ము తనకు గలిగియుండ = నమ్మహాత్ముడైన క్రీస్తు -డరిగెనచటికి ॥వినరె॥

6. యేసు వచ్చుటెరిగి మార్త - యెదురుగాను బోయి తనదు - దోసిలొగ్గి మ్రొక్కి ప్రభువు - తోడబల్కెను ॥వినరే॥

7. కర్త నీకు దేవుడిచ్చు - ఘనబల మెరుగుదును సత్య = వర్తివిచట లేనికతన - వ్రాలె లాజరు ॥వినరే॥

---

8.పాపములకై 9.సంతోషింప చేయబడువారు 10.ఎక్కువ తృప్తినొంది 11.దేవుని 12.ప్రసిద్ధిగా 13.పొందుదురు

8. పిదప మరియ వచ్చి క్రీస్తు - పదయుగముల కొరగి యేడ్చి = మొదట మార్త బలికినట్లు - సుదతి బలికెను ॥వినరే॥

9. అపుడు కర్త వారపలుకు - లాలకించి మదిని మూల్గి = కృపకు పాత్రురాలితోడ - నపుడు నడిచెను ॥వినరే॥

10. నడిచి లాజరుని సమాధి - కడకుజేరి గుహను మూయ = బడిన రాయి తియ్యుడనుచు - ప్రభువు జెప్పెను ॥వినరే॥

11. యేసుతోడ మార్త బలికె - నీ సమాధి నునిచి నాల్గు = వాసరంబులయ్యె కంపు - పట్టి యుండుగ ॥వినరే॥

12. దానినమ్మి చూడుమని మ - హానుభావు డాత్మబలము = నూని తండ్రినపుడు స్తోత్ర మొనర జేసెను ॥వినరే॥

13. లాజరాసమాధి వెడలి - రమ్ము లెమ్మటంచు లోక = పూజితుడు మహారవంబు బూని బల్కెను ॥వినరే॥

14. మరణమైన వాడు ప్రాణ - భరితుడగుచు లేచివచ్చె = తరుణులధిక హర్షలైరి - పెరజనంబుతో ॥వినరే॥

15. కనని వినంగరాని యిట్టి - ఘన మహాద్భులంబుజూచి = జనులు కొందరేసు నాధు - నను సరించిరి ॥వినరే॥

16. గనుక మనము వానిజేరి - కొని సుఖంబు బడయవచ్చు = మనసు నిలిపి యతని యందు - మనుట మేలగున్ ॥వినరే॥

## 84.

## క్రీస్తు వాక్యము పతితపావనము.

రా - శంకరాభరణము (మన మొదటి తలిదండ్రుల్) తా - త్రిపుట.

వినరయ్య నరులారా - విశ్వాసమున క్రీస్తు - విమల బోధ = పాప - మనుజుల కెల్ల పా - వన జీవనము సేయు - వసుధ మీద ॥వినరయ్య॥

1. పాపాత్ములను పశ్చా - త్తాపము పడుడంచు - బ్రభువు దెల్పెన్ = తన - దాపు గోరిన వారి - గాపాడుటకు దానే - దక్షుడయ్యెన్ ॥వినరయ్య॥

2. భారాక్రాంతులైన - పాపుల - దను జేర - బ్రభువు పిల్చెన్ = శ్రమలు - దూరంబు జేసి త - ద్దురితముల్ బాపి సం - తోష మియ్యన్ ॥వినరయ్య॥

3. అనుమానింపక నెవ్వ - రైన వచ్చిన ద్రోయ - ననుచు బెల్కెన్ = పెక్కు - మనుజుల కొరకు జీ - వన మియ్యనే వచ్చి - తనుచు దెల్పెన్ ॥వినరయ్య॥

4. మనసారదేవునిన్ - మానక ప్రేమింపు - మనుచు నేర్పెన్ = ఇంక దన పోల్కె - నొరులను దాను బ్రేమింపగ దనర దెల్పెన్ ॥వినరయ్య॥

5. తన శిష్యులకు నైక్య - మును బ్రేమించుట కాజ్ఞ - లొనర నిచ్చె = నెంతో - ఘన సత్ప్రభువు కాళ్లు - గడిగి భక్తుల చోట - వినతుడయ్యెన్ ॥వినరయ్య॥

**85.**

## యేసునాధ కధా సుధారసము.

రా - బిళహరి తా - త్రిపుట.

యేసునాధ కధా - సుధారస[1] మిదిగో పానము సేయరే = దోసకారి జనంబులారా - దురిత భవముల బాయరే ॥యేసునాధ॥

1. ఇహపరంబులు[2] యెవనిచే సృజింయిపబడియెను చూడరే = అహహ యా విభు[3] డవతరించెను - యతని గుణములు పాడరే ॥యేసునాధ॥

2. దురితభరితుల[4] దుష్టచరితుల[5] నరయ[6] వచ్చెను చూడరే = స్థిరముగా మదినమ్మి యా ప్రభు - కరుణ మది గొనియాడరే ॥యేసునాధ॥

3. పనికిమాలిన వేలుపుల[7] దెస[8] పరుగులెత్తుట మానరే = తనువు[9] మీకొరకిచ్చు క్రీస్తుని దయకు పాత్రత బూనరే ॥యేసునాధ॥

4. మరణబలి రక్తమున మన యందరిని - బ్రోవను వచ్చెను = కరుణతో పాపుల బిలుచు గురు దరికి బోవుదమిచ్చను ॥యేసునాధ॥

5. పరమతత్వ విధానబోధలు బాగుగా ప్రకటించెను = చిరసుఖాస్పదపదము[10] గోరిన జీవులకు వినిపించెను ॥యేసునాధ॥

6. మరణమొందిన కొందరికి దా - మరల ప్రాణములిచ్చెను = వర మహాద్భుత కార్యముల నిద్ధర[11] ననేక మొనర్చెను ॥యేసునాధ॥

7. కుటిలబుద్ధుల[12] ద్రోచి సజ్జన[13]- గోష్టి[14]నుండుట గోరరే = దిటముగను నెమ్మదిని మీరొం - దుటకు క్రీస్తుని జేరరే ॥యేసునాధ॥

8. పాపములను దలంచి పశ్చా - త్తాప మెదలో[15] బొందరే = ప్రాపు క్రీస్తుడటంచు నమ్మి య - పార సౌఖ్యము[16] లొందరే ॥యేసునాధ॥

9. మధురమగు సువిశేషవాక్కులు[17] - మనసులోపలబెట్టరే= యధమగుణములు వదలి భక్తి ప్ర - త్నముల తుదముట్టరే ॥యేసునాధ

---

1.అమృతము 2.భూమిఆకాశములు 3.దేవుడు 4.పాపములతో నిండియున్న 5.దుర్మార్గమైనప్రవర్తనకలిగిన 6.రక్షింప 7.దేవతలు 8.వైపుకు 9.శరీరము 10.శాశ్వతసుఖముకుఆధారమైన 11.ఈ భూమియందు 12.మోసముచేయువారి 13.మంచివారి 14.సహవాసము 15.మనసులో 16.సుఖము 17.మంచివాక్కులు

## 86.

### కాలము అనిత్యము గనుక సఫలపరచబడవలసినది.

రా - ధన్యాశి తా - ఛాప్

పోయెగ పోయెగ కాలము వెళ్లి - పోయెగ పోయెగ = మాయ సంసార సం - పద గూర్ప మరిగి[1] - యాయువంతయు వ్యర్థమై పోయె తరిగి ॥పోయెగ॥

1. ఇలలో నెందరు నీతో నీడైన వారు = కలగాంచి[2] మేల్కొన్న - గతి మడిసినారు ॥పోయెగ॥

2. జలబుద్బుదము[3] కంటే - చులకని బ్రతుకు = దలపోసి దీని యాశలు గొయ్య వెదుకు ॥పోయెగ॥

3. ఎన్నాళ్ళు సుఖపెట్టె వెరవు యీ మేను = కన్ను మూసిననాడె మంటిపాలౌను ॥పోయెగ॥

4. మద మత్సరముల వెంబడి గూడి నీవు = హృదయాభిమానము వదులుకొన్నావు ॥పోయెగ॥

5. చెడు దుర్గణముల పోషించుట విడువ = గడబాట్ల నీ కండ్లు గానంగరావ ॥పోయెగ॥

6. జవ్వన[4] బలముచే గ్రొవ్వుచు నీవు = నవ్వులాటల ప్రొద్దు నడపి యున్నావు ॥పోయెగ॥

7. విన జెవుడు కనగుడ్డి వృద్ధాప్యమందు = నిను నవ్వి మొరగెదరు నీవారు ముందు ॥పోయెగ॥

8. చెడ్డ వేల్పుల సేవ జేసితివి మిగుల = గుడ్డి గవ్వంతైన గుణ పరుప దగిర ॥పోయెగ॥

9. ఇకనైన శుభవార్త వీనుల[5] బెట్టు = ప్రకటంబుగా క్రీస్తు పాదముల బట్టు ॥పోయెగ॥

10. చాలించుమిక పాప సరణిలో[6] నడకక = గీలించు[7] మెద భక్తి క్రియ వెనకబడక ॥పోయెగ॥

11. నిను నీవె దలపోసి నీ పాపమెరుగు = దినము బ్రార్థించి క్రీస్తుని మ్రోల[8] నెరగు[9] ॥పోయెగ॥

---

1.అలవాటుపడి 2.కలకని 3.నీటిబుగ్గ/బుడగ 4.యౌవనము 5.చెవులు 6.మార్గము 7.స్థాపించు 8.ఎదుట 9.నమస్కరించి

**87.**

## మోక్ష ప్రవేశము.

రా - ముఖారి (చాయ: రారే మన యేసుస్వామిని) తా - ఆది.

ఎంతో - శృంగారమైనది - యేసునిచరిత - మిదియెంతో వేడ్కైయున్నది - మోక్ష ప్రవేశము = మంతట తేజోవంతడు క్రీస్తుడు - చెంతను దూతా -శ్రిత జన పఙ్క్తులు[1] - వింతగ నడువగ సంతత[2] నవ్య వ - సంతము[3] గల్గి య - నంత జీవ రస[4] - వంత ఫలోప వనాంతరములు[5] ద - త్ప్రాంతంబునగల - పరమ పురమునకు = సంతసమున[6] జనె జయ శబ్దముతో ॥నెంతో॥

1. తెరచి- మూయ్యంగరానట్టి - ద్వారములార మీ - శిరము లెత్తుకొని యుండుడీ - అనాదిగనుండు వర కవాటములారా[7] మీ రె - యెత్తంగబడుడీ = సురిచిర[8] మహిమ స్ఫురణలు[9] గల మీ - దొర తన పరిశు - ద్ధుల కరులగు[10] భీకర దురితాత్ముల[11] - దురమున జదిపి[12] య - పరిమిత బలజయ[13] - బిరుదాంకితుడై[14] - చిరముగ నూతన - యెరుసలేమ పుర - పరిపాలన తత్పరుడై[15] యిదిగో = నెరవుగ[16] వచ్చెను - నిజ భక్తులతో ॥ఎంతో॥

2. సుంద - ర మందానిలమందు[17] - జీవసంజీవా[18] - నంద సౌఖ్య ప్ర ద మ్మై యుండ - రేబగలంటని - మందిర వాసులప్పుడు - జయ జయ శబ్దముల = పొందుగ క్రీస్తుని పొగడుచు బాడుచు - రాజుగ - ఘన వందనములు జె - న్నొంది తనందరి - కిందగు ప్రభు - జెందిన భక్తుల - బృందములగు[19] దగు - విందు లొనర్చిరి = పొందిక కలిగెను - భూమికి ముక్తికి ॥ఎంతో॥

3. వెలలే - ని బంగారంపు కిరీటములు - చెలిమిన్[20] పరిశుద్ధ వంతుల - శిరములపై బెట్టి - కళలీను[21] ధవళ వస్త్రములు[22] - గట్టంగనిచ్చి - చెలువగ[23] మరి వా - రల చేతుల లో - పల విజయార్థపు పీఠము ముంగల నిలువంబడి - పొలుపుగ[24] తమ దే - వునకును క్రీస్తుని - కెలమిని[25] స్తోత్రము - బలఘన మనిశము[26] = గలుగును గాకని - పలికి నుతించిరి ॥ఎంతో॥

4. పరిశు - ద్ధవంతు లప్పుడు - శాశ్వతానంద - భరితులై వీణలు ధరియించి - పాటలు బాడుచును - గురురాయుడైన తమ ప్రభుని - గుణములు వర్ణించి = కరుణను మీ ర - క్తముచే మము నం - దరి ధరణింగల - నర వంశస్థుల తరములలో నుం - డరుదుగ దేవుని కొరకు గదా మము - కొనియుంటిరి మరి - మురువుగ నిక దే - వుని సముఖంబున - దొరలును యర్చక - వరులజేసితిరి = ధర యేలుదు మిక సరియని మ్రొక్కిరి ॥ఎంతో॥

---

1.దూతలును,నమ్మకొనినవారును 2.నిత్యమైన 3.నూతనమైన వసంతముకల్గి 4.రుచి 5.తోటలుమొదలైనవి 6.సంతోషముతో 7.తలుపులారా 8.సుందరమైన 9.శాంతి 10.శత్రువులైన 11.యుద్ధమునందు 12.సహరించి 13.బలమును జయమునుగల 14.నామముచేత ప్రకాశించువాడు 15.మిక్కిలి ఆశగలవాడు 16.చక్కగా 17.చల్లగాలి 18.జీవముకలిగినటువంటి జీవము ఇచ్చునటువంటివి 19.సమూహములు 20.చక్కగా 21.ప్రకాశము ఇచ్చు 22.తెల్లని 23.బాగుగా 24.చక్కగా 25.లెస్సగా 26.నిత్యము

## 88.

### చిరజీవము క్రీస్తు యిచ్చును.

రా - సావేరి (చాయ: విజయంబు విజయంబు) తా - అట.

చిరజీవమగు క్రీస్తు - చెలిమి గల్గెడివారు - వరము లెవ్వియుగోరరు = నిరుపమానందంబు - నిత్యాత్మ జీవంబు - మరి యానంద ప్రేమా - దరము మధురమదియె ॥చిర జీవమగు॥

1. వరములస్థిరమైన - వైభవంబులుగాని - పరిపూర్ణ సుఖమియ్యవు = నిరహేతువును గల్గె - నిత్యానంద సుఖంబు - గురుదేవుడగు క్రీస్తు - కరుణలో నున్నది ॥చిర॥

2. అందరానటు వంటి - ఆశా ఫలములెల్ల - పొందిన సుఖమేమిటీ = డెందము ముదమెప్ప - టికి మాత్రమే గాని - జెందవచ్చునె నిత్య - క్షేమానంద సుఖంబు ॥చిర॥

3. కోరిన వరములు - జేర వచ్చినగాని - కొరత యున్నది వాటికి = మేర లేనటువంటి - సారవాంఛిత మొకటే - సారూప్యమది క్రీస్తు - సాన్నిధ్య మదిచాలు ॥చిర॥

## 89.

### పరిశుద్ధుల ప్రశాశత.

రా - మారువ (చాయ: నీకన్న యిక వేరె) తా - త్రిపుట.

పరిశుద్ధి పరిశుద్ధి పరిశుద్ధి యని విన - బడు పుర మదిగో - పద పదరే ప్రియులారా = పరమేశ్వరునిచేత - బరిపాలనము గల్గి - చిరమై భాసురమై సు - స్థిరమై సుందరమైన ॥పరిశుద్ధి॥

1. రవితోను[1] కుముదబాం - ధవుతోను[2] మరి దీప - చ్ఛవితోను[3] దాని కవసర - మింత లేదు = అవిరతమున[4] గ్రీస్తు - డందుండు ప్రభతో[5] సం - స్తవమై[6] వైభవమై యు - త్సవమై వెల్గుచునుండు ॥పరిశుద్ధి॥

2. గొదయైన[7] మరియే యా - పదయైన[8] దగయైన - మొదలే లేకుండు న - ప్పురవాసు లందు = మృదు జీవోదకముల - ర్మిలి[9] నిరంతర మిచ్చు - గుదురుగ నెదురుగ - గూర్చిండి యువరాజు ॥పరిశుద్ధి॥

---

1.సూర్యుడు 2.చంద్రుడు 3.కాంతి 4.శాశ్వతముగా 5.కాంతి 6.స్తోత్రములతో నిండినది. 7.ఆకలి 8.దప్పిక 9.ప్రేమ

3. ప్రభు కృపాసనము లోపలినుండి ప్రవహించి – శుభమైన నదియుండి సుఖమిచ్చు నచట = నుభయ తీరములందు – నుండు వృక్షములు సౌ – రభ[10]దీప్తి శుభములై – రక్షా ఫలము లిచ్చు ॥పరిశుద్ధి॥

4. జననంబు మరణంబు – సంసార సుఖబాధ – లనుభవించుట గల్గ – దా పురమునందు = మును నీతి కొరకు కాప – దను బొందు తనవారి – కను నీళ్లన్నియు దుడుచు – మన దేవు డందుండి ॥పరిశుద్ధి॥

5. వెలకంద రాని ని – శ్చలమైన జీవ – విల సత్కిరీటము[11] – ల్గలవప్పురమున = బిలిచి నప్పుడే విభుని – పెండ్లి విందున కేగు – కుల బంధువులకు ని – చ్చల నిచ్చు దేవుండు ॥పరిశుద్ధి॥

## 90.

### లోక విసర్జనము.

రా – బిలహరి (చాయ: ఎందుకు మరచితివి) తా – త్రిపుట.

పోపోవే యో లోకమా – చాలిక జాలు – నీ పొందు మే మొల్లము = పాపేచ్ఛ లున్నంత – సేపు నోపగ[1] రాని – వేపాట్లు బెట్టితి – వీపట్ల నసువీడి ॥పోపోవే॥

1. సకలేంద్రియ వ్యాప్తులు – నీ సేవ బా –యక[2] చేయు దివసంబులు[3]= ఇక దీరి పోయె భ్రా – మికము జూపకు మిపుడు – ప్రకటమ్ముగ గ్రీస్తు – పద భక్తి మా కబ్బె ॥పోపోవే॥

2. నీ రాజు బహుమానము – గంటిమి ఘోర – నరకాంబుధి తీరము[4] = దారి దొలగి నిన్ను – జేరి దు:ఖముల వే – సారి తిప్పుడు[5] క్రీస్తు – సదయుడై నను బిల్చె ॥పోపోవే॥

3. ఎర జూపి బలు మీనము[6] – బట్టెడు వాని – కరణి[7] వస్తుల రూపము = బొరి[8] జూపి లోభము – బుట్టించి నను బట్టి – పరిమార్చితివి[9] యింక – మరి యేమున్నది చాలు ॥పోపోవే॥

4. ఎండమావుల తేటలు – నీ విచ్చెడు – దండైన యిహ సుఖములు = కండ గర్వముచే[10] నీ – యండ జేరితి గాని – నిండు నెమ్మది దయా – నిధి క్రీస్తుడిపు డిచ్చు ॥పోపోవే॥

---

10.పరిమళము 11.ప్రకాశమైన కిరీటములు

1.సహింప 2.వదలక 3.దినములయొక్క సమూహము 4.సముద్రము 5.విసికితిని 6.చేప 7.విధము 8.విస్తారముగా 9.చంపితివి 10.మదముచే

**91.**

## పుట్టుగ్రుడ్డికి జూపునిచ్చుట.

రా - నవరోజు (చాయ: ఏమాయెను ఏమాయెను అపవాది) తా - త్రిపుట.

అందమైన క్రీస్తు కథ మీ - రాలింపరయ్య ॥అందమైన॥

1. పొందుగ శిష్యులతో యేసు - పోవుచుండు మార్గమందు - ముందుగ వీక్షించి[1] రొక్క పుట్టంధకుని[2] = అందు గొందరు శిష్య - లాత్మలో భావించి - రెందు కీతడు చీక - య్యెను[3] దీని విధమేమో - డెందములను[4] గల్గు - సందియములు వీడి- వందమనుచు లోక - వంద్యుని సంతతా = నందుని మరియ - నందునుని[6] నడిగిరప్పు ॥అందమైన॥

2. చీకువాడై జన్మించుటకు జేసెనా దుష్కృతము నితడు - లేక వీని జననీ జనకు - లేమి చేసిరో = యీ కారణము దెల్పు - మో కర్త యిపుడీవు - మాకంచు తను వేడ - లోకేశ్వరుండు ని - రాకారు డితనియందీ కార్యములు జూప - బ్రాకటముగ జేసె - గాక వేరొకవిధము = లేకున్నదని తెల్పి - చీకు బ్రోవ దలంచె ॥అందమైన॥

3. బురద వాని కన్నులందు - కరములతో[7] జమిరి[8] యొక్క - చెరవులో బ్రక్షాళించుటకు[9] సెలవిచ్చె బ్రభువు = బిరబిర నయ్యంధుడరిగి యేసుని పల్కు దిరము మదినమ్మి - సరణిలో[10] మునిగి సుం - దరమైన నేత్రముల్ - ధరియించి యానంద - భరితుడై చనుదెంచు[11] - తరి[12] వాని పొరుగింటి = నరులబ్బురముగ జూ -చిరి మార్మోమగువాని నందమైన ॥అందమైన॥

4. చూపులేని గ్రుడ్డివాని - జూడ గలుగజేయువాడే - పాపాంధకార మగ్నుల[13] నా - ప్రభువే రక్షించు = పైపైని మనకన్ను - చూపుచూపది గాదు - లోపలికనుగుడ్డి - యైపోయి యున్నది - యుపత్పరంపర[14] - లో బొరలుచున్నాము[15] - కాపాడుమని యేసు - శ్రీ[16] పాదములు బట్టి = చూపు లోపలి చూపు - జూచి యానందింత ॥అందమైన॥

---

1.చూచిరి 2.పుట్టినతోనే గ్రుడ్డివాడైన 3.గ్రుడ్డివాడు అయ్యెను 4.మనస్సులందు 5.లోకముచేత నమస్కరింప దగినవాడు 6.కుమారుడు 7.చేతులతో 8.రాచి 9.కడుగుకొనుటకు 10.కొలనులో 11.వచ్చి 12.సమయమందు 13.మునిగినవారిని 14.ఆపదల సమూహము 15.తిరుగుచున్నము 16.శుభమైన.

## 92.

# లోకము క్రీస్తుకు సాటిరాదు.

రా - మారువ తా - ఆది.

లోకము వారెల్ల - లోకువ జూచిన - లోపము నీకేమిటి = ప్రాకటముగ గ్రీస్తు - పతిత పావన మూర్తి - నీకోసమై ముక్తి - నిలయము[1] గట్టంగ ॥లోకము॥

1. దరిలేని[2] దురిత[3] దు - స్తర[4] పారావారము[5] - దాటించు వారెవ్వరు - భీకరమైన[6] - నరకాగ్ని బెట్టు బం - ధుర[7] దేవ కోపాగ్ని - మరలించు వారెవ్వరు - చంచల బుద్ధి = స్థిరపరచి పరమార్థ[8] - మెరిగించి చిరముక్తి - గురి దెల్పు వారెవ్వరు - ఈ ధరలోన = నరరూపు దాల్చి నీ - కొరకై జీవన మిచ్చు - కరుణాబ్ధి[9] క్రీస్తుడు - వరుదుడై యుండంగ ॥లోకము॥

2. మాటి మాటికి బాప - మార్గమున జనుచుండ - మది ద్రిప్పు వారెవ్వరు - సైతానుని - తాటించి మరి వాని - కేటించి[10]యభయ హ - స్తము నిచ్చు వారెవ్వరు - మృత్యువు ముల్లు = మీటించి సుఖమాత్మ - నాటించి తన యోర్మి[11] - చాటించు వారెవ్వరు - యెరూషలేము = బైట కల్వరిమెట్ట - పై మేను బలియిడిన - మేటి[12] క్రీస్తుని నామా - మృతము నీకుండంగ ॥లోకము॥

3. హృదయ సంతాప దు: - ఖ దురంతమగు చింత - ల్వదిలించు వారెవ్వరు - నెమ్మది నిచ్చి - పదిలమ్ముతో మోక్ష - పద మిదుగో యంచు - పదమను వారెవ్వరు - ఎన్నడు నిన్ను = వదలి వెయ్యనంచు - మృదువాక్యములు తెల్పి - ముద మిచ్చు వారెవ్వరు నింకొక నాడు = సదయుడై క్రీస్తుడు - చనుదెంచి నిను ముక్తి - సదనస్థునిగ[13] జేయు శాస్త్రోక్త మిటులుండ ॥లోకము॥

---

1.ఇల్లు 2.గట్టులేని 3.పాపపు 4.దాటశక్యముగాని 5.సముద్రము 6.భయంకరమైన 7.విశేషమైన 8.వాస్తవము 9.దయాసముద్రుడైన 10.వేరుపరచి 11.ఓర్పు 12.శ్రేష్ఠమైన 13.స్థానమందు ప్రవేశించినవాని

పురుషోత్తము చౌధరిగారు బంధువులందు ప్రీతివిడక తాను క్రీస్తును నమ్మిన తరువాత తనకు కలిగిన ఆనందమును, మనశ్శాంతిని గూర్చి చెప్పుచూ క్రీస్తువలన కలిగే పాపోపశమును, ప్రాయశ్చిత్త మార్గమును చూప ప్రయత్నించిరి. కాని వారు ఆయనను బహు హీనముగా చూచి "కులదూరుడైనాడని మాలకూడు తినివేసినాడని తన్ను హేళనచేయుచూ నీచముగా మాట్లాడేవారు. పెంట సమీపమున కొక గుంటత్రవ్వి విస్తరవేసి అన్నము పెట్టినారు. ఆయన తిరిగిన చోట నీళ్ళు పోసి శుభ్రము చేయుచూ చాలా హీనముగా చూచిరి. బంధుమిత్రాదులు చేయుచున్న ఈ హీనస్థితిని ఆయన పెండ్లి విందుగ భావించుకొని తననుతాను ఆదరించుకొనుచూ హృదయమును శాంతి పరచుకొనుటకు ఆయన 1834సం॥లో ఈ కీర్తన అనగా "లోకమువారెల్ల లోకువ జూచిన లోపము" అనే వ్రాసికొని గానము చేసిరి.

## 93.

# ఇహలోకము విశ్రాంతి లేనిది.

రా - శుద్ధకాంభోజి (చాయ: విజయంబు విజయంబు) తా - కురుజంపె.

ఏది నా విశ్రాంతి - యీ లోకమందు - నే దిక్కు గనుగొన్న - లేదు సుఖ మెందు = మేదురా[1] మోద[2] ని - త్యోదగ్ర[3] మోక్ష పుట - భేదమున[4] చొరకున్న - లేదు సుఖ మెచట ॥ఏది॥

1. కష్టములు తెరతెరలు - గా వచ్చిన మదాత్మ - దృష్టి దప్పక యోర్చి - తిరమంద వలయున్ = సృష్టమగు నా త్రోవ - పయనంబు తుద ముట్ట - శ్రేష్టమగు నా యిల్లు చేరు నందాక ॥ఏది॥

2. కోరింద పొదచుట్టు - కొనియుండ నిమ్ము నే - గోర నిచట గులాబి - కుసుమ[7] శయనంబు = నే రీతినైన నా - యేసు రొమ్మున జేరి - భూరి సుఖ మొందెద వి - చార మిక నేల ॥ఏది॥

3. యేసు ప్రియ మించు కే - నెరిగి కన్గొను వేళ - నా సంతసము నిండు పాపి చనె వెతలు = భాసురంబుగ మంచు - పగిది తళ తళలాడ - జేసె నా కన్నీళ్ల - చింత తెడబాపి ॥ఏది॥

4. ఉండునే సందియము - లుండునే దు:ఖములు - గండములు ఢీ యనుచు బైకి రాగలవే = మెండుగా మధురమై - యుండు మోక్షము నాకు దంద్రితో గడియ సే - వుండినను జాలు ॥ఏది॥

5. నడుము పై నొక సంచి - బడె కర్ర చేతిలో - నిడికొనుచు శత్రువుల - పుడమి వే గడుతున్ = నడు దారి కరకు నె - న్నక వేగ రక్షింప - బడుదునని పాడి చని - పరమ సుఖి నౌదు ॥ఏది॥

6. బహుభయంకర సింహ - పటు గర్జనములతో - విహరించి సైతాను వీరుడై నిలువన్ = అహహ మృగశాబకము[5] - లట్ల సద్భక్తులా - యహితుతో[6] నెదిరించి - యుద్ధము సేయ వలయు ॥ఏది॥

7. నా కోరికలు క్రిందిలోక సౌఖ్యములపై - పోకుండ మది నిల్పి - పోరాడ వలయున్ = నాకాశ రాజ్యంబు - హస్తకృత భవనంబు - చేకూర దనుక పని - సేయు పనియుండు

---

1.దట్టమైన 2.సంతోషముచేత 3.గొప్పదియైన 4.పట్టణము 5.మృగముయొక్క పిల్లలు 6.శత్రువునితో 7.పన్నీరపువ్వుల

**94.**

## విజ్ఞాని విసుగు.

రా - శుద్ధకాంభోజి (చాయ: విజయంబు విజయంబు) తా - జంపె.

విసుకదే ప్రాణంబు - విజ్ఞాని కిలను - పొసగు వైరాగ్యంబు - పుట్టదే - తలను = అసదు గానట్టి క - ష్టానుభవమే గాని - యసదృశానంద ఫల - మొసగు నది యేది ॥విసుకదే॥

1. మును పేది యుండెనో - వెనుక నదియే యుండు - మునుపు వెనకకు మధ్య - మున నున్న దదియే = నొనరంగ గ్రొత్తయై - యుత్పన్నమగు నట్టి - ఘనకార్య మొక్కటియు - గానంగరాదు ॥విసుకదే॥

2. ధరణి మీదికి దిగం - బరుడగుచు నేతెంచు - మరణమప్పుడు దిగం - బరుడగుచు బోవున్ = నరుడు పుట్టిననాడు - సరకెద్దియును తేడు - మరణమగు నా డొక్క - సరకు గొనిపోడు ॥విసుకదే॥

3. ఒక తరము పోవు మరియొక తరము జనుదెంచు - సకల వంశము లిట్లు - సమసి పోవుచుండు = నిక వారి పేర్వెంపు - లెచ్చోట నేమాయె - నొకండైన చెప్పుటకు నుర్విలో లేడు ॥విసుకదే॥

4. ఏటివంకలు దీర్చ - నెవ్వాని కలవి ము - న్నీటి మూకుడు సేయ - నేర్పరి యెవండు = మోటైన మనసు వం - పులు దీర్చు గురు వెవడు - కోటి ధనమిచ్చినను - కుంభినిని లేడు ॥విసుకదే॥

5. ధరణిలో నరరూపు - దాల్చి పాపుల కొరకు - మరణమై లేచు స - ద్గురుడైన యేసు = చరణాబ్జముల సేవ - సారమిది యొక్కటే - పరమ ఫలమిడు సుఖ - ప్రాప్తి యొనరించున్ ॥విసుకదే॥

6. వినినదే వినవలయును - కనినదే గనవలయును - తినినదే తినవలయును - తృప్తిలేదెందు = మనసు నిండిచును - తన విధంబొక్కటైన - యనుభవించను దొరకదు పనిలో నకటా ॥విసుకదే॥

7. కూడనదే కూడుచును - యాడినదే యాడుచును - పాడినదే పాడుచును - పల్కినదే బల్కుచు = నేడు యేవిధమో వె - య్యేడులకు నా విధమే - చూడగా నూతనమగు - చోద్యంబు లేదు ॥విసుకదే॥

8. అందినదే యందుచును - పొందినదే పొందుచును - సందించునదియే మరల సందించ వలయున్ = ముందునర్చిన పనియె - మొనసి వెనుకనొనర్చు - నందు జూచిన క్రొత్త - యగు విధములేదు ॥విసుకదే॥

9. నేర్చినదే నేర్చవలెను - చేర్చనదే చేర్చవలెను - కూర్చినదే కూర్చవలెను క్రొత్త మరిలేదు = మార్చురూకయె మార్చుబడుచున్నట్లు తీర్చిమును చేసినదే దిరుగు నెల్లడను ॥విసుకదే॥

10. పుట్టుఫలమే మరల బుట్టుచండునుగాని పుట్టదిక వేరొక్క - పోల్కెయై భువిని = చెట్టు విత్తనమే యా చెట్టుగా జన్మించు పట్టిజూచున క్రొత్త పనియందు లేదు ॥విసుకదే॥

11. తనువుపోలికనొక్క తనువు జన్మించునా తను విం(ద్రియములె యీ - తనువందు బొడమెన్ = ఘనకార్య బీజ - మొక్కవిధంబె కానియే - తనువునను జూడను - తనవిధములేదు ॥విసుకదే॥

12. పుడమి మీదను యెద్ది బుట్టునో యది మరల పుడమిలోననె గలసి - బుగ్గియై పోవున్ = పొడమినదియే మరల - బొడముచుండనుగాని - కడకైననొక కొత్త గన్పించదెందు ॥విసుకదే॥

13. అరుదైన క్రీస్తు ప్రే - మామృతము పానించి - దురితాగ్ని కీలలకు - దొలగువాడెవడో = నెరి నాతడెరిగి - ధరణింగల సుఖములెల్ల - మరివట్టి మాయలని - మొరలెట్టకున్నే ॥విసుకదే॥

**95**.

రా - ఆనందభైరవి (చాయ: మంగళము క్రీస్తునకు) ఆది - జ్వాల

జయమంగళము నిత్య - శుభ - మంగళము ॥జయ॥

1. నిరుపమాచారునకు[1]- నిఖిల[2] సంవేద్యునకు[3] - పరిశుద్ధ సద్గుణా - భరణునకును[4] = కరుణా సముద్రునకు - పరమ గురు రాజునకు - స్మరియించు మేమెపుడు - మంగళము పాడెదుము ॥జయ॥

2. మంగళము క్రీస్తునకు - మరియా తనూజునకు - మంగళము దేవుని కు - మారునకును = మంగళము మోక్ష సా - మ్రాజ్యాధికారునకు - మంగళము మా పాలి మంచి ప్రభువున కెపుడు ॥జయ॥

3. సకలాంతరాత్మునకు - సచ్చిదానందునకు - నకళంక నరదైవ - మగు వానికి = ప్రకటముగ మా కొరకు - ప్రాణమిచ్చిన యేసు - నకు జయము జయమని - ఘనముగా పాడెదము ॥జయ॥

4. నింగియును భూమియును - నిఖిల లోకంబులును - జంగమ స్థావరముల్ - సర్వములెత్తి = సంగీతవాద్యముల - జయజయ ధ్వనులతో - మంగళము పాడుడీ - మా యేసు రాజునకు ॥జయ॥

---

1.ఎవరితో పోల్చుటకు వీలులేనివాడు 2.సర్వము 3.సుఖదు:ఖాదునుకొలిచేవాడు 4.పరిశుద్ధమైన గుణముగల ఒక నక్షత్రమువంటివాడు

**96.**

## యేసు గొఱ్ఱెల మంచి కాపరి.

రా - పంతువరాళి (కరుణపీఠము చేరరే) తా - చాపు.

ఇడుగో గొఱ్ఱెలకాపరి - సోదరులారా - యిడుగోగొఱ్ఱెలకాపరి = కడగానరాని[1] - కారడవిలో[2] నలసట - పడెడు గొఱ్ఱెలను - పేరిడిబిల్చి రక్షించు ॥ఇడుగో॥

1. చెదరిపోయిన గొఱ్ఱెనై - దొడ్డికి బోవ - ముదము[3] లేనివాడనై = మృదు మధురంపు నీ - నాదమా[4] లించక కర్త - కొదిగి[5] యుండక మూఢ - హృదయుడనైతి ॥ఇడుగో॥

2. దూరంబునకు బోతిని - జనకుని కృపా - సారంబు గొననైతిని = కారు[6] మూర్ఖపు పిల్ల - గా సంచరించినా - కూరిమి యిలు బాసి - దారి దొలగిపోతి ॥ఇడుగో॥

3. తనదు గొఱ్ఱెను జూచెను - బోయడు తండ్రీ - తన శిశువును గాంచెను = కనికర మెదలో నిం - డినవారలై నన్ను - వన గిరి కటకాదు[7] - లను వెంబడించిరి. ॥ఇడుగో॥

4. ప్రాణవసర మప్పుడు - యేకాకినై - క్షీణించి యున్నప్పుడు = త్రాణర్ధమగు[8] నెనరు త్రాళ్లతో ననుగట్టి - నాణెంబుగా దెచ్చి - నను రక్షించెను ॥ఇడుగో॥

5. చెడగు మెకముల వల్లను - బాధల నొంది - కడు మలినమై యుండును = కడిగి గాయములన్ని - గట్టి శుభ్రము చేసి - తడయక[9] నా యింట నిడి నెమ్మది యొసంగె ॥ఇడుగో॥

6. ప్రభుయేసు నా బోయడు[10] - యీతడె భూమి - నభము[11] లేలెడి రాయడు = శుభమైన తనదివ్య - శోణిత[12] మొసగియా - విభుడు ప్రేమించి దీ - వించి స్వస్థము జేసె ॥ఇడుగో॥

7. నన్ను దొడ్డిని బెట్టెను - పోయిన గొఱ్ఱె - తెన్ను వెదకిపెట్టెను = సన్నంపు పచ్చిక - యున్న జీవనవూట - లున్ను గల్గెడి చోట్ల - నన్నుంచి రక్షించె ॥ఇడుగో॥

8. నేను మూర్ఖపు గొఱ్ఱెనై - లోబడకుంటి - మానసమున వెర్రిన = పూని యిప్పుడే కాచే - వాని శబ్ధము ప్రేమ - తో నాలింపుము దొడ్డి - నానందము నుందు ॥ఇడుగో॥

9. చెడ్డబిడ్డనై యుంటిని - యిటునటు బోవ - నెడ్డెతనము గొంటిని = మొడ్డు లేకిపుడు ప్రే - మింతు నా ప్రియజనకు - మంచి శబ్దము వాంఛిం - తును ముక్తి నిలయము ॥ఇడుగో॥

---

1.చివరగుపడని 2.దట్టమైన అడవిలో 3.సంతోషము 4.శబ్ధము 5.లోబడి 6.మోటు 7.పర్వతప్రదేశములు మొదలైన 8.రక్షణార్ధమైన 9.వెంటనే 10.కాపరి 11.ఆకాశము 12.రక్తము

## 97.

### యేసు మన ప్రియబంధువు.

రా – ఆహిరి (చాయ: పాపినినేని ప్రభు పదములకడ) తా – ఆది

యేసువంటి ప్రియ బంధుడు నాకిక – నిహ పరములో లేడన్న = భాసురముగ నిజ భక్తుల కది యను – భవ గోచర మెపు డగు నన్న ॥యేసు॥

1. ఊరు పేరు పరువులు మురువులు మరి – యూడగొట్ట బడినను గాని = కూరిమితో క్రీస్తుడు మాకుండిన – కొదువరాదు గొప్పయు పోదు ॥యేసు॥

2. ఆడికలు తిరస్కారంబులు మా – కవమానము లున్నన్ గాని = తోడు క్రీస్తుడు మాకుండినను త్రోవదప్పము ఓడిపోము ॥యేసు॥

3. తగ్గుపాటులను సిగ్గుబాటులును – తలమీదును వ్రాలినగాని = దగ్గర మా పాలిట ప్రభువుండగ – సిగ్గును బొందము తగ్గున గుందము ॥యేసు॥

4. ఎన్నోన్నో శోధన బాధలు చెల – రేగి మనల జుట్టిన యపుడు = కన్న తండ్రి వలె నోదార్చుచు దన – ఘన వాగ్బలమున దునుమును వానిని ॥యేసు॥

5. మనసు క్రుంగి పలు చింతల చేత – మట్ట బడిన వేళను మాకు = తన వాగ్ధత్తములను జేతుల లే – వ నెత్తి యెంతో సంతస మొసగును ॥యేసు॥

6. తల్లిదండ్రులు విడిచిన గాని – తాను వదల డెప్పుడు మమ్ము = ఉల్లము నెత్తి పిలిచిన వేళ – నోహో యనుచు దరికి వచ్చు ॥యేసు॥

7. అతడుండని పరమండలము ఇక – వెదకిన గాని యగపడదు = క్షితి నాతడు మా మతిని వసించిన – అతులిత సౌఖ్యం బదియే మోక్షము ॥ఇడుగో॥

## 98.

రా – సావేరి తా – అట.

బహుజనము లకటా – సత్యమున కొ–ప్పక పోయిరచట = మహిమోన్నతుండైన– యెహోవ క్రీస్తుని పేర – మహికి వచ్చుట నిజం – బని నమ్మగా లేక ॥బహు॥

1. తొలికాలమందు – యెరుషలేము – పొలిమేరలందు – యూదులు పరిస – య్యులు ప్రభుని యందు – దేవత్వ చి – హ్నాలు మనసులందు = దలపోయలేక ని – ష్ఫలులై దుర్గతి గూలి – రలనాడు నేడట్టి ఖలులెందరో గలరు ॥బహు॥

2. దేవుడీ యిలకు – రాకున్న న – రాళి కొరకు పాపము బోవు – త్రోవెట్లు గలుగు సత్య త్రాణ – మేవిధము దొరుకు = జీవించు నరులు ని – ర్జీవులై చెడియుండగా వారిలో నెవడు – గతి జూపగ ॥బహు॥

## 99.

రా – శంకరభరణము (చాయ: యేసునామమెంతో మధురం) తా – అట.

మన్నింపు దేవా – మన్నింపు ప్రభువా = ఎన్నబడకున్న మా – యన్ని దోషములు ॥మన్నింపు॥

1. సిలువతట్టు – మా తలపుబెట్టు = ఎలమియున్ బలిమియున్ – గలుగ మా కెపుడు ॥మన్నింపు॥

2. యుక్తమైన నీ రక్తధారన్ = వ్యక్తపాపముల మము – ముక్తులు జేసి ॥మన్నింపు॥

3. శిరమునందు – నీ కరములందు = చరణముల గారు నె – త్తురు మాకు గన్పరచి ॥మన్నింపు॥

4. ముదము లెదుగన్ – మా హృదయములను = సదయా నీ సిలువ ద – ర్శనము మా కొసగి ॥మన్నింపు॥

## 100.

### మన బంధువులు.

రా – నవరోజు (చాయ: యేసుక్రీస్తు దొరికినేని) తా – ఆది.

యెహోవా మా తండ్రిగాడ – యేసుడు మా యన్నగాడ = మహిమ గల శుద్ధాత్మా యిట్టి – వరుస[1] దెలిపెం గద మాతోడ ॥యెహోవా॥

1. మోక్షనగరు[2] మా పుట్టిల్లు – ముఖ్య దూతల్ మా స్నేహితులు = సాక్షాత్కారమై[3] యున్నప్పుడు – లక్ష్యపెట్ట మిహ[4] బాధలకు ॥యెహోవా॥

2. అబ్రాహాము దావీదు మొదలై – నట్టి వర భక్తా గ్రేసరులే[5] = శుభముగ మా చుట్టాలైనన్ – హర్ష మిక మా కేమి వెలితి ॥యెహోవా॥

3. పేతురాది సకలాపోస్తుల్ – పేర్మిగల[6] మా నిజ కూటస్థుల్[7] = ఖ్యాతి సభలో మే మున్నప్పుడు – ఘనతలిక మాకేమి వెలితి ॥యెహోవా॥

4. తనువు[8] బలి పెట్టెను మా యన్న – తప్పుల్విడ గొట్టెను మా తండ్రి = మనసులో సాక్ష్య మిట్లున్న – మనుజు లెట్లన్నను మాకేమి ॥యెహోవా॥

5. పరమ విభు[9] జీవ గ్రంథములో – ప్రభుని రక్తాక్షర[10] ముద్రితమై[11] = చిరముగా నుండు మా పేరు – చెరుపు బెట్టెడు వారింకెవరు ॥యెహోవా॥

6. కరములతో[12] నంటరాని – కన్నులకు గోచరము[13] గాని = పరమ ఫలముల్ మా కున్నప్పుడు సరకుగొన[14] మిక్కడి లేములకు[15] ॥యెహోవా॥

---

1.బంధుత్వము 2.పరలోకము 3.ప్రత్యక్షమైన 4.లోకముయొక్క 5.శ్రేష్ఠులైనభక్తులలోపెద్దలు 6.ప్రేమగల 7.సంఘస్థులు 8.శరీరము 9.రాజు 10.రక్తముచేత 11.ముద్రింపబడి 12.చేతులతో 13.అగుపడని 14.లక్ష్యపెట్టము 15.కొదువ / అవసరములకు

## 101.

# మనశ్శాంతియే మహా భాగ్యము.

రా – సౌరాష్ట్ర (చాయ: మనోవిచారము కూడదు నీకు) తా – ఆట

మనసానందము బొందుట కన్నను – మరియే భాగ్యము గల దన్న = అనుమానము లిక – నఖిల సుఖంబులు – దినమొక గడికొక – తీరై యుండు ॥మనసా॥

1. దిటముగ ప్రార్థన యను ఖడ్గము గని – తిరుగు పిశాచము వెరచన్న = పటుదీప్తులు గల – ప్రభు శాస్త్రోక్తులు – బహు సంశయ పం – కము నింకించును ॥మనసా॥

2. సాధు జనోత్తమ క్రైస్తవ సంగతి – సమకూడిన మేలౌ నన్న – శోధన లన్నిటి – స్థిరముగ నోర్చెడి – శుభమతి కన్నను – సుఖమే మున్నది ॥మనసా॥

3. తనువున దానను వానికి దురితము – దగిలెడు విధి గనవలె నన్న = యొనరగ క్రీస్తుని – వధ్యాస్తంభము – గని విశ్వాసము – గట్టిగ – బెంచిన ॥మనసా॥

4. క్షమయు స్నేహము ప్రభుకడ నేర్చిన – శత్రువు లిక భువి లేరన్న = సమదృష్టి జగ – జ్జల గనుంగొను – సత్క్రైస్తవులకు – సాధన మనదగు ॥మనసా॥

5. పరమ దయానిధి క్రీస్తుని బలమున – పాప భరంబులు విడునన్న = పరిశు ద్ధాత్ముని – బంధుత్వంబున – అరమర చీకటు – లన్నియు దొలగును ॥మనసా॥

# భక్తుని వృద్ధాప్యము

## 102.

రా – సావేరి (చాయ: ఉన్నపాటున వచ్చుచున్నాను). తా – ఆట.

సకలేంద్రియములారా – చాల మీ పని దీరె – నిక నన్ను విడిచిపోవుటకు వేళయ్యెన్ = చకిత[1] మృగశాబకము[2] పోలిక – నకట మీచే జిక్కితిని మీ – రిక దొలంగుడు యేసు నా ర – క్షకుడు వచ్చెను నన్ను – గావను ॥సకలేంద్రియములారా॥

1. పంచేంద్రియములారా[3] – బల ముడిగె మీ కిపుడు – వంచన సేయ మీ – వశముగా దికను = మించి మీ రెదిరింపలేరు ద – లంచి చూడుడు దేవ కృపలో – నుంచి నను గదలింప మీకది – కొంచెమగు పని కాదు సుండి ॥సకలేంద్రి॥

2. శ్రవణేంద్రియమా[4] నీదు – శక్తి తగ్గుచు వచ్చె వివిధ వార్తలు దవిలి – విను చుంటి వేంతో = చెవుడు నీకిపు డనుసరించెను – చేవ తరిగెను[5] జరిగి పొమ్మిక – సవినయంబుగ[6] యేసుక్రీస్తు ని – శబ్ద మాలిచెదను ॥సకలేంద్రియములారా॥

3. కనులార మీ వెల్గు – క్రమముగ క్షీణించె – మును జూచు చూడ్కిలో[7] – ముసుకయ్యెనికను = ఘనముగల దేవుని కుమారుడు – తన కృపాసన మిపుడు జూపను – మనసులోపలి కన్ను విప్పెడి – దినము లివె చనుదెంచె[8] జూడుడు ॥సకలేంద్రి॥

4. రసనేంద్రియమా[9] నీ నీ – రసకాల మిదె వచ్చె – విసుకని మాటలను వెదజల్లినావు = వస దరిగి[10] ముతివైతి విపుడో – రసనమా యిక దీరె నీ పని – వెసను[11] నే నిపు దేసు కరుణా – రసము గ్రోలుచు[12] బ్రొద్దు బుచ్చెద ॥సకలేంద్రి॥

5. తను వాద్యంతము[13] మూయ – దగిన త్వగింద్రియమా[14] – నిను సోకునట్టి[15] వ – న్నియు గ్రహించితివి = మునుపు గల వీ జిగిబిగియు నణ – గెనుగదా వ్రేలాడెదిత్తులు – చనుము నీ వెందైన నే నే – సుని స్వరూపము దాల్ప బోయెద ॥సకలేంద్రి॥

6. ఘ్రాణేంద్రియమా[16] నీవు – కడు వాసనల దగిలి – ప్రాణనిలము[17] చేత – బ్రబలితి వికను = నాణెమైనవి విడును దుర్గం – ధముల బాల్చడ బోదు విక నా – త్రాణపతి[18] యగు క్రీస్తుచేతను – బ్రాణ మర్పింతును సుఖింతును ॥సకలేంద్రి॥

7. కడు[19] దవ్వు[20]పయనంబు[21] – నడిచి వచ్చితి నింక – నిడుపు లేదా త్రోవ – నికటమై వచ్చెన్ = నడుమ నడుమ నడ్డపడియెడు – నిడుమ లన్నియు గడిచిపోయెను – జడుతు నా మృతి నదికి నా నా – వికుడు వచ్చెను నన్ను గావను ॥సకలేంద్రియములారా॥

8. వెనుక దీరిన మార్గ – మున కంటె ముందుండి – కనుపించు నా త్రోవ – కఠినమై యుండు ఘన తరంగ ధ్వనులతో భీ – కర మరణ నది పార చున్నది – క్షణము మాత్రము దాని పని యా – వెనుక నావలి యెడ్డు జేరెద ॥సకలేంద్రి॥

9. ఈ సంసారంబునం – దేమి సౌఖ్యం గలదు – ఆశ మాత్రమే గాని – యది చిరము గాదు = యేసుక్రీస్తుడు తండ్రి దేవుడు – భాసురంబగు నిర్మలాత్మయు – పురుషోత్తము తమ దివ్య మగు కృప – జేసి నిత్య నివాస మిత్తురు ॥సకలేంద్రి॥

---

1.భయపడిన 2.లేడిపిల్ల 3.ఐదు ఇంద్రియములు 4.చెలి 5.బలము 6.వినయముతో 7.చూపు 8.వచ్చెను 9.నాలుక 10.బలము 11.త్వరలో 12.త్రాగుచు 13.శరీరమంత 14.స్పర్శను తెలిసికొనుశక్తి 15.తగిలినట్టి 16.ముక్కు 17.ప్రాణవాయువు 18.రక్షణాధికారి 19.మిగుల 20.దూరము 21.ప్రయాణము.

1882సం॥ డిశంబరు నెలలో మధ్య ఒకరాత్రి వేళ పురుషోత్తము చౌధరిగారు తమ చిన్న కుమార్తైయైన మార్తాబర్డరును పిలిచి “అమ్మా కాగితము పెన్సిలు పట్టుకొనరా అని చెప్పి ఒక కీర్తన చెపుతాను వ్రాయుమని” మిగుల హీనస్వరముతో పలికెను. అంతట ఆమె “బప్పా” చెప్పండి వ్రాసెదను అని సిద్ధపడెను. అంతట సర్వేసర్వత్ర మనోహరముగా పురుషోత్తము చౌధరిగారు ఈ కీర్తను ఆలాపించినాడు. ఆమె పెన్సిల్‌తో ఈ కీర్తనను వినుచూ వ్రాసెను.

## 103.

రా – యదుకులకాంభోజి (చాయ: పైనమైయున్నానయ్యా) తా – ఆది

యెహోవా నీ మహిమా స్తవము – యేసుని సుందర మందిరము – ఇదియెంతో నిత్య శుభకరము = సాహసమున క్రై – స్తవాళి తోడను – స్నేహ మమర నీ – శిష్యులు నిపుడీ – గేహమునకు[1] భ – క్తిని జేరిరి నీ – బహుబలము గ – న్పడ దీవించుము ॥యెహోవా॥

1. ఆకాశము నీ సింహాసనము మగు – నవని నీ యడుగుల పీఠముగ – నమరు దేవ నీ కెవ్వరు సాటి = నీ కొరకొక మం –దిర మొనరించుట – కీ కుంభినిలో[2] – నేరికి శక్యము – ప్రాకటమైనను – నీ సద్భక్తా[3]– నీకంబులె నీ నికేతనంబులు[4] ॥యెహోవా॥

2. పరమడంలము లందుండి నీ– కరుణ జల్లి యీ యాలయము – పైని సుప్రకాశమింపవే = తరతరముల క్రై – స్తవ సముదాయములు – విరివిగ నీ మం – దిర భరితుములై – చిరకాలము నీ – సేవ యొనర్పను – వరముల నిమ్మని – నెరి[5] బ్రార్థింతుము ॥యెహోవా॥

3. అందముగాను నిందులో ని – న్నారాధించు ప్రియభక్తుల – డెందములే నీ మందిరములు గా = ముందొనరించుచు – బొందుగ నలుదెస – లందు నుండు నర – బృందబులు[6] దమ – సందియములు విడి – సద్గతి బొందుట – కిందురాను నీ – వింక నొనర్పుము ॥యెహోవా॥

4. పతితాత్ములైనట్టి నరుల – పాప రోగాదులకు మందు – వెదకువారి కీ గృహమున నుండున్ = హితవుగ క్రీస్తుం – డీ గృహపతియై – ప్రతి పాపునకును – సంతతంబును వా – గ్వితతిని[7] బిలుచును – వినయముతో దన – క్షత రక్త మ హౌ – షధ[8] మిడి ప్రోవను ॥యెహోవా॥

5. ధారుణిలో దుర్మార్గుల – పేరైన గుడారంబులలో – జేరియుండు దాని కంటెను = పేరిమి గల యీ – నీ పదనాంగణ[9] – ద్వార పాలక – త్వము మా కబ్బిన – భూరి భాగ్య పరి – పూర్ణులమై వి – స్తార శాంతి మది – సౌఖ్య మొందుదుము ॥యెహోవా॥

---

1.గృహము 2.భూమియందు 3.యోగ్యమైన భక్తులయొక్క సమూహము 4.గృహములు 5.బాగుగా 6.సమూహములు 7.మాటల సమూహముచేత 8.గాయపు రక్తమనెడి గొప్ప యౌషదము 9.ముంగిలి.

1846సం॥ ఆరువేల రూపాయిల వ్యయముతో డాసన్‌గారు శ్రీకాకులంలో చౌకు బజారు వీధిలో ఒక దేవాలయము కట్టించిరి.దీని ప్రతిష్ఠ ఆ సంవత్సరము జరిగినప్పుడు పురుషోత్తము చౌధరిగారు ఈ కీర్తనను వ్రాయగ, రెవ. విలియం డాసన్‌గారు భారతీయుని వలె వస్త్రధారణ మొనర్చి, కాళ్ళకు గజ్జెలు కట్టుకొని సితారా వాయించుచు ఉత్సవముతో బలమెడ యొద్దనుండి వచ్చి ఈ కీర్తనను పాడుచూ మందిరము చుట్టూ ప్రదక్షణ మొనర్చి దాని యుపక్రపణోత్సవము జరిగించారు.

## 104.

రా - నాధనామక్రియ తా - ఆట.

ఏల యీ పాలుమాలిన బ్రతుకుకై వృధా కాలంబు గడిపినావు జీవా - చాల యిహ[1]ఫలరుచులు[2] చప్పరిస్తివి[3] యికనైన - చాలించి గతి దలచుమీ జీవా ॥ఏల॥

1. కడుయేహ్యమగు[4] మాతృగర్భములో నుంచి పుడమి[5]పై బుట్టినావు - నీవు - తొడగు[5] మలమూత్రములలో మిళితమైయున్న[7] పడకపై బొరలినావు - నీవు - యొడలు[8] నీ వశముగాకున్న తరిమక్షకముల దరి బాధించె నిన్నూ - మున్నూ - తడబడుచు నడువ సాగెడు కాలమిడు మది దలచి కడు సిగ్గుపడుమీ జీవా ॥ఏల॥

2. చిన్న ప్రాయపు చేష్టలెన్నెన్ని జూపి నిశ్చింతతో దిరిగినావు - నీవు - చిన్ని పొన్ని వేడుకల బొమ్మల పెండ్లిచేయ సరివారి బిలచి - కలసి - యెన్ని పలు బలుకులు యెన్ని చిల్లర కథ లెన్ని యాట్లాడినావు - నీవు కన్న తలిదండ్రుల యెడ గర్వమగు పరచి యొక దున్న వలె పెరిగితివి జీవా ॥ఏల॥

3. పరువు మురువు గణించి పౌరుషములు బెంచి యౌవన భరము దాల్చినావు - నీవు - యొరుల[9] నిందలకు సిగ్గుపడక పరాంగనల[10] చెర బట్టి దిరిగినావు - నీవు మురికి దేహము పైని మురిసి వన్నెలు దిద్ది దిరిగి గురుజన - దూషకుడవైతివి - జీవా ॥ఏల॥

4. ఆలుబిడ్డల[11] నేటి యతి మోహవార్ధి[12]పడి తేలిమునుగుచు నుంటివి - నీవు - గాలి పడవ విధంబుగా నొరుల వెంటను ధనకాంక్షచే దిరిగినావు - నీవు - కాలు చెయ్యి యాడినన్నాళ్లు యింద్రియ[13] విషయములో లతను[14] జిక్కించినావు - నీవు - తాలిమించుక[15] లేని తాపత్రయములలోన యీలాటి వెతబడితివి- జీవా ॥ఏల॥

5. కడు[16] జరాభార[17] రోగబలాధికముగ గప్పి యొడలు[18]మధమణిగించును - నిన్ను - విడిగాలు దంతములు వినరావు చెవులు కనపడకుండు కనుదోయి[19] - నిన్ను - కుడువ ముడువనులేచి నడువశక్తియు లేని చెడ దోస జుట్టుకొనుచు - నిన్ను - పిడుగు వెలనింతలో వడివచ్చి[20]మృతి నిన్ను కడజేసి మ్రింగిపోవు జీవా ॥ఏల॥

6. బ్రతినన్నాళ్లు దుర్మతివై యనేక దుష్కృతములు లొనరించినావు - నీవు - గతిలేని వేల్పుల బతిమాలుకొని దిరిగి ప్రీతినిష్ఠలాచరిస్తివి - నీవు - మతి[21] దిప్పుకొని నిన్ను మన్నించదగు మోక్షపతి నిప్పుడు గనుగొంటివి - నీవు - దృతంబుగా[22] యేసుక్రీస్తుని పాదములు నమ్మి మితిలేని సుఖ మొందుమీ - జీవా ॥ఏల॥

---

1.లోకము 2.సౌఖ్యము 3.అనుభవించినావు 4.అసహ్యమైన 5.భూమిపై 6.ప్రారంభమున 7.కలసియున్న 8.శరీరము 9.ఇతరుల 10.పరస్త్రీలను 11.భార్యబిడ్డలు 12.మోహమనెడిసముద్రము 13.కన్ను,ముక్కు,చెవి,నాలుక,శరీరముమొ॥లగునవి 14.తీగలను 15.ఓర్పు 16.అత్యంత 17.బరువుగలశరీరము 18.శరీరము 19.కనుచూపు 20.వేగముగావచ్చి 21.మనసు 22.అదరింపబడినవాడు

## 105.

రా - రేగుప్తి తా - ఆట

వినరే యో జనులారా - యీ శుభవార్త - విడువక చెవులార = అనితర[1] ప్రాప్తంబకిల్మిష[2] జన[3]నిధానము[4] స్వర్గ మచటికి - జనెడు[5] వారల కబ్బు సుఖమే - మనుచు మతింజేయంగ వచ్చును ॥వినరే॥

1. విడువరే సంసారము - కడు హేయము[6] - నిడుమల[7] కాకరము[8] - నిస్సారము[9] = తడవేల[11] క్రీస్తుని - దగు దివ్య పదములు[12]- విడువక[13]సతతము - వినుతి[14] జేయుచున్న = గడవలేదెన్నటికి మీకాయొుడయుననుకంచే గస్తులు[15] - గడిచి దివ్యంబైన స్వర్గపు - పుడమి[16] కరిగి సుఖింతురచ్చట ॥వినరే॥

2. తేజోమయ లోకము - నా స్వర్గము - రాజిత[17] సుశ్రీకము - నిశ్శోకము[18] పూజిత మమల మ - ప్పురము కేవల ధర్మ - భాజియై నిర్మింప బడె నీశ్వరుని చేత = నా జగతి క్రీస్తుని యనుగ్రహ- భాజనంబున నక్షయంబతి - తేజమతి పావనము లబ్దం - బై జను ల్వెలు గొందుచుందురు ॥వినరే॥

3. అందునగల దూతలు - జయజయ యిత్యా - నందాభినుత సుక్తులు - మృదులోకోక్తులు[19] = పల్కుచు కొల్వ - నందున భక్తులు క్రీస్త్వా - నందులై కొలువుందు రందు సాధులు నిరతా = నందులై వసియింతురందున - సుందరం బమల ప్రకాశనందుయయము మహాసుఖ శ్రీ - కంద మా పరమ పదవాసము ॥వినరే॥

4. సతతమచ్చట[1] సాధులు - దీప్తి కిరీటాం - చితమస్తక విశిష్టులు - ఘన నిష్ఠులు = నతిభక్తితో నీశ్వ - రాననము జూచుచు - స్తుతిజేతురో దేవ శుభద దయానిధి = సతతమును నీ సద్గుణావళి - నుతి యొనర్పగ నీదు సన్నిధి - నతులితానందమున నుండెదు - స్థితి యొసంగితి వనుచు మ్రొక్కుచు ॥వినరే॥

## 106.

రా - రేగుప్తి (చాయ: యేసువంటి ప్రియబంధుడు) తా - ఆది

కరుణానిధి భక్తపావన త - త్పరు డొకడే మా యెహోవా = దురితాత్ముల కెంతో సంతసమగు - పరమ గురుడొకడె మా యేసు ॥కరుణా॥

1. కడు[1] దిటముగ[2] తను గని పెట్టినచో - నిడుమలు[3] బాపును యెహోవా = చెడిపోయిన దుశ్చరితు[4] తన దరి - జేరిన బ్రోచును[5] మా యేసు ॥కరుణా॥

2. గర్విష్ఠుల బొంక[6] మణచి[7] దీనుకు - గటాక్ష మొసగును యెహోవా = సర్వదా యిహపర సాధనములు తన - జనులకు నేర్పును మా యేసు ॥కరుణా॥

---

(105). 1.ఎల్లప్పుడు 2.పాపకల్మషములేనివారు 3.జనము 4.ఉండు 5.వచ్చు 6.అసహ్యము 7.కష్టములకు 8.నిలయము 9.సారములేనిది 10.అలస్యముచేయక 11.పాదము 12.వదలక 13.ఎల్లప్పుడు 14.స్తుతి 15.దొంగతనముజరుగకుండా 16.భూమి 17.ప్రకాశితము 18.ఏడ్పులేనిది 19.మృదుమైనమాటలు

3. దిక్కులేని కడు దీనుల మొరవిన - దిక్కై యుండును యెహోవా = యిక్కట్లను పెను చిక్కులు వెడలించి[8] - యక్కర[9] గడుపును[10] మా యేసు ॥కరుణా॥

4. తన భక్తుల అమృత ఝరంబై[11] బు - ద్దిని గనుపించును యెహోవా = ఘన వాగ్దత్తము లనుభవింప నె - మ్మమున కొసగును మా యేసు ॥కరుణా॥

5. అంచితమైన[12] మహాకృప ననిశం[13] - బరయు[14] దరిద్రుల యెహోవా = యెంచు కొనిన వార్వెవ్వరొ వారిని - నెన్నడు విడువడు మా యేసు ॥కరుణా॥

## 107.

రా - శంకరభరణము (చాయ: యెహోవా నీ మహిమస్తవము) తా - ఆది

దేవా నీ స్వరూప దాల్చు - దృఢమైన నీ నిజభక్తులకు - జీవామృతము నీ వాక్యము గాదా = భారత భవ్య సుఖామృతులై చిర - జీవముతో నీచెంత వసించెడు - నీ వారలలో నేనొకడుగా జీవించెద కృపచేయవే యేసు ॥దేవా॥

1. దరిలేని సంసార వార్ధి - తరియించుటకు నీ పాదములే - శరణమనుచు నిను నమ్మిన జనులు = ధరణి గల నిర్జనములు తమతమ - సరణిని జని సాగరమున బడి తత్ - స్వరూప మొందిన కరణిని నీలో - వరభక్తులు నీవలె దివినుందును ॥దేవా॥

2. మనుజాత్మల రక్షించు కొరకు - మరణమొంది తిరిగియు లేచి - మహిమతో పరమందున్నా విపుడు = ఒనరగ భువికిక నొకపరి వచ్చెద - నని బలికిన నీ యమూల్య వాక్యము - లను నమ్మికతో కనిపెట్టెడి నీ - జనులను రక్షింపను వెసరావె ॥దేవా॥

## 108.

రా - శంకరాభరణము తా - అట

ప్రవచనములెల్లన్ - క్రీస్తుని మృతి యం - దవి నెరవేరెన్ = భువియందు నా విభుం - దవతరింపక ముందే - వివిధ కార్యములన్ని - వివరించి వ్రాసియున్న ॥ప్రవచ॥

1. ఆదియంత్యములు - లేనట్టి య - నాది పురుషుండు - మేదినిలోని - యూదా దేశమున - బేత్లెహేమనెడి - యొక పట్టణమున = యూదులకు రాజుగా -నుద్భవించునటంచు - మోదంబునను మీకా - యును దెల్పెనదియయ్యె ॥ప్రవచ॥

2. పగబట్టువారు - నిర్మూలముగ - తెగవ్రేయు కొరకు - నిష్కారణ - ముగ లేచినారు - లెక్కకు చాల - మిగిలియున్నారు = తగనిట్లు తొల్లి చ - క్కగ దెల్పె దావీదు - యొరిగినదియు నెరవేరె - యూదా నివహము చేత ॥ప్రవచ॥

3. దురాహంకారమున - చుట్టుకొని యూ - దులు శిలువపైని - క్రీస్తుని వేసి కరపాదములకు - మేకులు గ్రుచ్చి - పరిమార్చుటయును - = మరి ప్రక్కపోటును - సరిగా దావీదు జ - కరియా వ్రాసిరి తొల్లి - నెరవేరెనవి యెల్ల ॥ప్రవచ॥

## 109.

రా - శంకరభరణము (చాయ: సుఖమిచ్చెగదా) తా - అట

విశ్వాధిపతి యేసు - యిటు వచ్చి మా - విన్నపమాలించు - నశ్వరము[1] లిహ[2] సుఖములన్నియు - నవకుసుమ సమమై వెసంజను - శాశ్వతానందంబుగల పర - సౌఖ్యములు మాకొసగి బ్రోవును ॥విశ్వాధిపతి॥

1. కనికరమునజూచి - మా మదిలోని - యనుమానముల ద్రుంచి = అనిశంబు[3] నీ పాద - వనజంబులను[4] భక్తి - వినయంబుతో గొల్చు[5] - పని మాకు నేర్పించి = అనుభవాంచిత శుద్ధ[6] విశ్వా - స నిశితాయుధములనొసగి[7] మా - తను[8] మనో[9] వాక్యములు నిన్నే - యనుసరించు కొనంగ జేయుము ॥విశ్వాధిపతి॥

2. మృతిబొంది తిరగిలేచి - నీ శిష్యుల కి - చ్చితివి చక్కని సాక్షి = మతిలోన[10] నిన్ను న - మ్మని తోమాసునకు నీ - క్షతములు[11] జూపించి - యతిపాతములు మాన్పి = ప్రతిహతాత్ములు[12] గాక యెవరీ - క్షితిని[13] జూడక నన్ను నమ్మిన - నతులితంబగు మోక్ష భాగ్యో - న్నతులు వారలెయని బలికితివి ॥విశ్వాధిపతి॥

## 110.

రా - ఆనందభైరవి తా - అట

సంకటములు రెండులేచెను - భూలోకమెల్ల - సంక్రమించె మ్రింగివేసెను = హంకృతియు మమత్వమును ని - రంకుశముగ జోడుగూడి - సంకరముగ జగముజేసి - కింకరత్వముక నమర్చె ॥సంకటములు॥

1. వాని బారిబడని మనుజుడు - యీ పుడమిలోన - గానరాడు మరియు పుట్టడు = మానసమున క్రొత్తజీవ - మును క్రైస్తవులైన నా ప్ర - ధానరిపులతోడబోరి - గ్లానిబడుచునుందురకట ॥సంకటములు॥

2. గెలుపుగోరి పోరు భక్తులన్ - ఆ ప్రభువుజూచు - యెలమి నిచ్చు తనదు సూక్తులన్ = పలు తెరగుల క్రింద మీదు - బడుచునైన తుదను యేసు - బలము కలిమి వలన రిపుల బాపి ముక్తి బడయగలరు ॥సంకటములు॥

3. దేవదేవ నీవు వాటిని - బ్రతుకంగ నిచ్చి - నావు గనుక నిలిచె జగతిని = భావశుద్ధి చేసి నీదు - భక్తులకు తదీయభయము - బోవునట్లొనర్చి మమ్ము - గావ వేదయాపయోధి ॥సంకటములు॥

---

(109). 1.నశించినది 2.లోకము 3.ఎడతెగని/ఎల్లప్పుడు 4.తామరపువ్వువంటిపాదములు 5.పూజించు 6.పరిశుద్ధమైన 7.మిక్కిలివాడి చేయబడిన ఆయుధములనుయిచ్చి 8.శరీరము 9.మనసు 10.మనస్సు 11.గాయమునొందిన 12.మనసుచెడిన ఆత్మలుగలవారు 13.భూమిమీద

## 111.

రా – సురట తా – అట

శుభవర్తమానము శోధింపరయ్య – ప్రభుయేసు పొందు సంపాదింపరయ్య ॥శుభ॥

1. ఆది గ్రంథము హెబ్రీయను భాష నయ్యెన్ ఆ మీదట గ్రీకు భాషాంతరమయ్యెన్ సాది నింగ్లీషు భాషను తర్జుమాయెన్ – మేదినంతటికి బల్మేలందు నయ్యెన్ ॥శుభ॥

2. అమెరికా ఆఫ్రికా ఆసియా భాషన్ – క్రమముగ నాసామ కాశ్మీర భాషన్ – అమరు కర్నాట ఒరియా చైనా భాషన్ – ప్రమదంబుగా జేర్చబడి తర్జుమాయెన్॥శుభ॥

3. బంగాళ నేపాళ పంజాబి భాషన్ – రంగౌ మహారాష్ట్ర రాజ్యసంభాషన్ – శృంగారమైన తెనుంగు సుభాషన్ – మంగళముగ తర్జుమా చేయబడియెన్ ॥శుభ॥

4. మళయళ మగధ జర్మని దేశ భాషన్ – సలలితముగ హింది సంస్కృత భాషన్ – వెలయు కొంకణ ద్రావిడ అరవభాషన్ – చెలువుగా తర్జుమా చేయంగబడియెన్ ॥శుభ॥

5. మహి ద్వీపములలో నిర్మలముగనున్న – మహిత భాషల తర్జుమా జేసిరన్న – విహితమీ శుభవార్త విన నమ్ముకొన్న – బహు జనంబులు మోక్ష ప్రాప్తులైరన్న ॥శుభ॥

6. యిపుడు విచారించుడీ గ్రంథమునను – ఉపదేశ మెటులున్న ఉచితంబుగాను – నిపుణత్వమున దీని నేర్చుకో వలెను – విపరీత కథలన్ని విడువండి యికను ॥శుభ॥

7. మది ధర్మశాస్త్రము మన్నింపరయ్య – అది సత్యమని క్రీస్తు నాశింపరయ్య – తుది ఘోర నరకాగ్ని తొలగి పొండయ్య – ముదమొప్ప చిర మోక్ష పరమొందరయ్య ॥శుభ॥

## 112.

రా – శంకరభరణము తా – అట

శాంతియొనర్చున్ – భక్తుని చిత్త – శాంతి యొనర్చున్ – దేవుడు శక్తి – వింతగా నిచ్చున్ = సంతోషమున తమ – శక్తికొలది గాను – స్వాంతమొసగి భక్తి – సలిపెడు వారలకు ॥శాంతి॥

1. బలహీన భక్తి – తైలములేక – వెలిగించు వత్తి – చందముననే – దొలగు తత్కాంతి యటుల బుద్ధి – బలము సమాప్తి = తలపోసి తనయందు – గల న్యూనతలు గాంచి – యెలమి ప్రార్థన సేయ – నిచ్చు క్రీస్తుడు శక్తి ॥శాంతి॥

2. కన్నుల మ్రోల – లోకము జూపు చున్నది లీల – సైతావేచి – యున్నాడు మూల – చెడుమతి వెదకు – చున్నది వేళ = యెన్ని శోధనలు చు – ట్టున్నవి జీవునికి – తిన్నగా ప్రభు బ్రోవ – కున్న సుఖము గలదె ॥శాంతి॥

## 113.

రా - యదుకులకాంభోజి తా - ఆది

పైనమైయున్నానయ్యా నీ - పాదాంబుజముల[1] సన్నిధికి - ప్రభు యేసు నాతో నుండవే నీవు = దీనుడ భవ[2] దా - దీనుడ నను గృప - తో నడిపించు మె - దుటనదె సింహ - ధ్వానముతో[3] మృతి వచ్చుచున్నది - దాని భయోత్పా- తము[4] దొలగింపవె ॥పైనమై॥

1. సరణిలో[5] నే బోవునపుడు - శ్రమ లెన్నెన్నో చనుదెంచి నా - పరుగు కడ్డముగా నిలుచునేమో = మరణపు ముళ్లను - విరుచుటకును ద - ద్దురవస్థలు వెస - దొలగించుటకును - గరుణానిధి నా - సరస నుండుమీ - శరణాగతునకు[6] - మరి దిక్కెవ్వరు ॥పైనమై॥

2. దేవా నీ దక్షిణ హస్తముతో[7] - దీనులను బట్టెద వెరవకుడను - నీ వాగ్దత్తమున కిది సమయంబు = ఆ వచనము నా - జీవాధారము - దైవము తల్లియు దండ్రియు దాతవు - నీవే సర్వము - నిను నమ్మితి నా - త్రోవ ప్రయాణము - తుదముట్టించుము ॥పైనమై॥

3. పొందుగా నీ భక్తియందు - డెంద మానందించు నపుడు - నదియము లెన్నెన్నో చనుదెంచి - తొందర నిడు[8] నా - త్రోవను తద్గా - ఢాంధత మిశ్రమ[9]- లణగించుటకై - సుందరమగు రవి[10]- చందంబున - నా ముందట నడువవే - ముదమున ప్రభువా ॥పైనమై॥

4. కాలంబయ్యెను రారమ్మనుచు - నీల మేఘాకృతితో[11] వచ్చి - కాలదండము జిరజిర ద్రిప్పుచు[12] = చాల భయానక[13] - లీలన్ మృత్యువు - మ్రోల[14] నన్నిలిచిన వేళను దాలిమి[15]- దూలి చనుంగా - బోలు భవత్కరు - ణాలింగన[16]సుఖ - మత్తఱి[17] నొసగవె ॥పైనమై॥

5. నీ దివ్య రూపధ్యానంబు - నిర్మలాత్మాంతర సౌఖ్యంబు - నా దేవుని ప్రేమామృతసారంబు = నీ దాసుని కవి - నిరత మొసంగుచు - నా దారిని గల - సేదలు దీర్పను - నాదియు మధ్యము - నంతములేని పు - నాదులుగల నీ - సౌధము[18] జేర్పవె ॥పైనమై॥

6. ఎండమావుల కీడైనట్టి[19]- యీహ సౌఖ్యములు త్వరగా బోవు నీ - నిండు దరుగని నిత్యానందంబు = దండిగ నీయం - దుండిన వారి క - ఖండామృత సౌ - ఖ్యము లిచ్చెదవట - తండ్రీ భవ దు - త్తమ పురుషోత్తము నీ - వుండిన చోటనె - యుంచుము చాలును ॥పైనమై॥

---

1.పద్మములవంటిపాదములయొక్క 2.నీకులోబడినవాడు 3.సింహగర్జనముతో 4.భయమువలనకలుగు ఉపద్రవము 5.త్రోవ 6.శరణుజొచ్చినవానికి 7.కుడిచేయి 8.కలిగించు 9.ఆగొప్పకటికచీకటియందు 10.సూర్యుని 11.కారుమబ్బులఆకారముతో 12.గిరగిరమని 13.భయమునుకలిగించునట్టి 14.ఎదుట 15.ఓర్పు 16.నీకరుణచేత నన్నుకౌగిలించుకొనగా కలుగు సౌఖ్యము 17.ఆసమయమున 18.గృహము 19.సమానమైనట్టి

## 114.

రా – మోహన తా – ఆది

ఒక్కసారి జూపవో యేసునాథ – మ్రొక్కిసేవించెద – దిక్కుమాలినట్టి దీనులకు నభయంబొసగు నీ చక్కదనమగు పాదపద్మములు ॥ఒక్కసారి॥

1. నరుల పాపమందు బొరలజేసెదు సైతాను – శిరము ద్రొక్కిన పాదపద్మము లేవి – మరియ కంటనీరు జలము గావించి ముద్దిడి – కురుల దుడిచిన పాద పద్మములు లేవి – వరుస పాద రక్ష విడ తగనటంచు యోహాను – నెరుకజేసిన పాదపద్మము లేవి – తరణినున్న శిష్యులరుదుగా జూడంగ – శరధిని పరగ నడిచిన పాదపద్మము లేవి ॥ఒక్కసారి॥

2. ధర దమస్కనే పురము త్రోవను బోవు – పౌలుకు దర్శనమిడిన పాదపద్మములేవి – గురుతురిక్కవల్ల నెరిగి పండితు లరిగి – భక్తిన గొలచి మ్రొక్కిన పాదపద్మములేవి – దొరలి సిల్వ మేకు దూసి నెత్తురు ధారగారెదు – దురిత హరమగు పాదపద్మము లేవి – మరణ మొంది లేచు గురుతు శిష్యులు నమ్మగాయము – లెరుక జూపిన పాదపద్మము లేవి ॥ఒక్కసారి॥

3. పరమ దేవ వాక్య మొరుల బోధించుచు నుపదే శాంతరము – దిరిగిన పాదపద్మము లేవి – గౌరతలేని పాతకులకు నెల్లను దిక్కుగా – దొరికియుండిన పాదపద్మము లేవి – మరలి తన సఖుల కెరుక జేయుచు మింట త్రోవను – పరమున కేగిన పాదపద్మములేవి – శరణు దూరినట్టి నన్నాదరణ జేయుచు – దరిని చేర్చిన పాదపద్మములేవి ॥ఒక్కసారి॥

(ఈ కీర్తనను ఆయన వృద్ధాప్యమునందు మంచముమీద కూర్చొని రెండుచేతులు జోడించి తన్మయముతో తరచుగా ఆలపించేవారు.)

## 115.

రా – ఆనందభైరవి (చాయ: విజయంబు విజయంబు) తా – అట

కరుణింపగదె తండ్రి – పరమాత్మ యేసుని – చరణమేగతి మాకు = దురిత పారావారమునబడి – దరి యెరుంగని నరవిసరముల – కరుణతో రక్షించుటకు నిల – కరుగుదెంచిన దేవుడా మము ॥కరుణింప॥

1. సర్వజ్ఞ సర్వేశ – సర్వాంతర్యామి యో – సర్వ సృజన పాలకా = సర్వ సంహరణత్వమనదగ – చారుషాడ్గణ్యములుగల నీ – వుర్వి నరావతారమెత్తుట – కుచితమా యిది – చోద్య మహోహో ॥కరుణింప॥

2. ఇరుపార్శ్వములవాడి – మెరయు నీ వాక్యమను – కరవాల మొసగుమయ్యా = తరతరములగు – మా దురేచ్ఛల – నరసి వాటిని నరికివేయను – గురుతరంబగు నీ బలము మా – కరములకు నందీయవే ప్రభు ॥కరుణింప॥

## 116.

రా – కాంభోజి తా – ఆది

అట్టెలు[1] బెట్టకు మనస – విడ – గొట్టకు యేసుని సరస – బిట్టుగట్టు వేగమున్ పరు – వెట్టకు గుణహీనమునన్ దిట్టముగా నీ దేవుని వాక్యపు – కట్టు కొప్పి ప్రభు – కార్యము జేయుము ॥అట్టెలు॥

1. అటునిటు జూచెద వేల – నొ – క్కట స్థిరతను[2] గొన వేల – చిటము సేపు శోధించు – నీ – కుటిల[3] మెల్ల[4] – గనిపించు కటకట యను నీ – కావర[5] గుణముల – దిట మణంచి నీ – పెటెకు తనము నిడు ॥అట్టెల॥

2. పరిశుద్ధాత్మను నీవు – పలు – మారు బార దోలేవు – సరిసరియా యని నీతో – నే – దరము[6] జేసెదవు యెంతో ఆరడి[7] బోవక – తారుమారు విడి – చేరవె క్రీస్తును దారిదెల్పు మని ॥అట్టెలు॥

3. మంచిది గాదది సుమ్మీ – విని – పించెద ప్రేమతో వినుమీ – మించబోకు ప్రభు నాజ్ఞ – గురి – యుంచి బ్రతుకు మది ప్రజ్ఞ[8] అంచితముగ[9] నిను – పొంచి పిశాచుడు – వంచనతో – బో – దించుటలను విని ॥అట్టెలు॥

4. మంటి ఘటము[10] యిది సుమ్మీ – ని – న్నంటి యున్నదని గనుమీ – పెంటకైన సరిరాని – యిటు – వంటి కళేబరబూని[11] – వింటూ తింటూ – విడచే వేళను – ఒంటరివై బహు – తంటాల్[12] బడుదువు ॥అట్టెలు॥

5. వదలకుమీ సాధనముల్ – ముద – మొదవ జేయు నయపదవుల్ తుదవరకు యేసుని పదముల్ – నీ పథి నడిపెడి రవి[13] జ్యోతుల్[14]– నిదుర మత్తుతో – నను బెదిరించుచు నిదిగో యదిగో – యిపుడనెపుడెయని ॥అట్టెలు॥

## 117.

### క్రీస్తు గాక గతి లేదు.

రా – మధ్యమావతి తా – త్రిపుట.

ఇక నేమి గతి యున్నది – మానవులారా – యిక నేమి గతి యున్నది – పాపుల కోస – మిక నేమి గతి యున్నది = యొకడైన పుణ్యాత్మ్ముా – దుర్వి లేదని ముందె – ప్రకటించి దావీదు – పల్కె వేదము నందు ॥ఇక నేమి॥

1. ఇల రక్షకుడు లేకను – గొఱ్ఱెల మంద – లిల జెల్లచెదు రాయెను = పులుల బోలిన దైవ – ములు గురువులు పెక్కు – గల రేల వారు సద్గతి జూప జాలదు ॥ఇక నేమి॥

2. దురితము లణగింపగ – బాపుల నెల్ల – దరిజేర్చి బ్రతికింపగ = పరమేశ్వరుడు తన – వరపుత్రుడుడగు క్రీస్తున్ –ధర కంపెనయ్యేసు – శరణు జొరకయున్న॥ఇక॥

---

(116). 1.అడ్డము 2.స్థిరముగా 3.మోసము 4.మొత్తము 5.మదము 6.దరహాసము 7.ఉత్సాహము 8.బుద్ధి 9.తగినది 10.కుండ 11.శరీరముదాల్చి 12.బాధ 13.సూర్యుడు 14.చంద్ర నక్షత్రములు

**118**.

రా - పంతువరాళి తా - ఆది

ఆహా యీ చెడ్డ హృదయ - మణచ దుష్కరము - యెహోవా యెడల భయమొక - యించుకైన నుంచబోక - సాహసమున పాపము లతి - శయముగా నొనరించబోవు ॥ఆహా॥

1. ఇది కూడ తగదు మాను - మికమని మాటికి - నెదురుగ జనుదెంచి[1] గదుము[2] - హృదయపు సాక్షికిన్ - బెదరక లోబొదలు కొనుచు - నెదిగెడు దుర్విషయల[3] తల - తుది[4] వదలక ముదమున నపద[5]- పదమని దుష్క్రియల[6] గూడు ॥ఆహా॥

2. మసిబొగ్గుల మూట కొరకు - మాణిక్యమొకటి - వెస[7] మసలక[8] నిచ్చునట్టి - వెఱ్ఱి నరుమాడి పసలేని దురిచ్ఛలు[9] నను - కొసరి[10] యొసగెడు[11] మది - వశమయి నా నెమ్మి విడిచి - దొసంగులు బడి విసికినాడ ॥ఆహా॥

3. నిలుకడగల చోట నిలుపు - నిలువుమని పిలిచి - విలసిత[12]సువిశేషవాక్య[13]- ఫలములను జూపి - పలుమారు నా కనుగొలుకుల[14] - జలములొలక[15] బ్రతిమాలిన - కిలకిల నగి[16] మొగము[17] ద్రిప్పి - తలపున గల త్రోవబోవు ॥ఆహా॥

4. ఆగణితమగు సొగసులుగల - యుద్దంబనెడి - జగమున[18] నా మొగము నెదుట - నొగి[19] నిలువబెట్టి - తగిన వేడ్కలగు పరచుచు - వగలు మిగుల దగుల జేసి - యెగువ దిగువ గానని యని - నెగులు వలను తిగిచి యీడ్చు ॥ఆహా॥

5. తరతరము లయిన శరముల - బరపి పిశాచి - యెరకలు నాటంగ నేసి - యేసి పడజేయు - గరువపు తన సరదారుని - తరుపు నెరపి గరపించిన - దురిత చరిత గుణముల నా - దరికి దుర మొనర బనుచు ॥ఆహా॥

6. ఇక నా యొక్క బల విహీన[20] మెద[21] - నిశ్చయించి - యకటయని నిట్టూర్పులు న - ధికముగ విడిచి - తుకతుక జీవమున యేసుతో ర -క్షకుడా నను - విడు - వక వాను కావు మని వే - డు కొనిన గరుణించి పెంచె ॥ఆహా॥

7. గతివిరహితులగు[22]పాపుల - కాపాడ క్రీస్తు - మృతినొందిన సిలువతట్టు - మెడనెత్తి చూతు - ప్రతి దివసము నిది నా సు - వ్రతము[23] మతము హితమటంచు - మతి దృఢంబుగొను తరి తన - చతురతల నణంచు కొనును ॥ఆహా॥

---

1.వచ్చి 2.గద్దించు 3.చెడువిషయములను 4.చివరవరకు 5.ఆపద 6.చెడ్డపనులు 7.వేగము 8.మందము 9.చెడుకోరికలు 10.ఇంకా 11.ఇచ్చునట్టి 12.ప్రకాశించు 13.మంచిసువార్తవాక్యము 14.కనులవెంట 15.నీరుకార్చగా 16.అపహసించి 17.ముఖము 18.లోకమున 19.కత్రనునిలువుగానిలువబెట్టుట 20.హీనమైన 21.మనసు 22.దారితెలియనివారికి 23.దీక్ష

## 119.

### అపోస్తులుల పరిచర్యలు

రా – యదుకులకాంభోజి                                                    తా – ఆది

వినరయ్యా యాపోస్తుల నాటీ వృత్తాంతము[1] కొంతదీని ననుసరించునట్టి కథలెల్లను జెప్పెద ప్రీతితోడ[2] ॥వినరయ్యా॥

1. ప్రేమలంతంతకు సభలోన పెచ్చు పెరిగెనూ – తమ తమ భూములాస్తులమ్మి మోదంబున[3] పంచుకొని తినిరి ॥వినరయ్యా॥

2. యేసునామ యెరుషలేము వీధులలోనా – వారలు జేసిరి ప్రకాశము విశ్వాసముగ బహుళాద్భుతములతో ॥వినరయ్యా॥

3. పుట్టు సొట్టవాని[4] పరుగు వెట్టజేసిరి – వారలు ముట్టుకొను మాత్రమున రోగంబులు బాసిరి[5] జనులు ॥వినరయ్యా॥

4. దబ్బర[6] మాటలాడబోయీ దంపతు లిరువురూ – వారల నిబ్బరంబగు వాక్య మెదుట నిమిషములోనే మరణంబయిరి ॥వినరయ్యా॥

5. మరణమైన వేరొక స్త్రీని మరియొక పురుషుని – వారలు మరలి జీవస్థులుగా[7] జేసిరి పరిశుద్ధాత్ముని వరబలములతో ॥వినరయ్యా॥

6. వరుస ప్రధానార్చకాది వర్గంబులచేత – వారలు విరిచికట్లు కొట్లు నానావిధమైన బహు పాట్లు పడిరి ॥వినరయ్యా॥

7. దూతలొక్కొక వేళను వారికి తోడు వచ్చిరి – శత్రుచేతినుంచి విడిపించుటకు భీతి మాన్పి దిటమిచ్చుటకు ॥వినరయ్యా॥

8. ప్రభు నామముకై కొందరు చాలాచోట్ల హతులైరి – కొందరు శుభమగు వార్త నన్య దేశస్థులలో ప్రకటించుటకు చనిరి ॥వినరయ్యా॥

9. పౌలనే యింకొక ప్రేషితుడు[9] ప్రభు నామము కొరకు – చెప్పగా జాలనట్టి శ్రమలను బొంది సంఘంబులు మిక్కిలి సమకూర్చెను ॥వినరయ్యా॥

10. మత్తే యూదులు మరియు ప్రేషితోత్తమ కార్యములు – యింక నుత్తరములు ప్రత్యక్షముతో నొప్పు సువిశేషం బిదె చదువుచు ॥వినరయ్యా॥

11. పాపాత్ముల రక్షించను బిల్చె ప్రభుని వాక్యమూ – ఎంతో తీపి వీనులను[10] జొచ్చె దీనచిత్తులగ వారందరు ॥వినరయ్యా॥

---

1.చరిత్ర /కథ 2.ఇష్టముతో 3.సంతోషముతో 4.కుంటివానిని 5.విడిచిపోయినవి 6.అబద్ధము 7.జీవముగలవారినిగా 8.వెళ్ళిరి. 9.పంపబడినవాడు 10.చెవులు

**120.**

## ప్రభువు పై దుష్కర్యము చూపుట

రా – ధన్యాసి (చాయ: ఎవరు భాగ్యవంతులౌదు) తా – ఆది

ఓహో యన్నలార యీ దు – స్సాహసము[1] మీ కేటికి – దేహాత్మలను[2] పుట్టించిన మీ – దేవుడగు ప్రభువు యేసు నెడల ॥ఓహో॥

1. అలుగనేల క్రీస్తుపై మీ – తెలివిలేని యాత్మలందు = బలమైనట్టి కొండం దొలచి – పడద్రోయను చీమలకును వశమే ॥ఓహో॥

2. కండ్లగానకుండ చెడ్డ – కారు మాటలాడెదరు = ముండ్లను దన్నబోవునట్టి – మూర్ఖులకేమి మేలు గలదు ॥ఓహో॥

3. చెడ్డ పాపాత్ముల నందరిని – శిక్షచేయుట ధర్మమైనను = దొడ్డ[3] ప్రభువే యడ్డుపడి మీ దురింతబులు[4] పరిహరింపవచ్చె[5] ॥ఓహో॥

## నరరూపు దాల్చి ధరలో తిరిగిన ప్రభువు

**121.**

రా – శంకరభరణము (చాయ: పరిశుద్ధ పరిశుద్ధ పరిశుద్ధ) తా – అట.

నరరూపుదాల్చెను – నజరేయుడగు యేసు – పరిశోధింతము రారె – ధరణి జనులార = నిరుపమానందుండు[1] – నిఖిలాంతరాత్ముండు[2] – పరమ పావనుడు స – ద్గురు రాజేశ్వరుడీతడు ॥నరరూపు॥

1. నరులలో గర్వాంధ[3]– నయనులౌ[4] కొందరు – గురువులున్నను మంచి – గురువులే లేరు = నరజాతి ఘోర దు – స్తర[5] పాపభారంబు – భరియించి రక్షించు – గురువేడి చూపుడి ॥నరరూపు॥

2. మనుజులందరు పాప – మాలిన్యమును బట్టి – రనుటకు సందేహ మణు వంతలేదు = కనుజూపు లేని యం – ధునికి వేరొక గుడ్డి – మనుజుడే రీతి త్రో – వను జూపగా నేర్చు ॥నరరూపు॥

3. పాపంబు లెడబాపు – ప్రాయశ్చిత్తము చేయ – నోక సత్పుణ్యాత్ము – డీ పుడమిలేడు[6] = శాపంబుచే నిరయ[7] – కూపంబు జొరబోవు – పాపాత్ములను బ్రోవ – ప్రాణ మొసగు నెవడు ॥నరరూపు॥

---

(120). 1.సహింగూడనది 2.శరీరమును,ఆత్మను 3.మంచి 4.పాపములను 5.పోగొట్టనువచ్చెను.

(121). 1.ఆయతో పోల్చదగినవాడు ఎవడులేడు/సాటిలేనివాడు 2.సర్వములోఉండువాడు 3.గర్వముతోకూడిన అంధత్వముగల 4.కన్నులు 5.తరింపగూడనిది 6.భూమిమీద 7.దుర్గతి లేదా నరకము

## 122.

రా – ఫరజు తా – అట.

నిను దేవుం – డనుట కొక సం – దేహమును లేదు = మన్నుపై[1] బహు జనులకీ మ – ర్మంబు[2] దెలియదు గాని యేసు ॥నిను॥

1. జలమును ద్రాక్షారసంబుగ – తొలుత[3] జేసెడు నీ మహాద్భుత – మెలమి జూచిరి గాని కనులకు – వెలుగు లేదయ్యెన్ = వెలికి[4] నీ నరరూపు మాత్రము – తెలిసికొనిరే గాని సద్భ – క్తులకు గన్పడు నీ మహా మహి – మలుగన్ పెర[5] వారి కబ్బున్ ॥నిను॥

2. మరణమగు లాజరుని నీదగు – మాటతో జీవిపంజేసెడి – వరమహాద్భుత మెల్ల వారికి – దరిశనంబయ్యెన్[6] = పరమ కారుణికోత్తమా[7] గురు – వరా దేవుడవైన నీయెడ – దురభిమానము గలుగు యూదుల – చరితమే మన వచ్చు నహాహ ॥నిను॥

3. వైరమున[8] బహుజనులు గెత్సెమ– వనములో కనిపెట్టి – నినుబట్టు కొనుటకు – జేరినప్పుడు వశముగాకను – క్షితిపయిన్[9] బడిరి = భూరి[10] భవదీయ[11] ప్రకాశత[12] – వారి కన్నులు గప్పినప్పుడు – పార కరుణను నీకు నీవే – పట్టువడుటకు నిచ్చుకొంటివి ॥నిను॥

## 123.

రా – ముఖారి (చాయ: విజయంబు విజయంబు విజయంబు) తా – అట.

సిలువ వేయబడిన – శ్రీ యేసు ప్రియమెంతో – తలపోయగదే చిత్తమా[1]= కలుషాత్ములా ప్రభుని – కరపాదములలో[2] మే – కులు గ్రుచ్చు తరివారి – కొరకు ప్రార్థించెను ॥సిలువ॥

1. తులువలైన[3] పరిస – య్యులు యూదులతనిపై – పులుల భంగిని[4]జూచిరి = బలవన్మృత్యువు[5] తనకు – దెలిసి దుష్టుల వెంట – బలియర్పణకు గొర్రె – వలె మౌనమునబోయె ॥సిలువ॥

2. ఆకాశమున దేవు – డవనిలో[6] నరజాతి – ఈ కష్టముల నిచ్చిరి = ఏకాకియై[7] దిక్కు – లేక నీ రక్షకుడు – నీ కొరకు మృతి బొందె – నిజమిది నిజమిది ॥సిలువ॥

3. ఇను[8] డంధకారమ – య్యెను భూమి వణికెనా – తనిపాట్లు గను వేళను = మనసు చెడ్డది దాని – పని మంచి గాదు – నిను జూడ బోక క్రీ – స్తుని ప్రేమగని పెట్టు ॥సిలువ॥

---

(122) 1.భూమిపై 2.జీవస్థానము 3.మొదట 4.దేహముయొక్కబయటప్రదేశము 5.తేనెపట్టు 6.కనుపించినది. 7.కనికరముగలవాడు 8.విరోధమున 9.నేలపై 10.బంగారుమయమైన 11.నీదగు 12.ప్రకాశమున

(123) 1.మనస్సున 2.చేతులలోపాదములలో 3.కుత్సితుడు 4.విధము 5.బలవంతమైనమరణము 6.భూమిపై 7.ఒంటరిగా 8.సూర్యుడు.

## 124.

రా – కళ్యాణి తా – ఆది.

దయానిధి – దయయేదీ = ప్రయాసపడు మో – క్ష యాత్రికుల కా – త్మ యీవు[1] లొసగెడు నియంత్రితుడవో ॥దయానిధీ॥

1. ధరిత్రిలో[2] – నీ చరిత్రలో = పరోపకారివై బ – ధిరాంధ[3] మూక వివి – ధ రోగులను స్వస్థపరచినాడవు ॥దయానిధీ॥

2. అనంతము – నీదు శాంతము = అనేకమగు వ్యధ[4] – లనిచ్చు కుజనుల[5] – దయన్ క్షమించెడు మన: ప్రకాశివి ॥దయానిధీ॥

3. పవిత్రము – నీదు రక్తము = వివేకమున పా – పవహ్ని[6]గన్గొనె – డు వారి కది యమృ – త వారి యట్లగు ॥దయానిధీ॥

## 125.

రా – ఫరజు తా – ఆది.

మూఢతములగు – వారికన్నులు – మూయబడె నకటా = రూఢిగా పరమాత్ము చర్యలు – ఋజువు పరచిన తెలియజాలరు ॥మూఢతములగు॥

1. పుట్టుగుడ్డికి కన్నులిచ్చుట – మరి దురాత్మల బారదోలుట – రొట్టెలైదిటి నైదు వేల్మ – ర్త్య లకు తిననిడుట = ఇట్టి ప్రభు కార్యములు జూచియు – నితడు కేవల నరుడు మరియా – పట్టియని యోసేపు సుతుడని – పరిసయ్యా యూదులు గొణిగి సణగిరి ॥మూఢతములగు॥

2. కడలి పొంగణంచుటయు నె – క్కుడు తుఫానును నిలుపుటయు చచ్చెడు శవంబులోన జీవము – చేర్చి లేపుటయు = కడిది యద్భుత కార్యములు తమ – కనుల జూచియు జూడనట్లుగ – చెడుగు యూదులు ప్రభుని యెడ స్మృతి – చెడి వృధా జల్పనము లాడిరి ॥మూడతములగు॥

## 126.

రా – ఆనందభైరవి (చాయ: యెహోవా నా మొర) తా – ఆది.

తవాంఘ్రీ దాస్యము నొసంగవే – భ – క్తవత్సలా మమ్ము గావవే = భవాంబు నిధి విష – య వీచికలు పొర – లి వచ్చెనవి యణ – పవే ప్రభో ॥తవాంఘ్రీ॥

1. మనుష్యులకు బొదివె పాపము – యా – ది నరుడు దీనికి సమూలము = అనూన దురితము – లణంచుటకు యే – సు నాధ నీ అవ – ని నవరించితి ॥తవాంఘ్రీ॥

---

(124)1.సదుపాయములు 2.భూమిలో 3.గుడ్డివారికి 4.బాధలపెట్టు 5.కుత్సిసపుత్రుడు 6.పాపమనెడిఆగ్ని

## 127.

రా - బేగడా తా - అట.

చాటెదను ఇలాతలమందున్[1] - నేటుగ[2] క్రీస్తుడె గురుడెందున్ = మాటలు తేటలు - మర్మము గాదది - కోటికోట్ల సద్గురు - గురుడీతడంచు ॥చాటెదను॥

1. పరిశుద్ధతమతని భూషణము[3] - దురితాత్ముల[4]కదితోషణము[5]=నిరయము[6] నకు జను[7] - నరజీవుల దు -స్తర[8] పాపహరము - కొరకు గాదె మరణమయ్యె ॥చాటెదను॥

2. బూటకమాత్మను[9] బూనుకొని - కూటికి శిష్యుల గూర్చుకొని = మాటలు మహిమలు - తేట పరుచునట్టి - తాబోటి గురువులిల - కీటకముల సాటియంచు ॥చాటెదను॥

3. ఢంకావాద్యములతో నిలను - శంకింపకనే[10] చాటెదను = సంకట[11] పాప భ - యంకర పంకము లింకను క్రీస్తుని - వంక జేరుడింకయంచు ॥చాటెదను॥

## 128.

రా - ధన్యాసి తా - ఆది.

చిత్రమా[1] ప్రభుని - చెన్ను[2]నడతలు[3] - సేవకసుఖదములు = స్తోత్రార్హము క్రీ - స్తుని ఘన దివ్య చ - రిత్రము పరమ ప - విత్రము పాత్రము[4] ॥చిత్ర॥

1. దూపరిగొను[5] యూ - దుల కొక బండను - యేపుగ[6] జలమొసగు[7] = నా పరాత్పరుడు-దూపరిని సమ- రియా పొలతిని[7] నీ - ళ్లడిగెను ద్రావను[8] ॥చిత్ర॥

2. సర్వోన్నత[9] శా - శ్వత[10] గృహములు తన - జనులకు దయనొసగు = సర్వేశ్వరుడు తల దాచుకొనను తన - కుర్వి[11]యందు స్థల - మొక్కటి లేదనె ॥చిత్ర॥

3. పలుదూతలచే - కొలువంబడు పద - ములగల దేవుడ అనా = ధులు హీనులు దీ - నులైన తన శి - ష్యుల పాదంబులు - చెలిమిని[12] గడిగెను ॥చిత్ర॥

---

(127). 1.భూలోకమందున 2.దృఢముగా/గట్టిగ 3.అలంకరము 4.పాపాత్ములకు 5.సంతోషము 6.నరకమునకు 7.వెళ్ళు 8.తరింపకూడని 9.అబద్ధపు ఆత్మను 10.అనుమానము లేకుండా 11.ఇరుకు

(128). 1.ఆశ్చర్యకరమైన 2.అందమైన 3.నడతలు 4.యోగ్యము 5.దప్పిగొను 6.సమృద్ధిగా 7.నీరు 8.త్రాగుటకు 9.అన్నిటికంటేఉన్నతమైనవాడు 10.నిత్యమైన 11.భూమియందు 12.స్నేహముగా

## 129.

రా - పంతురావళి తా - ఆది.

కటకట నరకాన అల బాధకు మీరెటు లోర్చెదరయ్య పటు భయ దమ హోత్కట గంధకలంపట మైరవిలెడు వహ్నింబడవలె ॥కటకట॥

1. పలుగొరుకుల రోదనముల రవములు గలవందెల్లపుడు = నలుదిక్కుల నిప్పుల కుప్పలు జల్లులవలె నంగంబులపై గురియును ॥కటకట॥

2. అనంత దేవుని కోపంబది చల్లార్ప నెవరి వశము = యినుప దుంప కొలిమిని యుడికెడు విధమున నుడుకదగ వలయున్ ॥కటకట॥

3. పగటి వెలుగు దీపద్యుతి గనుగొనబడ నుండునం దు = దగలనువగలను బొగులుచు శాశ్వత యుగములుం డనలయున్ ॥కటకట॥

## 130.

రా - ఆనందభైరవి (చాయ: రారె గొల్లవారలారా) తా - అట.

మమ్ముజూడ నేడు రావే - మంచి - నెమ్మదియ్య కృపను దేవే = ఇమ్మానుయేలు నీ - తమ్ములమగు మేము - ఒమ్మికతో నుండ - సమ్మతించక చెడ్డ - రిమ్మెత్తి - సైతాను - హుమ్మంచు లేచి భా - మమ్ములు జూచి భే - దమ్ములు సేయ సు - ఖమ్ములు బాయ డెం - దమ్ములు దూయ శ - రమ్ముల నేయగా - అమ్ములతో నిదిగో - నిమ్మళంబిక లేక - నిట్టూర్పు విడుచుచు - సొమ్మసిల్లి - మేము సోలుచునున్నాము - కమ్మని నీ దయను - కనిపెట్టి యిది వేళ = రమ్మని మతి సుఖ - మిమ్మని వేడెదము ॥మమ్ముజూడ॥

1. ఎక్కడిద్దరు ముగ్గురింపుగా - నున్న - నక్కడ నీ వుందు నంటివి = నిక్కంబుగా నీవే - దిక్కు మాకని నమ్మి - మక్కువతో చేరి - మన్నింపులను వేడి - మ్రొక్కులు చెల్లింప - మొనసినా మిచ్చోట - తక్కువుగానట్టి - పెక్కు విధములైన - యిక్కట్లు మాకెన్నో - యెదురుగా నున్నవి - మొక్కలమైన మా - మూర్ఖ స్వభావము - రక్కెస వలె లేచి - యొక్కొక్క తరి మమ్ము - చిక్కుల బెట్టుచు - నెక్కువ బాధించు - నక్కట మాపై నీ - యక్కట కిపు దృష్టి - గ్రక్కున రానిచ్చి - గాచి రక్షింపుము ॥మమ్ముజూడ॥

## 131.

రా - రేగుప్తి తా - అట.

1. అంతరంగములు శోధించి - యన్నలారా గనుడీ = భ్రాంతి గలమీ కృత పుణ్యముల - పైని యాశవిడుడీ.

2. సర్వోత్తముడు సర్వేశ్వరుండు - సర్వదా నిర్మలుడు = నిర్వికారి నిష్కపటుండు - నిత్యసత్యుడతడు.

3. నిరపరాధి తానై - దోషనరుల కార్యంబులను = యొరపుగ పరిగ్రహింప నొప్పుకొన డెయ్యడను.

4. దేవుని దృష్టికి తుష్టిగ - దిరుగువారు లేరు = కావరించి యంతా శాపగ్రస్తులై యున్నారు.

5. కావున మర్త్యో ్యపాయములౌ - కల్పితములెన్నైన = వేవేలు పాలింప మోక్షమే విధమున రాదు.

6. దేవిదైవాదులకు మిథ్యా - సేవలెన్ని సేయ = భావశుద్ధిగాని లౌక్య పథములన్ని మాయ.

7. స్నాన మంత్ర ధ్యాన - దానసంతర్పణ కార్యములు = మానుగా నెన్నియు జేసిన గాని నిష్ఫలములు

8. త్రాణోపాయమిటువంటి - కార్యములబడయరాదు = ప్రాణమున కాయాసము గాని ఫలము లేదు లేదు.

9. శాపగ్రస్తులైనా సర్వ - జనులలో నెల్లపుడు = సైపరాని బలు దు:ఖములు సంభవించె గనుడు.

10. జనులలోన వివిధ రోగ - చయము జుట్టుకొనెను = మనసు నానావిధ దు:ఖములు బెనుచు కొనుగుజెడెను.

11. ప్రళయకాల జలము లెట్లు - వ్యాపించె నెల్లెడను = పెలుచనట్లీ యఘ దు:ఖములు ప్రాప్తించెనంతటను.

12. అందుకై మృత్యువు - ప్రాణాలపైనిధి = కారత్వ మూనిబొంది వెడలించి యాత్మను గొంపోయి వేగదాని.

13. ఘనమైన యేసుని - న్యామాసనము మ్రోల నిలను = తన విమర్శ వెనుక నరక స్థలము కాత్మ జనును

14. మహా విచారాంత్య - దినము మహిమవచ్చు దనుక = హాహాకారంబౌ కారాగేహమున నుండ.

## 132.

రా - శంకరాభరణము తా - ఆది.

దైవంబు గొలుతున్ - నా తండ్రి యె - హోవాను దలతున్ = ఏ విభుండీ విశ్వ - మెల్ల నిజోక్తిచే - గావించి దీవించి - కాపాడు ననిశంబు ॥దైవ॥

1. ఇనచంద్రతారల్ - భువి దివియందు - గనుపడెడి మెరుగుల్ = ఎవ్వని తేజ - మున వెల్గిమేరల్ - దప్పగలేక - దినములు రాత్రుల్ = ఒనరంగ తమతమ - పనిచేయుచుండు నె - వ్వని యాజ్ఞచే జగము - లను వర్తించును అట్టి ॥దైవ॥

## 133.

రా - పంతువరాళి తా - ఆది.

అతి భయమగు జగదంత్య దినససంగతి వినరే స్నేహితులారా = మతి మరలిచి దుష్కృతములు - విడి సద్గతి గోరరె క్రీస్తుని ద్వారా ॥అతి భయమగు॥

1. కడు విలయ భయంకర బాకా ధ్వని పడిగనూదు నొక్కడు దూత = మడిగిన సమస్త మనుజుల తనువులు తడయక లేచును తత్క్షణ మాత్రమే ॥అతి భయమగు॥

2. తరగతి నిజాత్మల గూడుకొని నిల్తురు క్రీస్తుని ముందర వరుసన్ = దురితాత్మల పోతరమపుడే మగు నరక బాధ లెవ్వరు దప్పింతురు ॥అతి భయమగు॥

3. పిన్నలు పెద్దలు పేదలు యోధులు వన్నియ కెక్కిన వసుధేశుల్ = మన్నులోని నర వర్గము లందరు మున్నొనర్చున్ నఘముల ఫల మొందును రతి భయమగు జగదంత్య ॥అతి భయమగు॥

## 134.

రా - సురటి (చాయ: ఆనందమగు ముక్తి) తా - అట.

పరమ సుఖముగోరు - బలు ధీమంతునికి = ఎరుక కలిగియుండు - యేసుని యునికి ॥పరమ॥

1. దేవుని ప్రియుడ ద్వి - తీయాత్మజుండు - భావింప మరియా గ - ర్భస్థుడై నాడు - కేవల మానవా - కృతి దాల్చినాడు = ఆవంతైనను పాప - మంటని వాడు ॥పరమ॥

2. నరదైవత్వములందు సరిగానున్నట్టి - గురుతులు మదిలో గ - న్గొని నమ్మినట్టి - నరులెవ్వరో వారి - దురితముల్ బట్టి = పరిహరించును క్రీస్తు - పదమాత్మబెట్టి ॥పరమ॥

## 135.

రా – శంకరభరణము తా – అట.

కారుణ్య మూర్తి – నీ కృపలేక – గలుగునే ముక్తి = దారుణ దుర్విష – యోరగంబుల చేత – గరవబడెడు నరుల – కే రీతి గతి గల్గు ॥కారుణ్య॥

1. ధరణి యందున్న – ధర్మములన్ని – యెరిగి గైకొన్న – కర్మములకు – బొరి జుట్టియున్న – యఘముల నొకటి – హరియింపదన్న = మరియానందన నీ సుందర కటాక్షములపై – భరముంచబోని దు – ర్నరుల కబ్బునె ముక్తి ॥కారుణ్య॥

## 136.

రా – సెహన (చాయ: విజయంబు విజయంబు విజయంబు) తా – అట.

మనుజ దైవంబీ త – దని నమ్మువారికి – మనసు నెమ్మది గల్గును = తనువందు గుణమందు – తప్పు లేనివాడు – మనుజావతారుడై – మహికి వచ్చినాడు ॥మనుజ॥

1. దురితము లంటని – గురుదేవుడగు యేసు – దురిత జీవుల కోసము = పరిశుద్ధ కాయంబు – ప్రాయశ్చిత్తము జేసి – నెరి విశ్వాసములను మ – న్నించి రక్షించెను ॥మనుజ॥

2. తప్పొప్పు కొనువారి – దయచేసి మన్నించి – మెప్పుగా కాపాడును = ఒప్పుకొనని వారి – నొగిని అంత్యమునందు – తప్పక దండించు – తన తీర్పు దినమున ॥మనుజ॥

## 137.

రా – ఫరాజు (చాయ: మనసున నెమ్మది) తా – ఆది

సర్వములో సర్వమునై వెలిగెడి – సర్వేశుడై మా ప్రభుయేసు = నిర్వాణపు సుఖ – నిలయము పండుగ – పర్వము మాకు స – మస్తంబతడే ॥సర్వములో॥

1. పుట్టింపను పోషింపను చంపను – మొట్ట మొదలి దేవుండతడు = కట్టలీయను – కరుణను జూపను – సృష్టమైన మా – సద్గురుడాతడె ॥సర్వములో॥

2. నరులకు దేవునికి వైరము – పరిహరించుటకు ప్రతినిధిగా = నరులకు నరుడై – పరమేశ్వరునకు – పరమేశ్వరుడై – ప్రమోద మొసగెను ॥సర్వములో॥

3. అతని చేతను భూతలినర సం – ఘాతమునకు రక్షణ గలిగెన్ = ప్రీతిని నమ్మిన – చేతనులకు నిర్హేతుక కృపచే నిచ్చును మోక్షము ॥సర్వములో॥

## 138.

రా – యదుకులకాంభోజి తా – అట.

వరము లొసగవే – పాపులకాత్మ – దర్శనమీవే = నిరయ కూపములోని కురికి – పోవుటకాత్మ – నరవాయిగొనని దు – ర్నరుల రక్షింపను ॥వరము॥

1. పీనుంగుతోను – సరిసేయంగ – రాని బొమ్మలను – సంస్థాపించి – నానా విధములను – పూజించు న – జ్ఞాన జీవులను = నీ నామ మెరిగించి – నిజ భక్తి నాటించి – యా నిత్య జీవమున – కాకర్షింపవె తండ్రి ॥వరము॥

## 139.

రా – బేగడా (చాయ: రారె గొల్లవారలారా) తా – అట.

చంచలమగు నిహ సుఖమ్ములు – వట్టి – వంచునెంచిన వారె ధన్యులు = ఎంచికూర్చిన మంచి – యిహ భాగ్యభోగదు – లించుక సేపుండి – యేమి లేకనే పోవును ॥చంచలమగు॥

1. సకల సంపదలెన్ని కూర్చిన – మృత్యు – వుకు నడ్డమేదైన నుండునా = ఒక ధనికుండు నా – రక వహ్నిబడి నీర – మొక బొట్టు బోసి నా – లుక దడపమని వేడె ॥చంచలమగు॥

2. ప్రభుయేసు నెవడు సేవించిన – లోక – విభవ మించుకయు లేకుండిన = శుభవంతుడతడే స – త్సుఖమాత్మలో గల్గి – యుభయ లోకములందు – నున్నతడైయుండు ॥చంచలమగు॥

## 140.

రా – కాపి (చాయ: ఆనందమగు ముక్తి) తా – జుల్వా

పరమార్ధ మొసగవె – ప్రభు యేసునాథా = కరుణింపు మయ్య భ – క్త జనానుమోదా ॥పరమార్ధ॥

1. పరిశుద్ధమనుచు ము – మ్మరు వచించి – వరదూత వ్రాతముల్ – శిరములు వంచి – నిరుపమ స్తోత్రముల – నినుగొల్తు రెపుడు = నరకీటకముల ప్రార్ధ – నలు వినరమ్మిపుడు ॥పరమార్ధ॥

2. క్షితితో నీవేర్పరచు – జీవ క్రైస్తవులు – యతులితానంద సు – ఖాత్మానుభవులు – సతతము మాకట్టి – సాధులపొందు = హితవుగ నొసగూర్పు – మీ లోకమందు ॥పరమార్ధ॥

## 141.

రా - యదుకులకాంభోజి　　　　　　　　　　　　తా - అట.

ఆత్మసుఖము బడయకున్న - యతడు భక్తుడే - నిర్మ - లాత్మ మేళనంబు లేని - యతడు ముక్తుడే = సాత్విక ప్రశాంత సుగుణ - సాగరుండు క్రీస్తుడతని - తత్వమెరిగి తన్ను రోసి - తత్పాదాంబుజములు నమ్మి ॥ఆత్మ॥

1. దారి నిజము జీవనంబు - దానె యనుచును యమృత - సార వాక్య మిచ్చె ప్రభువు - సాధులలరను = పారమార్థకముగ పల్కు - చారు వచన మెదను నమ్మి - భారమతని పైని బెట్టు - దారి తప్ప కుండనట్టి ॥ఆత్మ॥

## 142.

రా - హాయిరి　　　　　　　　　　　　తా -అట.

1. ఈ రీతి దేవాజ్ఞలుండను - వాటి - దారిలో నొకడు బోకుండెను - ధారుణి గల నరనారీ జనములెల్ల సారె సారెకు దుష్ట చారులై చెడిపోయి.

2. భయము డెందములందు వీడిరి - పాప - మయమైన విధులందు - గూడిరి - నియమోల్లంఘనులై దుర్ణయ వృత్తిలో నాతిశయులై పిశాచి కాశ్రయులైరి జనులెల్ల.

3. నరనారీ బృందంబు లెల్లను - పరా - త్పరుని శాప ప్రాప్తి వల్లను - మరణాంతమున ఘోర నరకాగ్నిలోన నిర్భరమైన బాధలబడుటకు పాలైరి.

4. యీలాటి దశ బొందిరందరు - యింక - నేలాగు రక్షింపు గందురు - శీలత్వ మెదలేక చాల స్వపుణ్యము - లేలీల నొనరింప మేలించుకయు లేదు.

## 143.

రా - పంతువరాళి　　　　　　　　　　　　తా - ఆది.

ఏలా విష్ణుండవతారంబులెత్తి నాడన్న - వాటి మూలము శోధింపవట్టి ముచ్చటలు గాకే మీ ఫలము ॥ఏలా॥

1. మన దోసముల కొరకేమి పాట్లను బడుటయు లేదు = పాపుల కనికరముతో బ్రోచునట్టి కార్యమిసు మంతయు గనరాదు ॥ఏలా॥

2. ఘోరమైన పాపాత్ములనెల్ల కూరిమిచే బిలిచి = వారల భారముల వెడలింపను పని బలహీనత్వము గనుగొనబడును ॥ఏలా॥

3. మొదట మీను రూపుబూన ముఖ్యకార్యమేమి = సోమకు వెదకి చంపవచ్చె ననుట వెర్రి దేవత్వం బిదిగాక ॥ఏలా॥

4. కూర్మపు రూపుబూని యొక్క కొండనెత్తుట = యందుల ధర్మము మనకేమి గలదు దైవ ఘన హీనత్వంబగుపడు ॥ఏలా॥

5. సూకరావతార మెత్తుట చుల్కనగు మాట = జ్ఞాన వివేక మెరుగని మృగ లక్షణములు వినినందుల మనకేమి ఫలము ॥ఏలా॥

6. నరసింహ మౌటెంతో భయంకర విరూపము శాత్రపు =బరిమార్చుటకై యింతో కష్టము బడుటయ దేవత్వమునకు దగదిది ॥ఏలా॥

7. వామనుండై భిక్షమెత్త నేమియవసరంబు = అడిగిన కామితంబిచ్చెడు బలిదాతను కాలి క్రిందను ద్రొక్కుటుచితమె ॥ఏలా॥

8. పరశురాముడై భూపతుల నిరువ దొక్క మారు = వారల శిరంబులను ఖండించెనట యీ చెడ్డతన మొక యవతారంబె ॥ఏలా॥

9. ఆలిని చెరకప్పగించి యతి దు:ఖమునొంది = రావణునాలమున పరిమార్చు రాముని యవతారము వినసిగ్గు గాక ॥ఏలా॥

10. జారచోరతలు కృష్ణావతార చిహ్నములు = పాపపుదారి విస్తారము జేయుట యో దైవ మాష్యంబిది వినదగునే ॥ఏలా॥

11. తద్దయు శుద్దబుద్దా కృతిగని తగిన రూపులేక = నిలపిన మ్రొద్దు విగ్రహమై నాడనుట మూఢ దైవంబని యేర్పడుగద ॥ఏలా॥

12. కలికి రూపమూను టొక్కటి గలుగునందురు = యందుల ఫలమేమయిన మనకు గలదా పాప రహింతబైన జాడను ॥ఏలా॥

13. యేసు క్రీస్తవతామెత్తుటీ చందముగాదు = పాపము మోసుకొని బలిగా దేహంబిడి దోస కారుల కిచ్చెను మోక్షంబే ॥ఏలా॥

## 144

రా – శంకరాభరణము తా – ఆట.

వె.ాక్షాధికారీ – నీవే మాకు – రక్షించుదారి = అక్షీణమగు నీ క–టాక్షంబుగోరి ని – రీక్షించుచున్నాము – సాక్షాత్కరింపవె ॥మోక్షాధికారీ॥

1. ఏ వస్తువైనన్ – పొందనుగోరి – భావంబులోనన్ – నా నామంబుతో విశ్వాసమునన్ – నా తండ్రి యె – హోవా నడిగినన్ = దీవించి మీకిచ్చు – దేవుండనుచు బల్కి జీవవాక్యంబు నీ – శిష్యుల కొసగిన ॥మోక్షాధికారీ॥

2. జగతి లోపల మెండుగ నుండిన వివిధమగు శాస్త్రములు జూడగ మిగుల గందరగోళమై మరి యొకటి – కొకటి విరుద్ధముగ మర్త్య గణ కల్పిత మగుచున్నవి తగని వని ద్రోచితిని వాటిని ॥జగతి॥

## 145.

రా - ధన్యాసి (చాయ: ఎవరు భాగ్యవంతులౌదు) తా - ఆది

మునిగిరయ్యా నరులెల్ల దుర్ - మోహవార్ధిలో - వట్టి = పనికిమాలినట్టి దారి - బడి చెడిపోయిరయ్యయ్యయ్యో ॥మునిగిరయ్యా॥

1. ధనము ఎంచి ఘనము పెంచి - దారాపుత్రాదులను గాంచి =తనువే తానుగా భావించి - దర్పాంధము కన్నులకు మించి ॥మునిగిరయ్యా॥

2. ఇహ సౌఖ్యములే యెంచి లోక - బహుమానములే మది నాశించి = యహామికా మమకారపాశము - అవయవములను గట్టికొనుచు ॥మునిగిరయ్యా॥

3. ఇరుగుపొరుగువారిలోన - ఇంటివారిలో కొందరు = మరణమవుట చూచి తమ్ము - చిరజీవులుగా తలచుకొనుచు ॥మునిగిరయ్యా॥

4. దేవదేవా యేసునీవే - నావవై యీ కష్టాంబుదిలో = చావకుండ నీ సేవకుల - సంరక్షించినావు కృపను ॥మునిగిరయ్యా॥

## 146.

రా - రేగుప్తి తా - ఆట.

1. వినరయ్యా లోకస్థులారా విచారించి మీరు
యెనలేని ఘోర పాపాబ్ధినెట్లు తరించేరు॥వి॥

2. గతిని గురించి శోధించి వెతుకబోరెవ్వారు
సతతమీ సంసారమునకై శ్రమబొందు చున్నారు

3. తథ్యంబుగాదీ సంసార ద్రవ్యాధికారంబు
మిథ్యమా త్రమక్షుల్మాయ మేటి అంధకారంబు

4. ధరణిలో నల్ప కాలంబె దాని ప్రయోజనము
మరణమైన పిదప వెంట నరుగునే తద్ధనము

5. ధరణిపై పుట్టిన వారెల్ల మరణంబు కావలెను
మరణాంతమున మోక్షముకో నరకమునకో పోవలెను

6. సత్యమైన ధర్మాశ్రయము సాధింప జాలకను
నిత్యముక్తి పొందలేరు నిరయ మేయావలను

## 147.

రా - రేగుప్తి　　　　　　　　　　　　　　　　　　　　తా - ఆట

1. చూడుడీ యెహోవా యొక్క చోద్యమైన ప్రియము
కీడు మాన్పి పాపాత్ముల రక్షించుటకు కేవలము

2. తన ప్రియాత్మజుని వేబంపెను మనుజ లోకమునకు
యొనర క్రీస్తుడుదయించెను దానొకడే త్రాతను మనకు

3. ధరను యూదరాజ్యమందు దావీదు పట్టణమున
పరిశుద్ధాత్మవలన పుట్టె మరియా స్త్రీ గర్భమున

4. ప్రకటముగను త్రాణకర్త బహుగా అద్భుతములు
అకలంకుడై జేసె తానీ అవని నున్నన్నాళ్లు

5. కుంటివారి అడుగుల్ మరియు గుడ్డివారి కన్నులు
మంటిపాలై జనుపీన్గులకు మరల ప్రాణమిచ్చెన్

6. సారమైన శుభవార్తను తా చాటి యుపదేశించెను
పారమార్ధ జ్ఞాన క్రియలుబాగుగా బోధించెను

7. దోషులపై వచ్చు నరక దు:ఖములు మానుపను
శేషమందు దుష్కర్మల చేత పట్టుబడెను

8. పరుషమైప బహుబాధలచే ప్రాణమును త్యజించెను
తిరిగి జీవితుండై మూడో దినమునందు లేచెన్

9. పొందుగ పాపుల బాధలు మేను నందు ప్రభువు దాల్చెను
అందుకొరకే రక్షణ కర్తయనెడు ఖ్యాతి నిలిచెన్

10. వరమహా శిష్టాచార నిరతుడితని గనుడు
పరమేశ్వరుని తనయుడేసు భగవంతుడే యనుడు

**148.**

## యేసుక్రీస్తు అవతారము

రా - రేగుప్తి తా - ఆట

1. చూడుడీ బంధువులారా యేసుని యవతారంబు
యీడు లేని సత్పుణ్యముల కిదియే యాకరంబు
2. అంతము లేనటువంటి మోక్షానందంబు విడిచి
యింతటి దు:ఖముల కొప్పి యిలకు నేగుదెంచి
3. అతడు తన ప్రాణంబు చోట న ప్రియంబుదలచె
హితముగా పాపాత్ములపట్ల ఎంత ప్రేమ సలిపె
4. ఎంత దయావంతుడో మీరెంచి చూడరయ్యా
స్వంతపు జీవమర్పించే సద్గతి మీకియ్య
5. అయితే మీరలతని నామమాశ్రయించుకొనర
ప్రియముగల యా ప్రభుని మీరు ప్రీతి చేయబోరా
6. వారి శిష్యలౌటకిపుడు మీరు కొరుకొనరా
వారి పాదములు పట్టుదురా వలదని వీడుదురా
7. ధరణిలోన యితని కంటె త్రాణకర్త లేడు
పరిశుద్ధాత్మ నొసగి మదికి తిరమొనర్చు ఇతడు
8. పరమేశ్వరుడు నియమించిన ప్రాయశ్చిత్త మితడు
మరియే ఉపాయంబు లేదు నరులలోన నిపుడు
9. యేసు నామంబునకు సరి యింకే నామము లేదు
యేసు సన్మార్గము దక్కనింకే మార్గము లేదు
10. భారక్రాంతులైన సర్వపాపులారా రండి
పేరిమిని మిమ్మతడిబ్బంగి పిలుచు వాక్కు వినుడి
11. త్రాణ రత్నమదిగో క్రీస్తుదరికి బోయిగొనుడి
దాని వెలమిమ్మడుగబో డాత్మను ధరించుకొనుండి

## 149.

చూడురా! యివి చూడురా! భ్రమవిడురా! యికవీడురా!

1. అల్లదేమిటి చూడురా యొక - నల్లమొగ ముందున్నది
కల్లగాదు నిజంబురా అది కఱ్ఱ ముక్కైయున్నది ॥చూడురా॥

2. ముక్కుచెక్కుట వెట్టిరా - అది - మార్కొనంగా జాలదు
త్రొక్కయొలిచిన మ్రాను దానికి - మ్రొక్కితే ఫల మేమిటి ॥చూడురా॥

3. కన్నులున్నవిగాని లోకుల - గాంచు తీరిక లేదురా
దున్న మేలుర దాని కన్నను త్రోవగని యదిపోవురా ॥చూడురా॥

4. నోరు చెక్కెను దానిని కని - నూరు కొట్టిన పల్కదు
వేరుదొలగిన మొద్దు దానికి - పేరు ఎంతో పెద్దరా ॥చూడురా॥

5. చెవులు లేవురా దానిలో నొక - చిన్నెయైనను గానము
శవముపోలిక నున్నదచ్చుట - సార మేమియు లేదురా ॥చూడురా॥

6. జెబ్బలున్నవి దానికిక సరి - చేతు లేమైపోయెనో
అబ్బురపు పనిబొమ్మరా శిశు - వాడు కొనుటకు తగదిది ॥చూడురా॥

7. బాపనయ్యలు గూడిరి జీ - వ ప్రతిష్ఠలు చేసిరి
వేపకఱ్ఱ బద్ధిరా యొక - వ్రేలెడైన యెదుగదు ॥చూడురా॥

8. వింత మంత్రములు ఉచ్చరింతురు - వెట్టి ప్రాణము రాదయో
యెంత జేసిరో యంతకంటే యెక్కువవెప్పుడు కాదురా ॥చూడురా॥

9. కొయ్యకిడు బ్రాణంబు- తాదన - యయ్య చచ్చిన
గాల్చును చెయ్యదేమిర యిట్టి యోచన - సిగ్గుమాలి యింకెవ్వడు ॥చూడురా॥

---

ఈ కీర్తనను ఒరిస్సారాష్ట్రములోని పూరీజగన్నాథ గుడిలోని విగ్రహాములనుద్దేశించి వ్రాసిన కీర్తన

## 150.

బైబిలులోని యెషయాగ్రంథము 44 అధ్యాయము ననుసరించి రచించిన కీర్తన.

ఇదేమి వెఱ్ఱి యేమి వెఱ్ఱి - యీ నరాళికయ్యయ్యో ॥ఇదేమి॥

1. నరుండు గొడ్డలిన్ కరంబునన్ ధరించిపోయి యా
యరణ్యమందు చెట్టున్గొట్టి యట్టి మ్రాను నింటికిన్
బిరాననీడ్చి తెచ్చి నూలువేసి కొల్చి దానికిన్
స్వరూపముంచి వేల్పుజేయవడ్ల వాని బిల్చునో ॥ఇదేమి॥

2. మదించి వడ్లవాడు కూలిమాటముందు తేటగా
విధింతువేని మానుజెక్కి వేల్పుజేతునన్న చో
బదిర్వదంచు వీడు వాడు పల్కి గుద్దులాడుచున్
తుదన్దిర్చి సంచకర్వుతోడ నప్పగించునో ॥ఇదేమి॥

3. భుజాబలంబుతోడ బాడ్తెబూని వడ్లవాడు దాని
జూచి పుచ్చులేదటంచు నిశ్చయించి మాను భూ
ప్రజల్ భళీ యనంత దానిపట్టి ముక్క చెక్కి వే
ల్పు జేతునంచు బొమ్మజేయు బుద్ధిలేని వారికై ॥ఇదేమి॥

4. తుదల్ మొదల్గొట్టి వానితోటి యన్న శాకముల్
ముదంబుతోడ వంటజేసి ముందుగా భుజించి వె
న్క దాని చెక్కపేళ్ళు శీతకాలమందు కుంపటిన్
కుదిర్చి యగ్నికాగె వీనిగూర్చు బొమ్మకాదకో ॥ఇదేమి॥

5. అలాటి కొయ్యబొమ్మ కక్షులాననంబు జక్కగా
నలంకరించి రంగువేయుమయ్య ముచ్చివాడ నీ
వెలాగు జేతువో సుమీ యదేల నీకు నేర్ప నీ
తలంపు మెచ్చునట్టి కూలి దాని కిచ్చెదందురో ॥ఇదేమి॥

6. జగంబులోన దేనితోటి సాటిసేయరాదు గు
డ్లగూబ మోమువంటి మోము డంబమింతియే మరే
మి గానరాదు వేపమొద్దు మెచ్చిమెచ్చి దీనికిన్
జగత్తు నాధుడంచు జెప్ప జాల సిగ్గుకాదకో ॥ఇదేమి॥

# అకారాది పట్టిక

| అ | ఈ.పు | ఆ.క్రై.పు | డా.కీ.పు | ఇ.కీ.పు |
|---|---|---|---|---|
| అనాది దేవుండైన యెహోవా | 4 | | | రక్షణచరిత్ర |
| అయ్యో మానవులారా | 12 | | | నిస్తారరత్నకరం |
| అయ్యో నరులారా | 14 | | | తె.కీ.పు.1909 |
| అపుదర్చకాదు లుప్పొంగిరి | 41 | 185 | | |
| అయ్యోయిది ఎంతో | 54 | 230 | | |
| అదిగో క్రీస్తుడు | 55 | | 1878 | రక్షణచరిత్ర |
| అదిగోనాడు ధరకు | 57 | | 1878 | ,, |
| అందమైన క్రీస్తుకథ | 91 | 151 | | |
| అట్టెలు బెట్టకు | 116 | | 1869 | |
| అంతరంగములు | 131 | | | నిస్తారరత్నకరం |
| అతి భయమగు | 133 | | | ,, |
| ఆత్మ సుఖము బడయకున్న | 141 | | | సత్యభజన |

ఆ

| | | | | |
|---|---|---|---|---|
| ఆనందమగు ముక్తియే | 25 | 347 | | |
| ఆ యంధకారంపు రేయిలో | 36 | 178 | | |
| ఆహా! ఈ చెడ్డ హృదయ | 118 | | 1868 | |

ఇ

| | | | | |
|---|---|---|---|---|
| ఇదెగదా జనులార | 15 | | 1878 | సత్యభజన |
| ఇప్పటి నరులారా | 21 | | 1878 | జి.డి.యం |
| ఇతరుల తప్పెంచ | 22 | | 1878 | తె.కీ.పు1909 |
| ఇదిగో శుభద త్రాణము | 51 | 160 | | |
| ఇదిగో నా శిష్యులారా | 67 | 224 | | |
| ఇతరుల సాక్ష్యము | 77 | 357 | | |
| ఇడుగో గొఱ్ఱెల కాపరి | 96 | 163 | | |
| ఇకనేమి గతియున్నది | 117 | 289 | | |
| ఇదేవి వెట్టి యేమి వెట్టి | 150 | | | విగ్రహనిర్మాణము |

ఈ

| | | | | |
|---|---|---|---|---|
| ఈలాటి వెత జెందెనా | 44 | | | రక్షణచరిత్ర |
| ఈ రీతి దేవునాజ్ఞలుంను | 142 | | | నిస్తారరత్నకరం |

| | ఈ.పు | ఆ.క్రై.పు | డా.కీ.పు | ఇ.కీ.పు |
|---|---|---|---|---|
| **ఉ** | | | | |
| ఉదయించినాడు | 47 | 107 | | |
| ఉన్నపాటున వచ్చు | 80 | 315 | | |

**ఎ**

| | | | | |
|---|---|---|---|---|
| ఎంతో వేగము చెల్లిపోవును | 20 | | 1878 | తె.కీ.పు1909 |
| ఎఱిగి ఎఱిగి చెడిపోతివి | 71 | 319 | | |
| ఎందుకే చింతిచెదవు | 75 | 394 | | |
| ఎవరు భాగ్యవంతులౌదు | 82 | 154 | | |
| ఎంతో శృంగారమైనది | 87 | 502 | | |

**ఏ**

| | | | | |
|---|---|---|---|---|
| ఏమాశ్చర్యము | 39 | 184 | | |
| ఏది నా విశ్రాంతి | 93 | 477 | | |
| ఏలా యీ పాలుమాలిన | 104 | | 1878 | |
| ఏలా విష్ణుండవ | 143 | | | నిస్తారరత్నకరం |

**ఒ, ఓ**

| | | | | |
|---|---|---|---|---|
| ఒక్కసారి జూపవో | 114 | | 1878 | |
| ఓహోహో మా యన్నలారా | 60 | 231 | | |
| ఓహో యన్నలారా | 120 | | | సత్యభజన |

**క**

| | | | | |
|---|---|---|---|---|
| కరుణనిధియై క్రీసుడు | 68 | | | సత్యభజన |
| కరుణానిధి భక్త పావన | 106 | | | ,, |
| కరుణింప గదె తండ్రి | 115 | | | ,, |
| కటకటా నరకాన | 129 | | | నిస్తారరత్నకరం |
| కారుణ్యమూర్తి | 135 | | | సత్యభజన |

## చ

| | ఈ.పు | ఆ.క్రై.పు | డా.కీ.పు | ఇ.కీ.పు |
|---|---|---|---|---|
| చేడియలు గుంపుగూడిరి | 40 | 200 | | |
| చూడరే క్రీస్తుని చూడరే | 42 | 188 | | |
| చెప్పినట్లు చేయలేవు | 73 | | 1869 | |
| చిరజీవమగు క్రీస్తు | 88 | | | సత్యభజన |
| చాటెదను ఇలాతలమందు | 127 | | | ,, |
| చిత్రమా ప్రభుని | 128 | | | ,, |
| చూడుడీ యెహోవా | 147 | | | నిస్తారరత్నకరం |
| చూడుడీ బంధువులారా | 148 | | | నిస్తారరత్నకరం |
| చూడరా యిది చూడరా | 149 | | | విగ్రహనిర్మాణం |
| చంచలమగు | 139 | | | సత్యభజన |

## జ

| | | | | |
|---|---|---|---|---|
| జయ మంగళము | 95 | | 1878 | తె.కీ.పు1909 |

## త

| | | | | |
|---|---|---|---|---|
| తవాంఘ్రీ దాస్యము | 126 | | | సత్యభజన |
| త్రాహిమాం క్రీస్తునాధా | 72 | 312 | | |
| తుదిదివసము రానున్నది | 53 | | | సత్యభజన |
| తెల్లవారిన వేళ | 27 | 42 | | |

## ద

| | | | | |
|---|---|---|---|---|
| దయానిధి - దయయేది | 124 | | | సత్యభజన |
| దాసుల ప్రార్ధన | 26 | 373 | | |
| దేవా దివ్యానంత ప్రభావ | 2 | 4 | | |
| దేవాది దేవాత్మజా | 81 | 522 | | |
| దేవా నీ స్వరూపదాల్చు | 107 | | | సత్యభజన |
| దైవంబు గొలుతున్ | 132 | | | సత్యభజన |
| దేవుడిచ్చిన దివ్యశాస్త్రమిదేను | 28 | 252 | | |

| | ఈ.పు | ఆ.క్రై.పు | డా.కీ.పు | ఇ.కీ.పు |
|---|---|---|---|---|
| **న** | | | | |
| నన్ను గన్నయరావే | 13 | 377 | | |
| నరరూపు దాల్చెను | 121 | | | సత్యభజన |
| నాయన్న రాగదే | 38 | 179 | | |
| నాడువచ్చినట్లుగాదు | 52 | 228 | | |
| నిజముగా పరిశుద్ధ | 63 | 292 | | |
| నిన్ను దేవుండనుటకొక | 122 | | | సత్యభజన |
| నీ చరణములే నమ్మితి | 13 | 393 | | |

**ప**

| | | | | |
|---|---|---|---|---|
| పరమ సుఖముగోరు | 134 | | | సత్యభజన |
| పరమార్థ మొసగవె | 140 | | | సత్యభజన |
| పరమాత్ముడితడే | 7 | | | |
| పరలోకముననుండుదేవ | 11 | 23 | | |
| పాపుల యెడ క్రీస్తుని | 43 | 187 | | |
| పాపులారా మీ పని | 56 | | | జి.డి.యం కీ.పు |
| పాపి రా రమ్ము లెమ్ము | 62 | | | జి.డి.యం కీ.పు |
| పాప వినాశము కల్గునే | 76 | | | సత్యభజన |
| పాపపరిహారముగలిగెగద | 78 | | | ,, |
| పరవస్తుడితడే ప్రభువగు | 79 | | | ,, |
| పోయెగపోయెగకాలము | 90 | 303 | | |
| ప్రవచనములెల్లన్ | 108 | | | సత్యభజన |
| పైనమైయున్నానయ్యా | 113 | 486 | | |

**బ**

| | | | | |
|---|---|---|---|---|
| బహుజనము లకటా | 98 | | | సత్యభజన |

**మ**

| | | | | |
|---|---|---|---|---|
| మా యేసుక్రీస్తుని మఱుగు | 1 | 490 | | |
| మంగళమే యేసునకు | 3 | 73 | | |
| మంగళము పాడరే | 6 | 72 | | |

| | ఈ.పు | ఆ.క్రై.పు | డా.కీ.పు | ఇ.కీ.పు |
|---|---|---|---|---|
| మంగళంబని పాడరే | 8 | 75 | | |
| మనసు కలిగిన వేళ | 23 | | | 1916 లూ.కీ.పు |
| మాయలోని మాయ | 24 | | 1878 | |
| మనమొదటితలిదండ్రుల్ | 35 | 295 | | |
| మన్నింపు దేవా | 99 | | | సత్యభజన |
| మనసానందముబొందుట | 101 | 489 | | |
| మూఢతములగు | 125 | | | సత్యభజన |
| మమ్ము జూడ నేడు | 136 | | | ,, |
| మనుజ దైవంబీ | 136 | | | ,, |
| మునిగిరయ్యానరులెల్ల | 145 | | | ,, |
| మోక్షాధికారి | 144 | | | ,, |

## య

| | | | | |
|---|---|---|---|---|
| యెహోవానామొరలించె | 10 | 16 | | |
| యెహోవా మా తండ్రికాడా | 100 | 435 | | |
| యెహోవా నీ మహిమ | 103 | 586 | | |
| యేసునామసుధామధుర | 5 | | 1878 | |
| యేసు దేవుడని యెరుంగరే | 17 | | | సత్యభజన |
| యేసునామంబెత్తి పాడుదమ | 31 | 433 | | |
| యేసు శిష్యులకు నెరుకజేసిన | 37 | 177 | | |
| యేసునామ మెంతో మధురం | 33 | 137 | | |
| యేసునామమే పావనము | 34 | 138 | | |
| యేసు సిలువలో వెలసిన | 46 | | | జి.డి.యం కీ.పు |
| యేసునాధ కధా సుధా | 85 | 299 | | |
| యేసువంటి ప్రియబంధుడు | 97 | 174 | | |

## ర

| | | | | |
|---|---|---|---|---|
| రారే మన యేసుస్వామిని | 16 | 83 | | |
| రారో జనులారా | 19 | 301 | | |
| రారే గొల్లవారా లారా | 49 | 105 | | |
| రారో చేతనులారా | 59 | | 1878 | |
| రావయ్యా యేసునాధ | 61 | 323 | | |

| | ఈ.పు | ఆ.క్రై.పు | డా.కీ.పు | ఇ.కీ.పు |
|---|---|---|---|---|
| **ల** | | | | |
| లేలెమ్మ నీలో | 64 | 365 | | |
| లోకము వారెల్ల లోకువ | 92 | 480 | | |

## వ

| | | | | |
|---|---|---|---|---|
| వందనమే యేసునకు | 9 | 74 | | |
| వద్దుమనసా బుద్దికురచ | 70 | 473 | | |
| వరములొసగవే | 138 | | | సత్యభజన |
| వందనమయ్యా | 32 | 74 | | |
| వినరే క్రీస్తు బాధ | 45 | | 1878 | |
| వినరే యో నరులారా | 48 | 104 | | |
| వచ్చి గాబ్రియేలు పల్కెను | 50 | 106 | | |
| వారే మంచి క్రైస్తవులు | 58 | 475 | | |
| వినరే నరులారా మనముల | 66 | 271 | | |
| వినరే యాపోస్తలుల | 69 | 251 | | |
| వినరే మనుజులారా క్రీస్తు | 83 | 150 | | |
| వినరయ్యా నరులారా | 84 | 155 | | |
| విసుకదే ప్రాణంబు | 94 | 478 | | |
| వినరే యో జనులారా | 105 | | 1878 | |
| విశ్వాధిపతి యేసు | 109 | | | సత్యభజన |
| వినరయ్యా యాపోస్తుల నాటీ | 119 | | | రక్షణచరిత్ర |
| వినరయ్యా లోకస్థులారా | 146 | | | విగ్రహనిర్మాణం |

## శ

| | | | | |
|---|---|---|---|---|
| శుభవర్తమానము | 111 | | | సత్యభజన |
| శాంతి యొనర్చున్ | 112 | | | సత్యభజన |

## స

| | | | | |
|---|---|---|---|---|
| సందియము వీడవే | 74 | 390 | | |
| సకలేంద్రియములారా | 102 | 485 | | |
| సంకటములురెండు | 110 | | | సత్యభజన |

| | ఈ.పు | ఆ.క్రై.పు | డా.కీ.పు | ఇ.కీ.పు |
|---|---|---|---|---|
| సర్వములో సర్వమునై | 137 | | | సత్యభజన |
| సిలువ వేయబడిన | 123 | | | సత్యభజన |
| సుఖమిచ్చె గదామాకు | 29 | 255 | | |
| సువార్తమధురవచనము | 30 | | 1878 | తె.కీ.పు1909 |
| సుదతులారా | 65 | 215 | | |

ఈ.పు = ఈ పుస్తకములో కీర్తన సంఖ్య.
ఆ.క్రై.పు = ఆంధ్ర క్రైస్తవ కీర్తనలు పుస్తకము.
డా.కీ.పు = డాసన్ కీర్తనలు పుస్తకము (1869, 1878 లో ముద్రించబడిన కీర్తనలు పుస్తకములు).
ఇ.కీ.పు = ఇతర కీర్తనలు పుస్తకమలు.
సత్యభజన, రక్షణచరిత్ర, నిస్తారరత్నకరం, విగ్రహనిర్మాణము ఈ పుస్తకములు పురుషోత్తము చౌధరిగారు వ్రాసినవి.వాటిలోనుంచి కీర్తనలను సంకలనము చేసినవి.
తెలుగు కీర్తనలు పుస్తకము (1909 సంవత్సరములో స్టీఫెన్‌సన్‌దొరగారు ప్రచురించిరి).
లూథరన్ కీర్తనలు పుస్తకము (1916,1937,1948 సం॥లో లూథరన్ సంఘము, రాజమండ్రివారు ముద్రించారు).

అర్ధములు:
106వ కీర్తనకు అర్ధములు.
1.అత్యంత 2.గట్టిగ 3.కష్టము/పాపములు 4.హీనులు 5.రక్షించును/కాపాడును 6.మోసపుచ్చు 7.అరికట్టి 8.వదలించి 9.అవసరములు 10.తీర్చును 11.సెలయేరు 12.పూజింపదగినది. 13.నిత్యము 14.వెదకు/విచారించు.